

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక


స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 343 • పేజీలు : 12 • బుధవారం 4 సెప్టెంబరు 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur| Ongole| Nellore Tirupati


## కేజ్రీవాల్‌కు కస్టడీ పొడిగింపు



న్యూఢిల్లీ,సెప్టెంబరు 3 : ఢిల్లీ మద్యం పాలసీ కేసుకు సంబంధించి సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌ను ఢిల్లీ హైకోర్టు పరిగణలోకి తీసుకుంది. ఈ మేరకు సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు దుర్గేష్ పాఠక్‌లకు సమన్లను జారీ చేసింది. అలాగే, ఈ కేసు సెప్టెంబర్ 11వ తేదీన విచారణ జరుగనుంది. ఢిల్లీ ఎక్సైజ్ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆప్ మాజీ కమ్యూనికేషన్ మిగతా 7లో

## నేను ఏ తప్పు చేయలేదు..



- హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటా..
- నాయకత్వ మార్పుపై సిద్ధరామయ్య

న్యూఢిల్లీ,సెప్టెంబరు 3 : కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సీఎం పదవి నుండి తనను తప్పించనున్నారని వస్తున్న మిగతా 7లో

## భారీగా పెరిగిన పర్సనల్ లోన్స్

- హౌసింగ్ లోన్స్‌కు తగ్గిన డిమాండ్..!



న్యూఢిల్లీ,సెప్టెంబరు 3 : బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి పర్సనల్ లోన్స్ లభ్యతలో భారీ పెరుగుదల నమోదైంది. ఈ ఏడాది జూలై చివరి నాటికి 14.4శాతానికి పెరిగి.. రూ.55.3లక్షల కోట్లకు చేరింది.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం.. ఆహారేతర రుణాల్లో వ్యక్తిగత రుణాల వాటా అత్యధికంగా 32.9శాతంగా ఉన్నది. ఆ మిగతా 7లో

## హర్యానా ఎన్నికలపై కసరత్తు



- పొత్తులపై కాంగ్రెస్‌తో చర్చించనున్న ఆమ్ ఆద్మీ పార్టీ
- గెలుపు కోసం రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా అడుగులు
- ఎన్నికల్లో పోటీపై రెండు పార్టీలు ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం

న్యూఢిల్లీ,సెప్టెంబరు 3 : వచ్చే నెలలో హరియాణా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అలాంటి వేళ.. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు కలిసి ఈ ఎన్నికల్లో వెళ్లేందుకు సమాయత్తమయ్యాయి. అందులో భాగంగా ఆ యా పార్టీల అగ్రనేతలు కేసీ వేణుగోపాల్, ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా బుధవారం ఉదయం కానీ భేటీ కానున్నారని సమాచారం. ఈ భేటీ ద్వారా ఎన్నికల్లో పోటీపై ఈ రెండు పార్టీలు ఒక నిర్ణయానికి వచ్చే అవకాశముందని తెలుస్తుంది. ఈ మిగతా 7లో





# బాధితులు అందరినీ ఆదుకుంటాం

- ◆ వాహనాలు వెళ్లలేని ప్రాంతాలకు జేసీబీలో బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి కష్టాలు తెలుసుకున్న సీఎం
- ◆ భవానీపురం నుండి సితార సెంటర్, కబేళా సెంటర్, జక్కంపూడి, వాంబే కాలనీ, అంబాపురం, కండ్రిక, నున్నా ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతాల్లో పర్యటన
- ◆ వరద బాధిత ప్రాంతాల్లో అందుతున్న సాయాన్ని పర్యవేక్షించి, ప్రజలకు ధైర్యం చెప్పిన ముఖ్యమంత్రి
- ◆ నీరు తగ్గని ప్రాంతాల్లో ప్రజలు పునరావాస కేంద్రాలకు రావాలని సూచన..
- ◆ ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది..
- ◆ దాదాపు 22 కి.మీ మేర జేసీబీపైనే ప్రయాణించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

నాలుగున్నర గంటల పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు విస్తృత పర్యటన

అమరావతి,సెప్టెంబరు 3 (ఆంధ్రపత్రిక): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడవ రోజూ వరద ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. మధ్యాహ్నం 1 గంట నుంచి దాదాపు నాలుగున్నర గంటలు వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. కార్లు వెళ్లే అవకాశం లేని చోట కాన్వాయ్ ను పక్కన పెట్టి దాదాపు 22 కిలోమీటర్లు జేసీబీపైనే చంద్రబాబు పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికీ మిగతా 12లో

## వరద బాధితులకు ఆహారం,నీరు అందాలి

- శ్రమిస్తున్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు - సహాయక చర్యలపై లోకేష్ పర్యవేక్షణ - కొనసాగుతున్న సహాయక చర్యలు..





విజయవాడ,సెప్టెంబరు 3 (ఆంధ్రపత్రిక): విజయవాడను పెద్ద ఎత్తున వరద ముంచెత్తడంతో.. ఏకంగా సీఎం చంద్రబాబు సహా మంత్రులు, అధికారులు అంతా విజయవాడలోనే తిష్ట వేసి మరీ వరద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. బాధితులకు ఎప్పటికప్పుడు మిగతా 7లో

## అందుకే నేను పర్యటించలేదు



- ◆ నా వల్ల సహాయక చర్యలకు ఆటంకం: పవన్ కళ్యాణ్
- ◆ విపత్తు సమయంలో నిందల కంటే ప్రజాసేవ చేయడమే ముఖ్యం..

అమరావతి,సెప్టెంబరు 3 (ఆంధ్రపత్రిక): వరద ప్రభావిత ప్రాంతాల్లో తాను పర్యటించక పోవడంపై వస్తున్న విమర్శలపై మిగతా 7లో

## ఇసుక సరఫరాలో స్వల్ప అంతరాయం

- రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ఇసుక 14,76,958 మెట్రిక్ టన్నులు
- రాష్ట్ర గనులు, అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా



అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రపత్రిక): రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపధ్యంలో ఇసుక సరఫరాలో నెలకొంటున్న స్వల్ప అంతరాయాన్ని త్వరలోనే అధిగమిస్తామని వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమీషనర్, గనులు, అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి, మిగతా 7లో



## బాధితులకు అండగా ఉండాలి

- ◆ వరద బాధితులకు జగన్ భారీ సాయం
- ◆ కూటమి ప్రభుత్వ ఘోర తప్పిదం వల్లనే వరదలు

అమరావతి,సెప్టెంబరు 3 (ఆంధ్రపత్రిక): కృష్ణానదికి భారీ వరదలతో విజయవాడలో తలెత్తిన పరిస్థితిని నిన్న స్వయంగా వైఎస్ జగన్ సమీక్షించిన సంగతి మిగతా 7లో

## జత్వానీని వేధించడం తగదు

- ◆ సజ్జన్ జిందాల్ కోసం జత్వానీకి వేధింపులు
- ◆ ఫోర్జరీ సంతకం కోసమే అధికార దుర్వినియోగం
- ◆ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల విమర్శలు



కడప, సెప్టెంబరు 3 (ఆంధ్రపత్రిక): కేంద్రంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం కడప స్టీల్‌ప్లాంట్‌పై ఏ మాత్రం స్పందన లేకుండా వ్యవహరిస్తోందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు మిగతా 7లో

## కొండెక్కిన కూరగాయల ధరలు..!



- ◆ పెరిగిన ధరలతో సామాన్యులకు చుక్కలు
- ◆ కిలో రూ. 500కు చేరిన వెల్లుల్లి ధరలు
- ◆ వరద ప్రాంతాల్లో దొరకని కూరగాయలు
- ◆ ఎన్నడూ లేనంతగా పెరిగిన కూరగాయల ధరలు

అమరావతి,సెప్టెంబరు 3 (ఆంధ్రపత్రిక): భారీ వర్షాలతో కూరగాయల ధరలు మరోమారు అమాంతం పెరిగాయి. ఎక్కడా కూరగాయల ధరలు అందుబాటులో లేవు. ప్రధానంగా అల్లం వెల్లుల్లి, ఉల్లిపాయల ధరలు మరోమారు మంటపెడుతున్నాయి. వెల్లుల్లి ఏకంగా మిగతా 7లో

## ఛత్తీస్‌ఘడ్‌లో మరోమారు కాల్పులు



- ఎన్‌కౌంటర్‌లో 9 మంది మావోల హతం
- దండకారణ్యంలో భారీ ఎన్‌కౌంటర్
- ఘటనాస్థలంలో పెద్ద ఎత్తున ఆయుధాలు స్వాధీనం
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం

రాయపూర్,సెప్టెంబరు 3 (ఆంధ్రపత్రిక): ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతం మరోసారి కాల్పులతో దద్దరిల్లింది. దంతెవాడ-బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లోని దండకారణ్యంలో మిగతా 7లో

## తక్షణ సాయంగా 2 వేల కోట్లు ఇవ్వండి..



- వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించండి - కేంద్రాన్ని మరోమారు కోరిన సిఎం రేవంత్ - మహబూబాబాద్ వరద ప్రాంతాల్లో పర్యటన - వరద నష్టంపై అధికారులతో సమీక్ష -జిల్లాల్లోనూ ఆక్రమణల తొలగింపునకు హైడ్రా

మహబూబాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రపత్రిక): కేంద్రం వరదలను జాతీయ విపత్తుగా గుర్తించి 2 వేల కోట్లను తక్షణ సాయంగా అందించాలని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. వరదనష్టం భారీగా ఉందని,5300 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారని మిగతా 7లో

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# ఈ పాపం ఎవరిది?

గత 50 ఏళ్ళలో ఎప్పుడూ లేనట్లుగా విజయవాడ నీటిలో మునిగిపోయింది.లక్షలాది ప్రజల బాధలు వర్ణనాతీతం! ఆ మధ్య చెన్నై నగరం విలవిలలాడిపోయింది.హైదరాబాద్ ఎదుర్కొంటున్న ఇబ్బందులు సాధారణమైనవి కావు! తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన 'హైడ్రా' సంచలనం సృష్టిస్తోంది. హైదరాబాద్ తో పాటు మిగిలిన పట్టణాలకు విస్తరించాలని వినతులు వెల్లువెత్తుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 'హైడ్రా' తరహా వ్యవస్థను నిర్మాణం చెయ్యాలని కొన్ని వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఇవి ఇలా ఉండగా, అధికార – ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు బురదచల్లుకొని రాజకీయం చేసుకొంటున్నారు.ఆర్థిక స్వార్థం, అవినీతి, నిర్లక్ష్యం,ఆశ్రితపక్షపాతం మొదలైన దుర్గుణాలు ప్రబలుతున్న కాలంలో, విపత్తులు వచ్చినవేళ ఆపదలు ఆకాశాన్ని అంటుతున్నాయి.సంసిద్ధమవ్వడంలో ప్రభుత్వాలు ఆమడదూరంలో ఆగిపోతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు ఈ సృష్టి ప్రారంభం నుంచి ఉన్నాయి.ఈ వైపరీత్యాలకు ఎంతో జీవరాశి మనుగడ కోల్పోయింది. లక్షల సంవత్సరాల ఈ పరిణామంలో భౌగోళిక స్వరూపాలు కూడా ఎన్నోసార్లు మార్పులకు గురయ్యాయి.మానవాళి మనుగడ ప్రారంభమైన నాటి నుంచి, బతుకుపయనంలో భాగంగా వలసలు జరుగుతూనే ఉన్నాయి. పల్లెలు, పట్టణాలు, నగరాలు అలా ఏర్పడినవే.మనిషికి – నీటికి ఉన్న సంబంధం విడదీయలేనిది.ఆధునిక నాగరికత, సంస్కృతి వేళ్లూనుకుంది నదీ పరీవాహక ప్రాంతాలలోనే. వాగులు,వంకలు,కాలువలు, చెరువులు,బావులు,తోటలు, అడవులు,నదులు,సముద్రాలు, కొండలు,కోనలు,గుట్టల దగ్గర జనావాసాలు ఏర్పడ్డాయి. నాగరికత అభివృద్ధి చెందే కొద్దీ పట్టణ,నగర నిర్మాణాలు ఊపందుకున్నాయి.చదువు, ఉద్యోగం,ఉపాధి కోసం పల్లెసీమల నుంచి పట్నవాసాలు పెరిగాయి. ఈ ప్రగతిలో భాగంగా పల్లెలు పట్టణాలుగా,పట్టణాలు, నగరాలుగా,నగరాలు, మహానగరాలుగా రూపాంతరం చెందాయి.జనాభా,జనసాంద్రత, వాహనాలు,పరిశ్రమలు, వ్యాపారాలు,విందు వినోద కేంద్రాలు,విద్యాలయాలు, కార్యాలయాలు అసంఖ్యాకంగా పెరిగాయి.సాంకేతికత పెరిగింది, అక్షరాస్యత పెరిగింది.మనిషి అవసరాలు పెరిగాయి.అవసరాల నుంచి ఆశ,అత్యాశ,దురాశలు కూడా గణనీయంగా పెరిగాయి. వీటికి తగ్గట్టుగా పట్టణ నిర్మాణ ప్రణాళికలు పెరగలేదు.ఆరోజు సుఖం తప్ప,రేపటి గురించి ఆలోచన లేదు.ఈ కారణాల వల్లనే, ఇలా వర్షాలు,తుపాన్లు,వరదలు వచ్చినప్పుడల్లా పాట్లు పెరుగుతున్నాయి తప్ప, తరగడం లేదు.అది హైదరాబాద్ వంటి మహానగరమైనా ఆంధ్రప్రదేశ్ లోని ఊర్లయినా తీరు ఒకటే. అవే కడగళ్ళు,అవే కన్నీళ్లు. ముంబయి,చెన్నై,హైదరాబాద్, విజయవాడ అన్ని చోట్ల ఇవే ఇబ్బందులు ఎదురవుతున్నాయి.నీళ్ల ప్రవాహంలో ఇళ్ళు,పొలాలు, పంటలు కొట్టుకుపోతున్నాయి. వాతావరణ శాస్త్రం,సాంకేతిక పరిజ్ఞానం,రవాణా,కమ్యూనికేషన్ పెరిగిన తర్వాత ప్రాణ నష్టం కొంత తగ్గింది కానీ,కష్ట నష్టాలు ఇసుమంత కూడా తగ్గక పోగా, పెరుగుతున్నాయి.దీనికి కారణాలు మానవ తప్పిదాలుగానే భావించాలి. కుంటలు,చెరువులు,బావులు,తోటలు,లోతట్టు ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టడం, ఇబ్బడి ముబ్బడిగా ఆవాసాలు పెరగడం వల్ల ఈ కష్టాలు ఎదురవుతున్నాయి.వీటన్నింటినీ ఆక్రమించి,దురాక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. 10మంది నివసించాల్సిన చోట 100మంది ఉంటున్నారు.మారుతున్న పట్టణస్వరూపం, పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా డ్రైనేజి వ్యవస్థను ఏర్పాటుచెయ్యడం లేదు. కొత్తగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లోనూ ఇదే తంతు కొనసాగుతోంది.గృహ అవసరాల పేరుతో,రియల్ ఎస్టేట్ పేరుతో అడ్డగోలుగా అనుమతులు ఇవ్వడం మొదలైన కారణాల వల్ల జలవిలయంలో మనిషి చిక్కుంటున్నాడు.విద్యుత్ ఘాతాలకు గురవుతున్నాడు. కరెంట్ పోయి కటికి చీకట్లో మగ్గుతున్నాడు.తప్పెవరిది ? వ్యక్తులదీ,వ్యవస్థలదేనని చెప్పాలి.గత టీ ఆర్ ఎస్ పాలనా కాలంలో తెలంగాణలో మిషన్ కాకతీయ అనే వినూత్న పథకానికి శ్రీకారం చుట్టారు.చెరువుల పునరుద్ధరణ ఈ పథకంలోని ముఖ్యఉద్దేశ్యం.కొంతకాలం బాగానే నడిచింది.ఎందుకో!మళ్ళీ ఆగిపోయింది. ఈ పథకం అజరామరంగా సాగితే, ఒకప్పటి మంచి వాతావరణం మళ్ళీ వస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో లోతట్టు ప్రాంతాల్లో నిర్మాణాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి.దాని మూల్యం ఇలా వరదలు వచ్చినప్పుడల్లా అనుభవిస్తున్నారు.ఏ ప్రాంతంలో నిర్మాణాలు ఎలా ఉండాలి అన్న విషయంలో ప్రభుత్వాలకు స్పష్టత పెరగాలి. ఎంత స్థలంలో ఇండిపెండెంట్ ఇళ్ళు ఉండాలి,ఎక్కడ అపార్ట్మెంట్లు నిర్మాణం చేపట్టాలనే అంశాల్లో ప్రామాణికత ఇంకా పాటించాల్సిన అవసరం ఉంది.అడ్డగోలుగా అనుమతులు ఇవ్వకుండా ఆచితూచి వ్యవహరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే.ఆదాయం అవసరమే.అదే సమయంలో, భవిష్యత్తు ప్రణాళిక అంతకంటే ముఖ్యం.ప్రణాళికా విధానాల్లో సమూలమైన మార్పులు రావాలి.డ్రైనేజి వ్యవస్థ పెరగాలి.కుంటలు, చెరువులు,బావులు,తోటలు,లోతట్టు ప్రాంతాల్లో నిర్మాణాలకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు ఇవ్వకూడదు.రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అక్రమనిర్మాణాలు చాలా వున్నాయి.వాటిపై దృష్టి సారించి కఠినమైన చర్యలు చేపట్టాలి.అకాల ప్రకృతి వైపరీత్యాలకు భూతాపం పెరుగుతూ ఉండడం ఒక కారణం.పర్యావరణ సమతుల్యతలు పాటిస్తే తప్ప ఈ విపత్తులు తగ్గుముఖం పట్టవు.ప్రపంచంలో భారీ విపత్తులకు గురవుతున్న దేశాలలో చైనా,అమెరికా తర్వాత భారతదేశం మూడవ స్థానంలో ఉందని నివేదికలు చెబుతున్నాయి.ప్రకృతి వైపరీత్యాల్లో వరదలది 44శాతంగా గణాంకాలు సూచిస్తున్నాయి.భీభత్సమైన వరదల ప్రభావంలో భారతదేశం రెండవ స్థానంలో ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తుపానుల నుంచి రక్షించే శక్తి మడఅడవులకు ఉంది. అవి అంతరించి పోతున్నాయి.భారతదేశంలో మడఅడవులు విశాఖపట్నం,కాకినాడ ప్రాంతాల్లో ఎక్కువగా ఉండేవి.ఎర్రమట్టి దిబ్బలు కూడా ప్రకృతి వైపరీత్యాలకు రక్షణ కవచాలుగా నిలుస్తాయి.సునామీ వంటి భీభత్సాల నుంచి ముప్పు తగ్గించడంలో మడఅడవుల పాత్ర చాలా విశిష్టమైంది. మానవ వనరులు ఒక్కటే పెరిగితే సరిపోదు.సహజ వనరులు పెరగాలి.ముందుగా వీటిని కాపాడుకోవాలి.ఏ గ్రామం, పట్టణం,నగరం,మహానగరం అభివృద్ధి పరచినా ప్రణాళికా బద్ధంగా సాగాలి.ఎప్పుడో! సింధూ నాగరికత దశలోనే డ్రైనేజీ,నగర నిర్మాణం ఎంతో ప్రణాళికాబద్ధంగా జరిగాయని చరిత్ర పుస్తకాల్లో చదువుతున్నాం.నిన్న మొన్నటి నిజాం కూడా శాస్త్రీయమైన పద్ధతిలోనే నిర్మాణాలు చేపట్టారు.ప్రపంచంలో న్యూయార్క్, వాషింగ్ టన్ గొప్ప ప్రణాళికా నగరాలుగా చెబుతారు.భారతదేశంలో ఈ మధ్యనే ఏర్పడిన చండీగఢ్ కూడా నిర్మాణంలో ప్రామాణికతలు పాటించిన ప్రణాళికా బద్ధమైన నగరంగా అభివర్ణిస్తారు.నేటి అవసరాలు,భవిష్యత్ కష్టాలు బేరీజు వేసుకుంటూ, శాస్త్రీయమార్గంలో జాగ్రత్తలు తీసుకుంటూ, అభివృద్ధి జరిగినప్పుడు, కనీసం భావితరాల వారికైనా ఈ కష్టనష్టాలు రాకుండా ఉంటాయి. ప్రపంచంలో ఉత్తమమైన పథకాలు, పద్ధతులను అనుసరించిన నగరాలు ,రాష్ట్రాలు,దేశాలను సందర్శించి,పరిశీలించి వాటిని ఆదర్శంగా తీసుకొని మన ప్రభుత్వాలు ముందుకు సాగాలి.తిలాపాపం తలాకాస్త అన్న చందాన ఈ పాపంలో అందరికీ వాటా వుంది. ఎప్పుడు మారుతారో!

# సమాజ సమిష్టి బాధ్యత

జల ప్రలయంవ్యవస్థల విధ్వంసం ప్రకృతి విపత్తుకు జనం కకావికలం తెలుగు రాష్ట్రాల్లో జల విలయం ప్రకంపనలు సృష్టించింది కనీ వినీ ఎరుగని విషాదం విధ్వంసం వరద నీటి ఉధృతితో పట్టణాల్లో కాలనీలు జలమయమైనాయి ప్రజల ఆకలి కేకలు ఆర్థనాదాలు మిన్ను ముట్టాయి ఆస్తి నష్టం ప్రాణనష్టంపంట నష్టం పశువులు మృత్యువాత పడ్డాయి పల్లె వాసులు కష్టజీవులు నీటిలో కొట్టుకొని ప్రాణాలు కోల్పోయి ఎన్నో కుటుంబాల్లో విషాధం నిండుకుంది తిండి లేదు తాగడానికి గుక్కెడు మంచినీళ్లు లేవు మన్నూ మిన్నునుఏకంచేసిన కుండ పోత వానలు ముంచెత్తిన వరథలు పొంగిన వాగులుకుంగిన వంతెనలుస్తంభించిన రవాణా నడవని రైళ్లు బస్సులు భారీ వరదలకు ఛిద్రమైన జనజీవనం చెరువుల్లో వెంచర్లు నదీ తీర ప్రాంతాల విధ్వంసం చెట్ల ధ్వంసం కొండలు గుట్టలు ధ్వంసం చెరువులను ఆక్రమిస్తే నీళ్లన్నీ పల్లెలను పట్నాలను ఆక్రమించాయి సామాన్యుల కష్టాలు పాలకులకు పట్టవు అధికారానికి డబ్బుకు ఆశపడి అనుమతిస్తే బాధపడేది సామాన్య ప్రజలే కూర్చున్న కొమ్మను నరుక్కునే మానవ అవివేకం ప్రకృతి వైపరీత్యాల ముప్పును తీవ్రతరం చేస్తుంది కాలుష్యం పెరిగి నీటి కాలుష్యం అంటువ్యాధులతో ప్రజారోగ్యానికి ముప్పు తెలుగు రాష్ట్రాల్లో కబ్జా కోరుల విశ్రుంకలత్వ వికటాట్టహాసానికి చెరువులు కుంటలు మాయమైనాయి ఇష్టారీతిన చెలరేగిన ఇసుక మాఫీయాభూ మాఫీయా నీటి మాఫియా వరదల ఉధృతికి ఆజ్యం పోశాయి. చెరువుల పునరుద్ధరణ సహజవనరుల దోపిడీ అరికట్టాలి హైడ్రాను విస్తరించి చెరువుల కుంటలఆక్రమణ దారుల భరతం పట్టాలి ప్రకృతి పర్యావరణ రక్షణఇసుక దోపిడిని ఆపాలి కొండలు గుట్టల ధ్వంసం ఆపాలి ఇంకుడు గుంతలు వరదనీటి కాలువల మెరుగైన నిర్వహణ సంతరించుకోవాలి మనషి తనం మృగ్యమై రాజకీయ ప్రయోజనాలకు ఆజ్యం పోసే పాలక గణం ప్రకృతి విధ్వంసానికి కాలుష్యానికి కారణమయ్యే పారిశ్రామిక విధానాలను ప్రభుత్వం కట్టడి చేయాలి మానవత్వాన్ని చూపాల్సిన ఆపత్కాలంలో స్వార్థ శక్తుల దౌర్భాగ్య రాజకీయాలను కట్టడి చేయాలిస్వచ్ఛంధ సంస్థలు ధార్మిక సంస్థలు పౌరసమాజంఆ పన్నులకు అండగా సమాజ సమిష్టి బాధ్యతగా గుర్తెరిగి మసలాలి ఆహారం వస్త్రాలు ప్రాణ రక్షణ మందులు బాధితులకు స్వచ్ఛందంగా అందించాలి ఆపన్నులకు భరోసా భద్రత ఆపన్నహస్తం అందించాలి మానవత్వాన్ని చాటాలి ప్రభుత్వాలు జలవనరుల ఆక్రమణలను తొలగించి మానవ వనరుల వికాసమే ధ్యేయంగా ప్రజారోగ్యరక్షణే లక్ష్యంగా ప్రకృతి రక్షణే కార్యాచరణగా ప్రగతి శీలఅభివృద్ధి వ్యూహాలతో మురుగునీటి పారుదల మెరుగుపరచి ఎవరదల ఉధృతి నుండి జనావళిని రక్షించాలి హైదరాబాద్ 'వరంగల్ 'ఖమ్మం విజయవాడ నగరాల్లో చెరువుల వాగుల ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపాలిప్రభుత్వ ఆస్తులను ఆక్రమించిన వారినిదేహ ద్రోహులుగా గుర్తించి కఠినంగా శిక్షించాలి బాధితులకు తాత్కాలిక సాయం కాకుండ వరదల నియంత్రణకు శాశ్వత చర్యలు తీసుకొని నగరాలలో జీవకళను పునరుద్ధరించాలి.

**నేదునూరి కనకయ్య**

## దీర్ఘకాలిక ప్రణాళికలతో
# వరదల ఉధృతికి అడ్డుకట్ట



నదిప్రవాహ మార్గాలు హద్దులు(గట్లు) దాటి జలప్రవాహం నిలువరించ లేకపోవడంవల్ల పరివాహక ప్రాంతాలు మునిగిపోయే స్థితిని వరద అంటారు. భారతదేశంలో అనేక ప్రాంతాల్లో విభిన్న భౌగోళిక పరిస్థితులు శీతోష్ణస్థితులు వర్షపాతం ఉండడంవల్ల ఏదోఒక ప్రాంతంలో అనూహ్యమైన వరదలు సంభవిస్తున్నాయి. అధిక వర్షపాతం జూన్ నుండి సెప్టెంబర్ నెలల మధ్య వుంటుంది.ఈ కాలంలో వరదలు సంభవించే ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయి. తుఫాన్లు వాయుగుండం వచ్చిన కూడా వరదలువస్తాయి. అధిక వర్షపాతం వల్లవస్తాయి. మన దేశంలో సుమారు 3290 లక్షలహెక్టార్ల విస్తీర్ణంలో భూమి వరద ముంపుకు గురయ్యే ప్రమాదంవుంది అని అంచనాలు తెలుపుతున్నాయి. ప్రతి యేటాదాదాపు78లక్షలహెక్టార్ల భూమివరదప్రభావానికిగురి అవుతుంది. ఏటా దాదాపు 1700 మంది వరదల వల్ల మరణిస్తున్నారు. యేటా రూ 1805 కోట్ల రూపాయల ఆస్తి పంట నష్టం జరుగుతుందని. ఇండ్లు రోడ్లు దెబ్బతిన్నాయని పలు అధ్యయనాలు వెల్లడించాయి.1977లో అత్యధికంగా 11316 మందిమృత్యువాత పడ్డారు.దేశం వివిధ ప్రాంతాలలో వరదలు దేశములో అనేక రాష్ట్రాలలో కేంద్రపాలిత ప్రాంతాలలో వరదలు సంభవించే అవకాశాలు వున్నాయి.
దేశం విస్తీర్ణంలో 8 శాతం భూభాగం వరదలకు గురవుతున్నటు అంచనాలు తెలుపుతున్నాయి.

**వరదలకు కారణాలు**

1 నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడడం. నది ప్రవాహ దిశను మార్చుకోవడం వల్ల వరదలు వస్తాయి 2) అధిక వర్షపాతం వాయుగుండాలు వరదలకు కారణం అవుతాయి. 3)నదులు చెరువులు కాలువలకు నదీ ప్రవాహ మార్గాలలో పూడికతో నిండిపోవడం.

4)కాలం చెల్లిన డ్రైనేజీ వ్యవస్థలకు తోడు జలవనరుల ఆక్రమణల కారణంగా కొద్దిపాటి వానకే పట్టణాలు మునుగుతున్నాయి. భారీ వర్షాల సమయంలో భీతావహ పరిస్థితులు నెలకొంటున్నాయి.

ప్రస్తుతం విజయవాడ దుస్థితికి ఇవే కారణం డ్రైనేజీల్లో పూడికతీతపై స్థానిక సంస్థల అలక్ష్యం పలు ప్రాంతాల్లో ప్రజలకు శాపంగా మారింది. ప్రస్తుత పరిస్థితిలో సహాయక చర్యలు కొనసాగిస్తునే పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. పునరావస కేంద్రాల్లో వసతులు కల్పించడం. వైద్య బృందాలను ప్రాణాధార ఔషధాలను సదాసిద్ధంగా ఉంచడం .పాలకుల కర్తవ్యం.

5)అతిగా అడవులను నరికివేయడం పట్టణీకరణ పారిశ్రామికీకరణ వల్ల వరదలుఉధృతి పెరుగుతుంది. 6)కొండచరియలు విరిగిపోవడంవల్లనదులుతమ ప్రవాహ మార్గాన్ని మార్చుకోవడం వల్లవరదలు వస్తాయి. .7)ఆనకట్టలు చెరువులు గట్ల నిర్మాణంలో సరైన ఇంజనీరింగ్ ప్రమాణాలు పాటించకపోవడంనాసిరకం నిర్మాణాలు చేయడం వల్ల చెరువులు కుంటలు తరచుగా గండి పడి వరదలు వస్తాయి. మహానగరాల్లో ప్లాస్టిక్ కవర్లను డ్రైనేజీలో వేయడంమహానగరాలలోనాళాలు డ్రైనేజ్ వ్యవస్థ నిర్వహణ లోపం ప్లాస్టిక్ కవర్లను డ్రైనేజీలు వేయడం చెత్త వ్యర్థ పదార్థాలతో డ్రైనేజ్ నిండిపోవడంతో నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటాయి. ఫలితంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు వరదలకు గురిఅవుతున్నారు. మహానగరాల్లో సమగ్రమైన పట్టణ ప్రణాళికల నిర్వహణ లోపాలుహైదరాబాద్ ముంబాయి మద్రాస్ మొదలగు మహానగరాల్లో పట్టణ ప్రణాళికల అమలులో నెలకొన్న నిర్వహణలోపాలు సిబ్బందిలో జవాబుదారీ తనంలేకపోవడం.పర్యవేక్షణలోపం. మున్సిపాలిటీ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల లోతట్టు ప్రాంత వాసులు తరుచుగా వరదలతో సహజీవనం చేసే స్థితి నెలకొనడం శోచనీయం. వర్షం నీరు ఇంకుడు గుంతలు లేకపోవడం వర్షం పడినప్పుడు నీరుభూమిలోకిఇంకే విధంగాసరైన ఇంకుడు గుంతలను ఏర్పాటు లేకపోవడం.ప్రణాళికలులేకపోవడంనీరుఇంకే మార్గాలను పూర్తిగాఅడ్డుకోవడం వల్లతరచుగావర్షాకాలంలోవరదలు తాకిడిని వేసవి కాలములో నీటి కొరతను ఎదుర్కొంటున్నారు.

**వరదలకు ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు**

1)నదీతీర ప్రాంతాలలో తరచుగా వరదలకు గురయ్యే అవకాశం ఉన్న ప్రజలను వరదలు రావడానికి ముందుగానే తరలించాలి. వారికి పునరావస సౌకర్యాలు కల్పించాలి.దీనివల్ల వరదల సమయంలో జరిగే నష్టాన్ని అరికట్టవచ్చు.
2)దగ్గర్లోని పునరావస కేంద్రాన్ని గుర్తించి అక్కడికి ప్రజల తరలించాలి. ఎత్తయిన మార్గాలను ఏర్పాటు చేసుకోవాలి.
3)వైద్య ఆరోగ్య సౌకర్యాలను ముందస్తుగానే సమకూర్చుకోవాలి. ప్రత్యేకంగా డయేరియా తేలు' పాముకాటుకు సరైన ఔషధాలను సిద్ధంగా ఉంచుకోవాలి.
4)మీడియా 'టి 'వి 'ప్రసార ప్రచార మాధ్యమాలద్వారా వరదల వల్ల వచ్చే ముప్పులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రచారం చేయాలి .టార్చిలైట్ బ్యాటరీలు గొడుగు లాంటివి సమకూర్చుకోవాలి.
5)తాగడానికి మంచినీరు ఆహార పదార్థాలు ' నిత్యవసర వస్తువులు బట్టలు సామాగ్రిని నిలువ చేసుకోవాలి .6)వాటర్ ప్రూఫ్ దుస్తులను ఇతర విలువైన వస్తువులను సిద్ధం చేసుకోవాలి. 7)గ్రామీణ ప్రాంతాల్లో ఎత్తైన ప్రదేశాలను గుర్తించి పశువులను అక్కడికి తీసుకువెళ్లే ఏర్పాటు చేసుకోవాలి.

**వరద తాకిడికి గురైన ప్రాంతాలలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి**

1)సురక్షితమైన నీటిని తాగాలి లేని చోకలరా డైయేరియా లాంటి వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉంది.
2)ఆహారపదార్థాలు వరద నీటిలో తడువ కుండ జాగర్త పడాలి
3)నీటిని బ్లీచింగ్ పౌడర్ చే శుభ్రపరచాలి.వరద నీటిలోకి వెళ్ళకూడదు.
4)తెగిపడిన విద్యుత్తు తీగలను తాకరాదు.
5)నిత్యావసర వస్తువులు ఆహార పదార్థాలు దుస్తులు మందులు దగ్గర వుంచుకోవాలి
6)నివాస ప్రాంతం త్వరలో ముంపుకు గురవుతుంది అని తెలియగానే ఆప్రాంతాన్ని వదిలి వెళ్ళడానికి సిద్ధంగా ఉండాలి.
7)వారిది తాకిడికి గురయ్యే ప్రాంత ప్రజలకు ప్రతేక బీమా సౌకర్యం కల్పించాలి. ఆర్థిక నష్టనివారణ చర్యలు తీసుకోవాలి.
8)వస్తువులను ఎత్తైన ప్రదేశంలో నిల్వ చేసుకోవాలి
9)గ్రామీణ ప్రాంతాలలో పశువులు 'వ్యవసాయ సామాగ్రి ఇతర సామాగ్రి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చెయ్యాలి

**వరదలవల్ల నష్టాలు**

1)వరదల వల్ల తీవ్ర ఆస్తి నష్టం ప్రాణ నష్టం జరుగుతుంది .ఇల్లు' పంట పొలాలు దెబ్బతింటున్నాయి .
2)పంట పొలాల్లో ఇసుక మేటలు వేయడం వల్ల అది వ్యవసాయానికి పనికిరాకుండా పోతుంది. ఆహార కొరత ఏర్పడుతుంది.
3)వరదల వల్ల ప్రజలు నిరాశ్రయులు అవుతారు.పశువులు మృత్యువాత పడతాయి .
4)తాగునీరు కలుషిత మవుతుంది. తాగడానికి మంచినీరులభించదు.
కలుషిత నీరు తాగడంవల్ల కలరా 'డైయేరియా లాంటి అంటువ్యాధులు ప్రభులుతాయి.
5)నేల మేట తో క్రమక్ష్యయానికి గురై సారవంతం తగ్గుతుంది.
6)అధిక వరదల వల్ల రోడ్లువంతెనలు రైల్వేస్ ట్రాక్లు దెబ్బతిని ప్రజా రవాణా వ్యవస్థదెబ్బతింటుంది.
ప్రజలుఅనేక ఇబ్బందులకు గురవుతారు.
7)విద్యుత్ 'టెలిఫోన్ వ్యవస్థ దెబ్బతింటుంది.పురాతన భవనాలు దెబ్బతింటాయి కూలిపోతాయి. ఆస్తి నష్టం ప్రాణ నష్టం జరుగుతుంది.
8)ఆహారం' పశుగ్రాసం కొరత ఏర్పడుతుంది.
9)అటవీ ప్రాంతంలో వరదల వల్ల జీవవైవిధ్యం దెబ్బతింటుంది.
10)మహానగరాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమౌతాయి. ప్రజలుఅనేక సమస్యలు ఎదురుకొంటారు.
11)ఆకస్మిక వరదల ఉధృతివల్లకొంత మందిమరణిస్తారు. తీరప్రాంతంలో చేపలుపట్టే వారుమృత్యువాత పడతారు.

**నివారణా చర్యలు**

అడవులు పెంచాలి. నదులఎగువప్రాంతంలోఅడవులు పెంచాలి .వర్షపు నీరు భూమిలోకి ఇంకిపోయి వరదలు రాకుండా చర్యలు తీసుకోవాలి . వరద కాలువలు నిర్మించాలి పోడు వ్యవసాయాన్ని తగ్గించాలి. నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలి. వరదనీటిని వరద కాలువల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించాలి. ప్రాజెక్టులు ' రిజర్వాయర్లు నిర్మించాలి. వరద ముంపుకు గురైన ప్రాంతాలలో ప్రాజెక్టులు నిర్మించాలి.రిజర్వాయర్లు నెలకొల్పాలి. వరదలు సమాచారం ముందుగానే తెలియజేయాలి. వరదలకు సంభందించిన సమాచారం వరదలు ముప్పును ముందుగానె రేడియో 'మీడియా ద్వారా ప్రజలకు 'ప్రభుత్వ యంత్రాంగం తెలియచేయాలి. ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే స్పందించి సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదిక పైన చేపట్టాలి. పునరావస కేంద్రాలు ఏర్పాటు చేయాలి. లోతట్టు ప్రాంత ప్రజలను ఎత్తైన ప్రాంతాలకు తరలించాలి.వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి. శాశ్వత ప్రాతిపదికన వరద నివారణ నిర్వహణ పాలన వ్యవస్థను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన "హైడ్రా" లాంటి సంస్థను స్వయం ప్రతిపత్తితో శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయాలి. వరదల నివారణ ప్రజల పునరావాసం ' ప్రాజెక్టుల నిర్మాణం ' నిర్వహణ ' జల వనరుల సంరక్షణలో ప్రభుత్వ సిబ్బందికి సాంకేతిక శిక్షణ పాలన పరమైన అంశాల పట్ల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. వరదలు నివారణలో ప్రభుత్వ యంత్రాంగం క్రియాశీలకంగా పని చెయ్యాలి. మెరుగైన డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి నగరాలలో మెరుగైన డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చెయ్యాలి. చెరువుల రక్షణ చెక్ డాములు 'చెరువుల రక్షణ' కుంటల రక్షణ 'బావులు' నీటి గుంతలు ఏర్పాటు చెయ్యాలి. కాంటూర్ కందకాలు ఏర్పాటు చేసి నీటిని నియంత్రించాలి.పౌర సమాజానికి భాగస్వామ్యం వరద నివారణ 'నియంత్రణ నిర్వహణలో పౌర సమాజానికి భాగస్వామ్యం కలిగించాలి.

**వరద నష్టం తగ్గించడానికి ప్రభుత్వం చేబడుతున్న చర్యలు**

కేంద్ర ప్రభుత్వం వరదల సమయంలో తగిన చర్యలు చేపట్టడానికి నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సెస్కు చెందిన బెటాలియన్లకు తగిన శిక్షణ ఆధునాతన పరికరాలను సమకూర్చుతుంది. వరదలువచ్చినప్పుడుప్రభుత్వం తరపున హెచ్చరికలు ప్రకటనలు జారీచేయడం ఆహారం ఔషధాలు సమకూర్చడం ప్రభుత్వం చేపడుతుంది. వరదలకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే తెలియజేయడం జరుగుతుంది. వరదలు సంభవించినప్పుడు నీటిని మళ్ళించడానికి ప్రత్యేక కాలువలు నిర్మిస్తున్నారు.వరదలు ఉధృతి ఉన్న ప్రాంతాల్లో హెచ్చరికలను కూడా జారీ చేయడం జరుగుతుంది. సెంట్రల్ వాటర్ కమిషన్ భారత దేశంలో 62 నదీ పరివాహ ప్రాంతాల్లో 945ప్రదేశాల నుండి వాతావరణం సమాచారాన్ని గ్రహిస్తూ తగుజాగ్రత్తలు అవగాహన చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపడుతున్నారు. సామాన్య ప్రజలకు వరదలకు సంబంధించిన జాగ్రత్తలు గురించి చైతన్యవంతం చేసే వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు . గ్రామస్థాయి నుంచి అన్ని వర్గాలకు శిక్షణ ఇవ్వాలి. వివిధ సంస్థలుపౌరసమాజం స్వచ్ఛంద సంస్థలు' మహిళా సంఘాలు 'యువజన సంఘాలు 'విద్యార్థులను వరదల నివారణ నిర్వహణ లో అవగాహన చైతన్య సదస్సులు ప్రభుత్వం నిర్వహించాలి .వరదల నివారణ నిర్వహణ ప్రకృతి పర్యావరణ పరిరక్షణ పాఠ్యాంశంగా చేర్చాలి. విశ్వవిద్యాలయంలో వరదల గురించిపరిశోధన చేయాలి. వరదల నివారణ నిర్వహణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడానికి స్థానిక ప్రభుత్వాలు మున్సిపాలిటీలు రాష్ట్ర ప్రభుత్వం సమిష్టిగా కృషి చేయాలి.

**ప్రకృతి రక్షణ భూమి పునరుద్ధరణ**

సహజవనరుల సంరక్షణ సద్వినియోగంతో సుస్థిరాభివృద్ధి కొరకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. జలవనరుల సమగ్ర అభివృద్ధితో వరదల ఉధృతి నుండి జనరక్షణ చర్యలు చేపట్టి జనాభ్యుదయానికి ప్రత్యేక కార్యాచరణతో ప్రభుత్వ ముందుకు వస్తుందని ఆశిద్దాం

**నేదునూరి కనకయ్య**

# గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియా దాదాభాయి నౌరోజీ

దాదాభాయి నౌరోజీ కాంగ్రెస్ పార్టీకి వాస్తవానికి ప్రాతఃస్మరణీయులు. ఆ పార్టీ వ్యవస్థాపక సభ్యులలో ఆయన ఒకరు. మూడు పర్యాయాలు జాతీయ కాంగ్రెస్ వార్షిక సభలకు అధ్యక్షత వహించిన నాయకులు. నౌరోజీ జీవిత చరిత్ర 19 వ శతాబ్దంలో భారతీయ జాతీయవాదుల పోరాటాలను స్పష్టంగా తెలుపుతుంది. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించక ముందు నుంచే స్వాతంత్ర్యం కోసం గళమెత్తారు. నౌరోజీ, ఎ. ఓ. హ్యూమ్, దిన్షా ఎదుల్జీ వాచాతో కలిసి భారత జాతీయ కాంగ్రెస్ ను స్థాపించారు.1892 నుండి 1895 వరకు ఇంగ్లాండ్ చట్టసభ అయిన యునైటెడ్ కింగ్డమ్ హౌస్ ఆఫ్ కామన్స్ లో కొనసాగారు. ఆయన ఆ పదవి పొందిన మొదటి ఆసియా వ్యక్తి. దాదాభాయ్ నౌరోజీ (సెప్టెంబర్ 4, 1825– జూన్ 30, 1917) పార్సీ మతానికి చెందిన విద్యావేత్త, మేధావి, పత్తి వ్యాపారి, తొలితరం రాజకీయ, సామాజిక నాయకులు, బ్రిటీష్ చట్టసభ సభ్యుడైన తొలి ఆసియా ఖండ వాసి అయిన దాదాభాయ్ నౌరోజీ 1825 సెప్టెంబరు 4 న, బొంబాయిలో నవసారిలో ఒక పార్సీ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి పలన్జీదోరోజి జొరాష్ట్రియన్ మత పురోహితులు. బరోడా మహారాజు మూడవ శాయాజీరావు గైక్వాడ్ సహాయంతో కళాశాల ఎలిఫెన్స్టోన్ ఇనిస్టిట్యూట్లో చదివారు. తరువాత అక్కడే ఆచార్య పదవిని పొందారు. మహిళలకు విద్యను ప్రోత్సహించ డానికి జరిగిన ప్రత్యేక తరగతులలో ఆయన బోధించారు. తన జొరాష్ట్రియన్ మతంలో సంస్కరణల కోసం ఆయన పాటు పడ్డారు. నౌరోజీ ఆలోచనలు, ఆర్థికశాస్త్రంపై ఆధారపడినవి.కామాకో' అనే కంపెనీలో భాగస్వామి కావడానికి 1855 సంవత్సరంలో ఆయన లండన్ వెళ్లారు. ఆ కంపెనీ లివర్పూల్ లో బ్రిటన్లో స్థాపించబడిన మొదటి భారతీయ కంపెనీగా అవతరించింది. భారత స్థితి గతులను ఆంగ్లేయులకు విడమరిచి చెప్పారు. నౌరోజీ ఇంగ్లాండ్లో లిబరల్ పార్టీలో చేరారు. మూడేళ్లలో దాదాభాయ్ రాజీనామా చేసి, తన సొంత వ్యాపార సంస్థ 'దాదాభాయ్ నౌరోజీ %డ%



సెప్టెంబర్ 4...దాదాభాయి నౌరోజీ జయంతి

కో.' ప్రారంభించారు. ఇంగ్లండ్లో భారతీయుడు స్థాపించిన తొలి వాణిజ్య సంస్థ అదే. 1865 నుండి 1866 వరకు, లండన్ విశ్వ విద్యాలయ కళాశాలలో గుజరాతీ భాషా ఉపాధ్యాయులుగా కూడా పనిచేశారు. 1865 లోనే, భారతీయ రాజకీయ, సామాజిక మరియు సాహిత్య సమస్యలు మరియు విషయాలను చర్చించి, ఇంగ్లాండ్ ఓటర్లకు అనుకూలంగా మార్చడం ఉద్దేశ్యంతో దాదాభాయ్ నౌరోజీ 'లండన్ ఇండియన్ సొసైటీ'ని స్థాపించారు. ఆయన 'ఈస్ట్ ఇండియా అసోసియేషన్' ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. అది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ యొక్క ప్రధాన సంస్థ, స్థాపన ప్రధాన ఉద్దేశం బ్రిటిష్ వారి ముందు భారతీయుల శక్తిని బలోపేతం చేయడం. 1874 లో బరోడా ఇన్స్టిట్యూట్ యొక్క మున్షి పోస్ట్ బాధ్యతను స్వీకరించారు.1875 లో, అతను బొంబాయి మునిసిపల్ కార్పొరేషన్ సభ్యుడు అయ్యారు. నౌరోజీ 1886 లో మొదటిసారిగా బ్రిటిష్ పార్లమెంట్ పదవి కోసం పోటీ చేసి, ఓటమి పాలు కాగా, 1892 లో తన రెండవ ప్రయత్నంలో విజయం సాధించి, హౌస్ ఆఫ్ కామన్స్కు ఎన్నికైనారు. బ్రిటిష్ పార్లమెంటులో ఎన్నికైన మొదటి ఆసియా వ్యక్తిగా 1892 నుండి 1895 వరకూ పార్లమెంట్ సభ్యుడిగా యునైటెడ్ కింగ్?డమ్ హౌస్ ఆఫ్ కామన్స్ లో కొన సాగారు. బ్రిటిష్ పార్లమెంట్ లో భారత ఉప ఖండంలో వలస రాజ్యాల దోపిడీ సమస్యను మొదట లేవనెత్తారు. 1895 సంవత్సరానికి భారత వ్యయంపై రాయల్ కమిషన్ సభ్యులుగా కూడా నియమించ బడ్డారు.బరోడా మహారాజు శయాజీరావు గైక్వాడ్ కాలంలో సంస్థాన దివానుగా పని చేసారు.1874 లో, ఆయన బరోడా ప్రధాన మంత్రి, 1885 నుండి 1888 వరకు ముంబై శాసన మండలి సభ్యుడయ్యారు. అలా ప్రజా జీవితంలో ప్రవేశించిన ఆయన "గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియా" గా ప్రసిద్ధి గాంచారు. భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపకులు సురేంద్రనాథ్ బెనర్జీతో పాటు వ్యవస్థాపకుల్లో ఒకరు. 1886 లో నౌరోజీ దాని అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.1893 లో లాహోరులో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశానికి రెండోసారి అధ్యక్షత వహించారు. 1906 లో జరిగిన కలకత్తా సమావేశానికి కూడా అధ్యక్షత వహించి మూడు సార్లు ఈ పదవి పొందిన తొలి నాయకులుగా అవతరించారు. దాదాబాయి నౌరోజీ పలు గ్రంథాలు రచించారు. ఆయన రాసిన పుస్తకం "పావర్టీ మరియు అన్బ్రిటిష్ రూల్ ఇన్ ఇండియా" అనే పుస్తకం భారతదేశం నుండి బ్రిటన్ తరలిస్తున్న నిధుల గురించి వివరించిన మొదటి పుస్తకం. అలాగే పార్సీల మర్యాదలు మరియు ఆచారాలు, యూరోపియన్ మరియు ఆసియటిక్ జాతులు, భారత దేశానికి కావలసినవి మరియు సాధనాలు, భారత దేశంలో పేదరికం మరియు బ్రిటిష్ రహిత నియమం, పార్సీ మతం తదితర రచనలు చేశారు. ఆయన 30 జూన్ 1917 న మరణించారు. బ్రిటిష్ పార్లమెంటులో భారతీయుల కోసం వాదించిన, బ్రిటిష్ విధానాలను విమర్శించిన నిజమైన జాతీయ వాది దాదా భాయిని ప్రతి భారతీయుడు గుర్తెరగాల్సిన అవసరం ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల**

## చిట్టచివరి బాధితుడికి కూడా
# ప్రభుత్వ సాయం అందిస్తాం

విజయవాడలో వరద పరిస్థితి,
పునరావాస కార్యక్రమాలు
పర్యవేక్షించిన ప్రత్తిపాటి
క్షేత్రస్థాయిలో యంత్రాంగాన్ని
అప్రమత్తం చేస్తూ బాధితులకు
సాయం అందేలా చర్యలు : ప్రత్తిపాటి









**చిలకలూరిపేట సెప్టెంబర్ 03 (ఆంధ్రపత్రిక) :** బుడమేరు ముంపుతో వరదల్లో చిక్కుకున్న విజయవాడ నగరంలో చిట్టచివరి బాధితుడికి కూడా ప్రభుత్వ సాయం అందిస్తామని, అదే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. ఇలాంటి కష్టసమయంలో చేతనయితే భుజంభుజం కలిపి పనిచేయాలి తప్ప పనిచేసే వారికి తప్పుడు విమర్శలు చేయడం మనిషన్న వాడికి సరికాదని మాజీ సీఎం జగన్ రెడ్డికి చురకలు వేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మంగళవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో విజయవాడలో వరద పరిస్థితి, పునరావాస కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పర్యవేక్షించారు. స్థానిక 45వ డివిజన్ ఇన్‌ఛార్జిగా ప్రత్తిపాటిని సీఎం చంద్రబాబు నియమించారు. ఈ మేరకు విజయవాడ 45వ డివిజన్‌లోని సితార సెంటర్, జోజినగర్, కబేళా సెంటర్, రోటరీనగర్, ఏకలవ్య నగర్, బ్రహ్మయ్యనగర్, భగత్‌సింగ్ నగర్‌లో విస్తృతంగా పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు ప్రత్తిపాటి. సితార సెంటర్, జోజినగర్‌లో సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు సీఎం చంద్రబాబు వచ్చినప్పుడు దగ్గరుండి ఏర్పాట్లను వివరించారు. బాధితులకు అందుతున్న సహాయక చర్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వరద నీటిలో చిక్కుకున్న కుటుంబాలకు ఆహార పొట్లాలు అందేలా సమన్వయం చేస్తున్నారు. వరద బాధితులకు ఆహారం, తాగునీటి ప్యాకెట్లు అందుతున్న తీరుపై స్వయంగా పర్యవేక్షించారు. వరద బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. చిట్టచివరి బాధితుడికి కూడా ప్రభుత్వ సాయం అందిలా అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జగన్‌రెడ్డి నిన్న హడావుడిగా వచ్చి మోకాళ్లోతు నీళ్లలో దిగి ప్రభుత్వంపై బురదజల్లడానికి వచ్చినట్లు ఉంది తప్ప కష్టాల్లో ఉన్న ప్రజలను, వరద బాధితులపై ఆయనకు ఏమాత్రం సానుభూతి ఉన్నట్లు కనిపించ లేదన్నారు. నిజానికి గత పాలకుల నిర్లక్ష్యమే ఈ వరద ముంపునకు ప్రధాన కారణం అని జగన్‌రెడ్డి డ్రైన్లు, కాల్వలను నిర్లక్ష్యం చేయడం వల్ల వచ్చిన వరద బయటకు వెళ్లకుండా విజయవాడను ముంచిందన్నారు. అలాంటిది ఇప్పుడుప్రభుత్వంపై బురదజల్లాలనే దురుద్దేశంతో హడావుడిగా బెంగళూరు నుంచి వచ్చి హడావుడి చేయడం జగన్‌కే చెల్లిందన్నారు. పైగా నిన్న మొన్నటి వరకు రెడ్‌కార్పెట్, గ్రీన్ కార్పెట్‌ల మీద తిరిగిన ఆయన ఇప్పుడే మొట్టమొదటిసారి నీళ్లలో దిగారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు నీళ్లలో దిగి ఫొటోలకు ఫోజులిచ్చిపోయారు తప్ప కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడానికి సహాయ చర్యల్లో పాల్గొనాలని ఆ పార్టీ కార్యకర్తలకు కూడా పిలుపునిచ్చిన పాపానపోలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గత మూడ్రోజుల నుంచి విజయవాడ కలెక్టరేట్‌లోని ఉండి బాధితులను ఆదుకోవడంపై శ్రమిస్తున్నారన్నారు. బాధితులను ఎలా ఆదుకోవాలి.. వారికి అవసరమైన ఆహారం, నీళ్లు, పాలు, ఔషధాలు ఎలా పంపాలనే దాని పైనే యంత్రాంగం మొత్తాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారన్నారు. ఇవ న్నీ తెలిసీ చంద్రబాబు ఇంటి గురించి రాజకీయ విమర్శలు చేయడం చవకబారుతనం కంటే నీచంగా కనిపిస్తోందన్నారు. ఇప్పుడిప్పుడే ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉద్ధృతి తగ్గుముఖం పడుతుందని, బుడమేరులో కూడా వరద తగ్గిందని, 24 గంటల్లో విజయవాడలో ముంపులో ఉన్న ప్రతిఒక్కరికీ ఆహారం, నీళ్లు, పాలు, ఔషధాలతో పాటు ఇతర సౌకర్యాలు ఎక్కడా లోటు లేకుండా కల్పిస్తామన్నారు. డివిజన్ల వారీగా పడవలు, ట్రాక్టర్ల ద్వారా బాధితులకు ఆహారం, మంచినీరు, పాలు, ఔషధాలు సరఫరా చేస్తున్నామన్నారు. ఎవరైనా అనారోగ్యంతో బాధ పడుతుంటే వారి కోసం ప్రత్యేకంగా బోటు ఏర్పాటు చేసి ఆస్పత్రికి తరలిస్తున్నామని చెప్పారు. ఆవిధంగా 24 గంటల్లోపు విజయవాడలో సాధారణ స్థితి నెలకొనే వరకు అధికార యంత్రాంగం మొత్తం బాధితుల పక్షాన, కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడమే లక్ష్యంగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

## వరద విపత్తుతో అల్లాడుతున్న విజయవాడ వాసుల్ని ఆదుకున్న వేదవ్యాస్





**విజయవాడ సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** ఆకలితో అలమటిస్తున్న అన్నార్తులకు రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్ తన వితరణతో వరద బాధితులను ఆదుకున్నారు. వారి స్థితి చూసి చలించిపోయారు. మంగళ వారం ఉదయం వేదవ్యాస్ విజయవాడ నగ రంలో వరద బాధితులకు చే యూత అందిం చారు. భారీ వర్షాలు వరదలు విజయవాడ నగరాన్ని అతలాకుతలం చేసిన నేపథ్యంలో వేలాదిమంది ఆకలితో అలమటిస్తున్నారు. కనీస సౌకర్యాలు కూడా లేక వరద బాధితులు అల్లాడి పోతున్నారు. ముఖ్యంగా ఆహార పదార్థాల కొరత వెంటాడుతుంది. వీరిని ఆదుకునేందుకు కూటమి నాయకులు అర్ధరాత్రి, అపరాత్రి, అని లేకుండా శ్రమిస్తున్నారు.. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబా బునాయుడు పిలుపుమేరకు కూటమి నాయకులు కూడా తమదైన శైలిలో పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ శాసనసభ్యులు బూరగడ్డ వేదవ్యాస్ కూడా స్పందించారు. తమ అధినేతను ఆదర్శంగా తీసుకొని, తక్షణం అన్నార్తులను ఆదుకోవాలని సంకల్పంతో ముందడుగులు వేశారు. వారి సంక్షేమం కోసం నడుంబిగించారు. విజయవాడలోని పలు ప్రాంతాలలో వేద వ్యాసు స్వయంగా ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. శ్రీనగర్ కట్ట, పులిపాక పోలీస్ కాలనీ, రామలింగేశ్వర నగర్, ప్రాంతాలలో వరద బాధితులను ఆదుకునేందుకు ఇంటింటికి తిరిగి మరీ ఆహార పొట్లాలను అందించారు. సాధక బాధకాలు తెలుసుకొని వారిని ఆప్యాయంగా పలకరించారు. వేదవ్యాస్ తన సతీమణితో కలసి ఇంటింటికి తిరిగి ఆకలితో అలమటిస్తున్న వారికి మేమున్నాం అని భరోసా ఇచ్చారు. మోకాటి లోతు నీళ్లను సైతం లెక్కచేయకుండా పర్యటిస్తూ వరద బాధితుల గృహాలను చూసి వ్యాస్ చలించి పోయారు. గృహాలలోకి వెళ్లి పాడైపోయిన వస్తు సామాగ్రిని చూసి ఆయన ఆవేదన చెందారు. మీరెవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధితులను తప్పకుండా ఆదుకుంటారని భరోసా ఇచ్చారు. స్థానిక కూటమి నాయకులు కూడా వీరికి సహాయ సహకారాలు అందించారు.

## అసిస్ట్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో రెండు లక్షల విలువైన నిత్యవసర సరుకులు పంపిణీ
### డైరెక్టర్ జాస్తి రంగారావు




**చిలకలూరిపేట సెప్టెంబర్ – 03 (ఆంధ్రపత్రిక) :** పట్టణంలో ఉన్న ప్రముఖ స్వచ్ఛంగా సేవా సంస్థ అసిస్ట్ డైరెక్టర్ జాస్తి రంగారావు ఆధ్వర్యంలో ఒంటరి మహిళలకు 150 మందికి రెండు లక్షల విలువైన నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. నిత్యవసర సరుకులలో భాగమైన బియ్యం, కందిపప్పు, వంట నూనె, గోధుమపిండి హైదరాబాద్ కు సంబంధించిన కే.ఎన్.ఏ సంస్థ ద్వారా వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్ట్ అసోసియేట్ డైరెక్టర్లు కృష్ణ హరీష్,జి సూర్యనారాయణ, విష్ణుప్రియ కోఆర్డినేటర్లు డేవిడ్, దుర్గారాణి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ 56వ జన్మదిన పురస్కారాలు



**గుంటూరు, సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** జనసేన మరియు అఖిలభారత చిరంజీవి యువతల ఆధ్వర్యంలో మేకల రవీంద్రబాబు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ 56వ జన్మదిన సభ గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రివర్యులు, సత్తెనపల్లి నియోజకవర్గ శాసన మండలి సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి ని సత్కరించారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ లో రాక్షస, విధ్వంసకర పాలనకు ముగింపు పలకటానికి తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి ఏర్పాటుకు అవిరళ కృషి చేశారన్నారు. దాదాపు పది సంవత్సరాలు పాటు అనేక అపజయాలను, అవమానాలను ఎదుర్కొంటూ దృఢ సంకల్పంతో ముందుకు పయనించి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రాక్షస పాలన నుండి విముక్తి కలిగించారన్నారు. పవన్ కళ్యాణ్ దాతృత్వం గల మహనీయుడు, రాజకీయవేత్త అని కొనియాడారుతూ ప్రజల ఆపద సమయంలో కోట్లాది రూపాయల విరాళాలను అందించారన్నారు. స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధులు, అధికారాలు అందిస్తూ వాటి పురోగమనానికి తోడ్పడుతూ సర్పంచులకు గౌరవస్థానం కలిగించారన్నారు. అటవీ శాఖ మాత్యులుగా అటవీ సంపదను గ్రీనరీ పెంపుదలకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 20 మంది రైతులకు ఒక్కొక్కరికి 5000 చొప్పున నగదు పారిదోషకాన్ని అందించి సత్కరించారు. మరో 25 మంది ఉత్తమ ఉపాధ్యాయులను స్కూల్ డైరెక్టర్లను గౌరవించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ నసీర్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబో యిన శ్రీనివాస్ యాదవ్, జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, టిడిపి నేత ఉగ్గిరాల సీతారామయ్య, రోటరీ ఇంటర్నేషనల్ కో చైర్మన్ వడ్లమాని రవి, రెడ్‌క్రాస్‌సొసైటీ ఉపాధ్యక్షులు పి.రామచంద్రరావు తదితరులు ప్రసంగించారు.

## అకాల వర్షం నష్టాలు లెక్కించండి
### – ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య



**నందిగామ, సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** అకాల వర్షాలు కారణంగా గ్రామాల్లో విద్యుత్తు.తాగు సాగునీరు. రోడ్లు.చేతి పంపులు మర మత్తులను. పంట నష్టం అంచనాలను వెంటనే నమోదు చేయాలని నందిగామ రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో రవీందర్ అధ్యక్షుతన జగ్గయ్యపేట నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశములో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ సూచించారు. నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో అన్ని శాఖల అధికారులు ముఖ్యంగా విద్యుత్,రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీ రాజ్,ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యూఎస్, ఐ డి సి. ఆరోగ్య శాఖల అధికారులందరూ అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అన్ని రకాల నష్టాలను అంచనా వేసి గ్రామలలోని ప్రజలను సమన్వయం చేసుకుంటూ శానిటేషన్, తాగునీరు, విద్యుత్ పునరుద్ధరణ,మిగతా అన్ని రకాల సౌకర్యాలను వీలైనంత త్వరగా కల్పించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి నందిగామ మరియు నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు

## వరద ముంపు ప్రాంతాలను
# పరిశీలించిన శ్రీరాం రాజగోపాల్



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 03 (ఆంధ్రపత్రిక) :** వరద ఉధృతికి జగ్గయ్యపేట అగ్రహారం పాలేటి బ్రిడ్జి కొంత భాగం డ్యామేజ్ అవ్వడంతో శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ బ్రిడ్జి వద్దకు వెళ్లి దానిని పరిశీలించి అధికారులను పిలిపించి దానికి సంబంధించిన మరమ్మత్తులు వెంటనే చేయాలని దానికి కావలసిన సహాయ సహకారాలు 100శాతం అందిస్తామని కానీ పనుల విషయంలో అలసత్వం చేయకూడదని అన్నారు. అనంతరం అగ్రహారం గ్రామంలో పర్యటించి వరద ఉధృతికి దెబ్బతిన్నటువంటి ఇళ్లను పరిశీలించి ప్రజలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పడం జరిగింది. అనంతరం తాతయ్య గారు మాట్లాడుతూ వరద ఉధృతికి దెబ్బతిన్నటువంటి ప్రతి ఇళ్లను అధికారులను పంపించడం జరిగినదని వారు ప్రతి ఇంటికి కూడా వచ్చి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఆ అంచనాలు ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని దెబ్బతిన్నటువంటి వారు ఆర్థికంగా నష్టపోయినటువంటి వారికి ప్రభుత్వం నుంచి న్యాయం చేసి వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని, అదేవిధంగా ఎలక్ట్రికల్ అధికారులు ఆర్ అండ్ బి అధికారులు తాసిల్దార్ ఆఫీస్ వారిని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగిన సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల కష్టాలను తెలుసుకుంటున్నారని అదేవిధంగా అధికారులు కూడా అలసత్వం వహించవద్దని తక్షణమే అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## లింగాల వద్ద మునేటిపై కాజ్ వే గల్లంత్
### ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య పరిశీలన



**వత్సవాయి, సెప్టెంబర్ 03 (ఆంధ్రపత్రిక) :** ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజ కవర్గంలోని వత్సవాయి మండలంలో లింగాల గ్రా మం వద్ద మునేటిపై బ్రిటిష్ కాలంలో నిర్మాణం చేసిన కాజు వే వరద నీటిలో కొట్టుకుపోయింది. బ్రిటిష్ కాలంలో ఈ ప్రాంతంలో పండించిన పంటల కో సం... లింగాల వద్ద విడిది భవనం వద్ద కు రాకపోకల కు గాను మునేటి పై ప్రత్యేకంగా కాజ్వేను నిర్మాణం చేశారు. అప్పటినుండి ఈ కాజు వేయకు తాత్కాలిక మరమ్మత్తులతో పాలకులు నడిపిస్తున్నారు.. గతంలో వచ్చిన అనేక వరద లకు రాజు వే కొంతవరకు దెబ్బతినడంతో ఆయా ప్రాంతాలలో మరమ్మత్తులను చేయడం జరిగింది. గ తంలో ఈ కాజువే శిథిలావస్థకుచేరిందని ఇంజనీరింగ్ అధికారులు ప్రభుత్వానికి నూతన కాజీపేట కో సం ప్రతిపాదనలు కూడా పంపించడం జరిగింది. దాదాపు కిలోమీటర్లు దూరంలో ఉన్న కాజువే నిర్మా ణానికి తగిన నిధుల సమస్య ఉండటంతో ఎప్పటికప్పుడే రిపేర్లు పేరుతో కొనసాగించడం జరిగింది. ఆది సోమవారాలలో వచ్చిన వరదలకు లింగాల వద్ద ఉన్న మునేటికాజ్వే పై కొంత భాగం పూర్తిగా కొట్టు కుపోగా మిగిలిన భాగం ధ్వంసం అయ్యింది. దీని కాజ్వే నిర్మాణం కోసం శాసనసభ్యులు శ్రీరామ్ రాజ గోపాల్ స్వయంగా పరిశీలించి అనంతరం ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపించే ఏర్పాటు చేస్తున్నారు.

### ఎ.కొండూరు మండలంలోని
### తుఫాన్ వరదల ధాటికి దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న
## ఉద్యాన శాఖాధికారి బి. నరేంద్ర



**ఎ.కొండూరు సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) ;** చీమలపాడు,రామచంద్రాపురం,మాధవరం గ్రామాల్లో ఉద్యాన అధికారి బి .నరేంద్ర కుమార్ మంగళవారం పర్యటించి తుఫాన్ వరదల ధాటికి దెబ్బతిన్న మిరప, బొప్పాయి,వంగ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యానాధికారి బి. నరేంద్ర కుమార్ ఉద్యాన రైతులకు తగిన సూచనలు ఇవ్వటం జరిగింది. ఉద్యాన తోటలలో వర్షం తగ్గేక నీరు ఎమైనా ఉంటే తోటలలోంచి వెళ్ళగొట్టాలి. అలాగే 19.19.19 గాని 13.0.45 గాని మొక్కలకు అందిచాలి( స్ప్రే చెయ్యాలి).వర్షాలు తగ్గేక తెగుళ్ళు పెరిగే అవకాశం ఉంది కాబట్టి దాని నివారణకు %జూజ% 2గ్రా/లీ, మెటలాక్సిల్ 1.5గ్రా/లీటరు నీటిలో కలిపి వేర్లు తడిచే విధంగా మొదల్లలో పోయాలి. మచ్చ తెగులు, బూజు తెగులు రాకుండా థియోమిథోకార్ప్ 1.5గ్రా/ లీ ం మాంకో జెబ్ 2గ్రా / లీ స్ప్రే చెయ్యాలి .అదేవిధంగా బొప్పాయి సాగు చేసే రైతులకు ప్రభుత్వం ద్వారా ఒక హెక్టారుకు 17,500 రాయితీ అందించటం జరుగుతుందని తెలియచేశారు.దీని కోసం రైతులు గ్రామంలోని రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి తో పాటు గ్రామ ఉద్యాన సహాయకులు మర్సకట్ల వెంకటేశ్వరరావు,బి.నాగరాజు, ఏ ఈ ఓ ఎ.రామచంద్రరావు, చీమలపాడు గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షులు మండల బీసీ సంఘం అధ్యక్షుడు బెజవాడ శంకర్, రైతులు పాల్గొన్నారు.

## వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా రహదారులపై పడిన గోతులను పూడిపిస్తున్న సిఐ కె.గిరిబాబు



**తిరువూరు సెప్టెంబరు 3 (ఆంధ్రపత్రిక) ;** గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు మల్లెలటు. విస్సన్నపేట వెళ్లే రోడ్డు మార్గం ఎన్ హెచ్ 216 రహదారి పైవరదనీరు రోడ్డుపై ప్రవహించడంతో రోడ్డుకు అక్కడక్కడ గోతులుగా ఏర్పడి వాహనాలరవాణాకు ఆటంకంగా మారింది. దీంతో ఏసిపి సుంకర మురళీమోహన్ ఆదేశాల మేరకు తిరువూరు సిఐ కె.గిరిబాబు మరియు తిరువూరు ఎస్సై మరియు మహిళా పోలీసులు అంతా గ్రామస్తుల సహాయంతో రాళ్లతో రోడ్ల మధ్యలో ఏర్పడిన గోతులను పూడ్చి ప్రజలకు వాహనాల రవాణాకు ఆటంకం లేకుండా చేశారు. దీంతో గ్రామస్తులు పోలీసుల పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు.

## తేమ నివారణకు రైతులు చర్యలు చేపట్టాలి



**బల్లికురవ సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** బల్లికురవ మండలంలో వర్షాల కారణంగా పత్తి పంటల్లోని తేమ నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని బల్లికురవ మండల వ్యవసాయ శాఖ ఏవో కుమారి అన్నారు. ఉప్పమాగులూరు పరిసర ప్రాంతాల పొలాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. వర్షాల కారణంగా గులాబీ రంగు పురుగుల వ్యాపించే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు .

# పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలి

## కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ






**మచిలీపట్నం సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** జిల్లాలో వరద నీరు తగ్గిపోతున్న దృష్ట్యా వరద ప్రభావిత పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు ముమ్మరంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ వీసీ హాల్ లో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వరద పరిస్థితులపై సమీక్షించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణా నదికి వరద నీరు తగ్గుముఖం పట్టిందన్నారు.జిల్లాలో వరద ప్రభావిత పట్టణాలు గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా సజావుగా పారిశుద్ధ్యం ఏర్పాట్లు చేపట్టాలన్నారు.అన్ని మురికి కాలువలలో దోమల నివారణ మందు పిచికారి చేయాలన్నారు. అంతేకాక కాలువలలో పూడికలు, ప్లాస్టిక్ వంటి వ్యర్థ పదార్థాలు ప్రవాహానికి అడ్డు లేకుండా తొలగించాలన్నారు. పెద్ద పెద్ద చెత్త కుప్పలు ఉన్నయెడల వాటిని కూడా తొలగించి ఊరికి దూరంగా పడవేయాలన్నారు.డిఎంహెచ్వో మలేరియా అధికారులతో సమన్వయం చేసుకొని దోమల నివారణకు ఐఆర్ఎస్ మందులను వెదజల్లేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏఎన్ఎంలు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి వెక్టార్ హైజిన్ యాప్ లో కాలువలు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు ఫోటో తీసి అప్లోడ్ చేయాలన్నారు.వాటిపై జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు డి ఎం హెచ్ ఓ తో సమన్వయం చేసుకొని కింది స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు చేత సత్వరమే తగిన చర్యలు చేపట్టాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పాముకాటు విరుగుడు మందులతో సహా ఇతర మందులు కావలసినన్ని అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.వరదకు గురి అయిన అన్ని గ్రామాలు, పట్టణాల్లో ఉపరితల జలాశయాలు( ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను) సంబంధిత ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో తనిఖీ చేయించి వాటిని సత్వరమే శుభ్రం చేయవలసిందిగా ఆదేశించారు.అలాగే పైపు లైన్లు అన్నీ కూడా తనిఖీ చేసి ఎక్కడైనా లీకేజీ ఉన్నట్లయితే వెంటనే దాన్ని అరికట్టుటకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని మున్సిపల్, గ్రామస్థాయి అధికారులు ప్రజలందరూ కాచి చల్లార్చి వడపోసిన నీరును మాత్రమే త్రాగవలెనని చైతన్య పరచాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలందరికీ ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, ఒక కిలో చక్కెర, ఒక కిలో కందిపప్పు,ఒక లీటరు పామాయిల్ సజావుగా ఇంటింటికి నేరుగా పంపిణీ చేయాలన్నారు. మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కిలోల బియ్యం అందజేయాలన్నారు. వారి వద్ద ఉన్న పడవలను అలాగే ఉంచుకొని నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఇంకా అవసరమైతే పడవలను పంపిస్తామన్నారు. ఉన్న పంటలను సంరక్షించడం చాలా ముఖ్యమన్నారు. పంట పొలాల్లో వరద నీరు అలాగే ఉంటే పంటలు పాడై నష్టం వాటిల్లుతుందన్నారు.అందువలన వరద నీటి ని యుద్ధ ప్రాతిపదికన బయటకు తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డి ఆర్వో జి శ్రీదేవి, జెడ్పీ సీఈవో ఆనంద్ కుమార్, డి ఎం హెచ్ ఓ డాక్టర్ గీతాబాయి, డిఎస్ఓ పార్వతి, ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాసరావు, ఏపీఎంఐపి పిడి విజయలక్ష్మి, పశుసంవర్ధక అధికారి శ్రీనివాసరావు,మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ తదితర జిల్లా అధికారులు మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు ఎం. వాణి, పి పద్మావతి,డి.రాజు తహసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయ అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, ఉద్యాన అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు సహాయక చర్యలు పాల్గొన్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు



**తిరువూరు సెప్టెంబరు 3 (ఆంధ్రపత్రిక) :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి వల్ల కురిసిన భారీ వర్షాలకు వరద ముంపునకు గురైన విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో వరద సహాయ క చర్యల్లో భాగంగా మంగళవారం తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలి కపూడి శ్రీనివాసరావు పాల్గొని జలదిగ్బంధమైన రోడ్డులో బాధితులను దాటిస్తూ ముంపు ప్రాంతాల బాధితులకు మోకాళ్ళ లోతు నీళ్లలో నడుస్తూ భోజన ప్యాకెట్లు పాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. నిరాశ్రయులైన వరద బాధితులను పరామర్శించారు.

## నిరుపేద కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



**తిరువూరు సెప్టెంబరు 3 (ఆంధ్రపత్రిక) :** ఎ.కొండూరు మండలంలోని గోపాల పురం గ్రామానికి చెందిన కృష్ణవేణి అనే మహిళ తన కుటుంబానికి ఆర్థికపరంగా ఇబ్బందులు ఉన్నాయని ఎమ్మెల్యే కొలిక పూడి శ్రీనివాసరావు వద్ద తెలిపి వాపోయింది. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి కృష్ణవేణి అనే మహిళకు రూ.10,000 వేలు ఆర్థిక సహాయాన్ని తిరువూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో మంగళవారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ వెంటనే స్పందించి తనకు సహాయం అందించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసింది. తన కార్యాలయానికి ఆర్థిక సహాయం కోసం వచ్చిన వారు నిరుత్సాహంగా ఎవరు వెనుతిరగకుండా ఎవరికి కాదనకుండా పదిమందికి సహాయం చేయాలనే గొప్ప వ్యక్తిత్వం గొప్ప మనస్సున్న మోహోన్నత వ్యక్తిత్వం గల ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు ఎమ్మెల్యేగా రావడం తమ అదృష్టం అని ఆమె పేర్కొంది.

## గోపాలపురం గ్రామంలోని ఎస్టీ కాలనీలో డ్రైనేజీ పనులకు శ్రీకారం



**ఎ. కొండూరు సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** గోపాలపురం గ్రామంలో ఎస్టి కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గోపాలపురం గ్రామంలో సోమవారం పర్యటించినప్పుడు ఎస్టీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటాన్ని పరిశీలించి వెంటనే పనులు చేపట్టి వర్షపు నీరునిల్వ లేకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు మంగళవారం జెసిబి సహాయంతో పూడిక తీత పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో నిల్వ ఉన్న నీరు బయటకు కాల్వ ద్వారా వెళ్ళిపోయాయి. పరిసరాలు డ్రైనేజీ సుభ్ర పడ్డాయి. డ్రైనేజీపనులకార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్న గ్రామ తెలుగుదేశం పార్టీ పార్టీ సెక్రటరీ భూక్య రాంబాబు , ఐ టీడీపీ ఇర్ల. బాజీ బాబా, కుంచాల ఆంజనేయులు. భూక్య మంగణ. కార్యకర్తలు పాల్గొన్నారు.

## అద్దంకి నుంచి వరద బాధితులకు ఆహార ప్యాకెట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్




**అద్దంకి సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** భారీ వర్షాలతో నీట మునిగిన బెజవాడ నగరములోని వరద బాధితులకు సహాయార్థం వారికి అవసరమైన భోజనాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో తయారు చేయించి సోమవారం నుండి పంపిస్తున్నారు పట్టణంలోని నాగులపాడు రోడ్ లో కామేపల్లి కళ్యాణ మండపంలో ప్రత్యేకంగా భోజనాల ను తయారు చేయించి ప్యాకింగ్ చేసి 18 ప్రత్యేక వాహనాలలో బెజవాడకు పంపించారు సోమవారం రాత్రికి 20 వేల మందికి పంపగా మంగళవారం 30 వేలమందికి భోజనాలను తయారుచేసి పంపిస్తున్నారు ఇప్పటివరకు 50 వేల మందికి 30 లక్షలు పైగా ఖర్చు అయ్యే భోజనాలను తయారుచేసి పంపిస్తున్నారు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో టిడిపి శ్రేణులు భోజనాల తయారీ విజయవాడ పంపే ఏర్పాట్లను పర్యేక్షిస్తున్నారు బెజవాడకు పంపుతున్న వాహనాలను టిడిపి నేతలు కరి పరమేష్ చిన్ని శ్రీనివాసరావు కుందారపు రామారావు కోంద్రు వీరాంజనేయులు అశోక్ శ్రీనివాసరావు మన్నెం ఏడుకొండలు నాగరాజు రమేష్ మోహన్ దాస్ కౌన్సిలర్లు తదితరులు పర్యవేక్షణ చేస్తున్నారు.

## జపనీస్ భాషపై ప్రభుత్వం అధ్వర్యంలో శిక్షణ

**బాపట్ల సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నావిస్ హెచ్.ఆర్ ఆధ్వర్యంలో ఏఎన్ఎం, జీఎన్ఎమ్, బిఎస్సి నర్సింగ్ ,చదివిన వారికి జపనీస్ భాష ఎన్5, ఎన్, ఎన్3 స్థాయిలలో నేర్పించి, వారికి జపాన్ దేశంలో నర్సులుగా ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ. తమ్మాజీ రావు తెలిపారు.అభ్యర్థులు జపాన్ దేశంలో పనిచేయడానికి ఆసక్తి గల 32 సంవత్సరాలు లోపు వయసు ఉన్న అభ్యర్థుల అర్హులని, శిక్షణ కాలం 6 నెలలు అని, శిక్షణ నావిస్ హెచ్ఆర్ బెంగళూరులో జరుగుతుందని, శిక్షణ ఫీజు 3,50,000 అని, పాక్షిక శిక్షణ రుసుం 50వేలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ 25,000 రూపాయిలు చెల్లిస్తుందని మిగిలిన 25,000 రూపాయిలు అభ్యర్థి చెల్లించాలని మిగిలిన 3,00,000 రూపాయలు మూడు విడతలుగా అభ్యర్థి చెల్లించాల్సిందిగా తెలియజేసారు.శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జపాన్ దేశం నందు ఉద్యోగ అవకాశం కల్పించటానికి కావాల్సిన సాధుపాయాలు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ హెచ్ఆర్ పర్యావేక్షితుందని ఉద్యోగం పొందిన అభ్యర్థి జీతం 1,10,000 నుండి 1.40,000 వరకు ఉంటుంది అని తెలియజేసారు. ఆసక్తి కలిగిన వారు https://shorturl.at/FB7okనమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 8978886348 మరియు తోల్ ఫ్రీ 99888 53335 నెంబర్ ను సంప్రదించాలన్నారు.

## నీటమునిగిన పొలాల పరిశీలన



**పొన్నూరు,సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** పొన్నూరు మండలంలోని నండూరు, చిన్న ఇటికం పాడు, పెదపాలెం, వల్లభ రావు పాలెం, కసుకర్రు, సీతారామపురం, ఉప్పర పాలెం, పెద్ద ఇటికంపాడు గ్రామాలలో పర్యటించారు. అకాల వర్షం కార ణంగా దెబ్బతిన్నటువంటి పంట పొలాలను సందర్శించారు, రైతులతో మాట్లాడి తమ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి మరియు ప్రభుత్వ ఉన్నత అధికారులు దృష్టికి తీసుకు వెళ్తామని రైతులకు తెలిపారు. తమ సమస్యల పరిష్కరించే విధంగా చూస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ ఎలక్షన్ పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ మాదాల వెంకటేశ్వరరావు, గుంటూరు పార్లమెంటరీ విభాగ ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు, పొన్నూరు మండల పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావు, కూటమి ప్రభుత్వ నాయకులు ,కార్యకర్తలు, పాల్గొన్నారు.

## లంక గ్రామాల్లో చిక్కుకున్న ప్రతి ఒక్కరికి భోజన సదుపాయం కల్పించాలి





**బాపట్ల సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** లంక గ్రామాలలో చిక్కుకున్న ప్రతి ఒక్కరికి అల్పాహారం, భోజనం, తాగునీటిని అధికారులు సమృద్ధిగా అందించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. కొల్లూరు లాక్‌ల వద్ద నుంచి మర బోట్ల ద్వారా లంక గ్రామాలకు చేరుతున్న అల్పాహారం, భోజన పదార్థాలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఉదయం ఎనిమిది గంటలకే లాక్ ల వద్దకు చేరుకుని నిత్యాసర వస్తువులు పంపిణీపై ఆయన ఆరా తీశారు. ఎవరికి అందలేదని ఫిర్యాదులు రాకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అదనపు ఎస్పీ వితలేశ్వరరావు లంక గ్రామాలలోనే మూడు రోజుల నుంచి బస చేయడంపై కలెక్టర్ ఫోన్ లోనే మాట్లాడారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వరద నీటి ప్రవాహం మూడు అడుగుల దిగువకు తగ్గడంతో పరిశీలించారు.జలదిగ్బంధంలో చిక్కుకున్న గ్రామాల ప్రజలకు ఆహార పదార్థాలు కొరత లేకుండా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. 23 వేల మందికి సరిపడ అల్పాహారం పంపుతున్నామన్నారు. 23 వేల టెట్రా మిల్క్ ప్యాకెట్లు, మరో 23 వేల కేకులు, 23 వేల బిస్కెట్ ప్యాకెట్లు, 23 వేల (టిఫిన్) అల్పాహారాన్ని బోట్ల ద్వారా తరలిస్తున్నామని చెప్పారు. ఒక్కొక్కరికి ఐదు లీటర్ల చొప్పున మినరల్ వాటర్ ను అందిస్తున్నామన్నారు. ఆహార పదార్థాలు పంపిణీలో ఎవరికి ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. 48 మర బోట్లతో ఆహార పదార్థాలు తరలిస్తున్నామని, మరో ఆరు బోట్లు సిద్ధంగా ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితుల కొరకు రెండు హెలికాప్టర్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఆయన వెంట మత్స్య శాఖ జెడి పి సురేష్, గృహ నిర్మాణ శాఖ పిడి ప్రసాద్, అనుబంధ శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

## సింగిల్ విండో ద్వారా వినాయక చవితి ఉత్సవాల అనుమతులు



**ఎ.కొండూరు సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే వారి సౌకర్యార్థం మండపాల పర్మిషన్ కొరకు విజయవాడ పోలీస్ కమిషనర్ సింగిల్ విండో సిస్టమును అందుబాటులోకి తెచ్చినట్లు ఎ. కొండూరు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు మీసేవ కేంద్రాల ద్వారా రుసుము చెల్లించి వినాయక మండపాల అనుమతులు తీసుకోవాలని సూచించారు 799 50 95 800 ఫోన్ నెంబర్ కు వాట్సప్ ద్వారా హాయ్ అని సందేశాన్ని పంపిస్తే సరిపోతుందన్నారు ఎన్ ఓ సి కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం వాట్సాప్ యాప్ ద్వారా వారి మొబైల్ ఫోన్ కి వస్తుందని చెప్పారు. దరఖాస్తు చేసే సమయంలో కమిటీ సభ్యులు మండపం ఏర్పాటు చేసే ప్రదేశం ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది విగ్రహం యొక్క ఎత్తు మండపం ఎత్తు విగ్రహ ప్రతిష్ఠ ఏ రోజు జరుగుతుంది నిమజ్జనం ఏ సమయంలో చేస్తారు ఎక్కడ చేస్తారు ఏ వాహనం ద్వారా నిమజ్జనం చేస్తారు అనే వివరాలను దరఖాస్తులో నమోదు చేయాలని ఎస్సై చల్లా కృష్ణ సూచించారు



రమేష్ హాస్పిటల్స్,వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి 5 లక్షల రూపాయల విరాళాన్ని రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.పోతినేని రమేష్ బాబు, హాస్పిటల్స్ ప్రతినిధులు డాక్టర్ రాయపాటి మమత, డాక్టర్. వై.కార్తీక్ చౌదరి రాష్ట్ర మంత్రి లోకేష్‌కు అందచేసారు. ఈ కార్యక్రమంలో దేశ విమానయాన శాఖ మంత్రి రామ్మోహన నాయుడు మరియు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు రమేష్ హాస్పిటల్స్ యాజమాన్యాన్ని అభినందించారు.

## ప్రజలను కాపాడాల్సిన భాధ్యత మనందరిది

### మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర





**జగ్గయ్యపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రపత్రిక) :** జగ్గయ్యపేట పట్టణంలో మున్సిపల్ ఆఫీస్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, జగ్గ య్యపేట సచివాలయం సిబ్బంది అందరితో ప్రత్యేక అత్యవసర సమావేశం ఏర్పాటు చేశా రు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వరదలు వచ్చి జగ్గయ్యపేట పట్టణ ప్రజలు బాధపడుతుంటే రాజకీయ నాయకులు తప్ప ఇప్పటి వరకు కనీస భాధ్యతగా ప్రజలను కలిసారా అని అధికారులను ప్రశ్నించారు. మీ సచివాలయం సిబ్బంది పని చేస్తున్నారా లేదా అని చూడాల్సిన భాధ్యత వార్డు అడ్మిన్స్ భాధ్యత అని, రేపు ఉదయం నుంచి వరద ముంపు ప్రాంతాలలో ప్రతి ఇంటికి వెళ్లి వారికి జరిగిన నష్టం ప్రతిదీ రాసుకుని, ఏటువంటి నష్టం జరిగింది , ఆరోగ్య సమస్యలు ఉన్నాయా, వారు పెంచుకునే పశువులు ఏమైనా కొట్టుకుపోయాయ ప్రతి డేటా మీరు రేపు సాయంత్రం లోపు సేకరించాలని, అలాగే జగ్గయ్యపేట పట్టణ పరిధిలో రోడ్లు , డ్రైనేజీ లు, ఎంత వరకు డ్యామేజ్ అయ్యాయో అత్యవసరంగా చేయాల్సిన పనులు ఏమున్నాయో ప్రతి డేటా తప్పనిసరిగా ఇవ్వాలని తెలియజేశారు.గౌరవ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య వరదలు వచ్చిన సమయం నుంచి ప్రజల్లోనే ఉంటు వారి సమస్యలను తెలుసుకుంటున్నారని, ప్రజలకు సహాయ సహకారాలు అందజేస్తున్నారని, ప్రభుత్వం ద్వారా అన్ని రకాల ఆదుకుంటామని ప్రజలకు మీ ద్వారా తెలియజేయమన్నారని తెలిపా రు. కనీసం 10 రోజుల వరకు అత్యవసరం ఐతే తప్ప సెలవులు ఇవ్వబడవని, అందరూ జగ్గయ్య పేట పట్టణ పరిధిలోనే ఉండాలని తెలియజేశారు.సచివాలయలా వల్ల ప్రభుత్వానికి ఏటువంటి ఉపయోగం లేదు అనే విధంగా మీరు పని చేస్తున్నారని, మాది ప్రభుత్వ ఉద్యోగం మమ్మల్ని ఏం చేస్తారు అనే తీరులో మీ పనులున్నాయని అసహనం వ్యక్తం చేస్తూ, మీ తీరు మారకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.నూతనంగా మున్సిపల్ కమిషనర్ గా భాధ్యతలు చేపట్టిన రామ్మోహన్ గారిని సత్కరించి పట్టణ అభివృద్ధికి మీ వంతు కృషి చేయాలని ఆకాక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర రావు, కమిషనర్ రామ్మోహన్ రావు,ఎలక్ట్రికల్ శ్రీనివాసరావు,వార్డు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## దర్శి పలుకులు



జలకత్తిలి మెడపై నిలిపిన పర్యావరణ ప్రతీకారేచ్ఛాలు కన్నీటి వరదల ఉగ్రధారాలు బస్తీలను మింగేసే ఉప్పెనలు కదం తొక్కుతున్న వాగులు వంకలు డొంకలలో కవాతు చేస్తున్న మహా విపత్తులు రోడ్ల పై రాక్షస జల ప్రళయాలు వరదల్లో కొట్టుకుపోతున్న పచ్చని పైర్లు నలు దిశల ప్రజల హాహాకారాలు నడి వరదలలో చేతులెత్తేస్తున్న జనులు క్షణాల్లో విరుచుకుపడుతున్న జల విపత్తులు కట్టలు తెగిన కన్నీటి వరదలు! వాగులు వంకలు ఆక్రమణలు రోడ్లపైనే నీటి ప్రవాహాలు ఓట్ బ్యాంక్ రాజకీయాలు దురాక్రమలకు రాజముద్రలు ఇకనైనా మేల్కొని ఆక్రమణల తొలగింపుకు పచ్చజెండా ఊపగలరా!?

ప్రజా కవి రచయిత సీనియర్ జర్నలిస్టు దర్శి శేషారావు
(భారీ వర్షాల కురుస్తున్న సందర్భంగా జరుగుతున్న పరిణామాలు, కర్తవ్యం గురించి)

## కొమ్మినేని వారి పాలెంలో పేకాట శిబిరంపై దాడులు




**బల్లికురవ సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** బల్లికురవ మండలంలోని కొమ్మినేని వారి పాలెంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో, బల్లికురవ ఎస్సై చౌదరి మంగళవారం తన సిబ్బందితో శిబిరంపై మెరుపు దాడులు నిర్వహించారు. ఆ సమయంలో అక్కడ పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద రూ.7040 నగదును స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై చౌదరి హెచ్చరించారు.

# వరద ఉధృతి తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**బాపట్ల సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** కృష్ణానది వరద ఉధృతి పూర్తిగా తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. జలదిగ్బంధంలో చిక్కుకుపోయిన లంక గ్రామాలలోని ప్రజలకు కొల్లూరు లాక్ ల వద్ద నుంచి 40 బోట్ల ద్వారా భోజనం, తాగునీరు, ఆహార పదార్థాలను పంపిణీ చేస్తున్న ప్రక్రియను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, శాసనసభ్యులు నక్కా ఆనందబాబు మంగళవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాలకు వెళ్తున్న ఆహార పదార్థాల వివరాలను ప్రజాప్రతినిధులు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరద పరిస్థితిపై అన్ని శాఖల అధికారులతో స్థానిక ఎండిఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కరకట్ట బలహీనపడిన ప్రాంతాలను పరిశీలించి కరకట్ట బలోపేతం చేయాలని మంత్రి రవికుమార్ తెలిపారు. నాణ్యమైన మంచి భోజనం నిర్వాసితులకు అందించాలని అధికారులకు సూచించారు. నాలుగు రోజులుగా అధికారులు పగలు, రాత్రి శ్రమించడం, ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా సమర్థంగా సహాయక చర్యలు చేపట్టారని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. కరకట్ట తెగకుండా బలోపేతం చేయడం అభినందనీయమన్నారు. రహదారిపై పడిన గండ్లు పూడ్చాలన్నారు. లంక గ్రామాలలో విద్యుత్ పునరుద్ధరణకు సిపిడిసిఎల్, ఎస్పీడీసీఎల్ నుంచి 1000 మంది లైన్మెన్లను పంపుతామన్నారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. లంక గ్రామాల కొరకు 1000 సోలార్ ల్యాంప్ లు ఇస్తామన్నారు. రెండు విద్యుత్ సబ్ స్టేషన్లు దెబ్బతిన్నాయన్నారు. బోట్లు ప్రయాణిస్తున్నందున విద్యుత్ నిలిపివేసి జనరేటర్ల ద్వారా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. బోట్లలో వెళ్లే వారికి తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ఉండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరద తగ్గిన తర్వాత విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలన్నారు. వరద తగ్గిన తర్వాత సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే కొరకు ప్రకాశం జిల్లా నుంచి అధికారులను పంపుతామన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రాణ జీవ జీవాల నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రమాదం పొంచి ఉందని గుర్తించి అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో మరో 48 గంటలపాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇప్పటివరకు అధికారుల టీం వర్క్ చాలా బాగుందని, ఎంతో బాధ్యతతో పనిచేశారని మంత్రి అభినందించారు. ముఖ్యంగా లంక గ్రామాలలోని ప్రజలకు తాగునీరు, వైద్యం, భోజనం సకాలంలో అందించాలన్నారు. అనారోగ్యానికి గురికాకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు శరవేగంగా చేపట్టాలన్నారు. 24 వేల మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి భోజనం అందించడం సాహసోపేతమైన చర్యగా అభివర్ణించారు. ఇతర జిల్లాల నుంచి అవసరమైన అధికారులను నియమిస్తామన్నారు. ఇప్పటికే నలుగురు ఉప కలెక్టర్లను నియమించినట్లు తెలిపారు. గత మూడు రోజులుగా రెవెన్యూ, పోలీసులు 24 గంటల పాటు పనిచేస్తున్నారని ప్రత్యేకంగా అభినందించారు. మరో రెండు రోజులు అధికారులు బాధ్యతగా పని చేయాలన్నారు. ముఖ్యంగా కరకట్టకు అనధికారికంగా 65 పైపులైన్లు కొందరు వేయడంతో ఆ ప్రాంతంలో కరకట్ట బలహీన పడిందన్నారు వాటిని తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణానది వరద ఉధృతి 8.64 లక్షల క్యూసెక్కులకు తగ్గడంతో ప్రమాదం కొంతమేరకు తగ్గినట్లేనని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. వరద తగ్గిన తర్వాత లంక గ్రామాలలో పేర్కొన్న బురద, చెత్తను యుద్ధ ప్రాతిపదికన తొలగించడానికి యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. చరిత్రలో ఎన్నడు లేనంతగా కృష్ణానది వరద ప్రవాహం 11.50 లక్షల క్యూసెక్కులకు చేరడంతో 24 హ్యాబిటేషన్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయన్నారు. అందులో 24 వేలమంది లంక గ్రామాలలోనే ఉండిపోయారని తెలిపారు. ఆ గ్రామాలలో ప్రజలు ఇబ్బందులు పడకుండా జనరేటర్లు ఏర్పాటు చేసి 750 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. వారికి ఆహార పదార్థాలు అందించడానికి 40 మర బోట్లు నడుపుతున్నామని, 200 లైఫ్ జాకెట్లు కొనుగోలు చేసే



సిద్ధంగా ఉంచామన్నారు. 65 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. కరకట్టలు నాలుగు చోట్ల బలహీనపడి లీక్ అవుతున్నప్పటికీ అధికారులు, గ్రామ ప్రజల సహకారంతో యుద్ధ ప్రాతిపదికన నివారించగలిగామన్నారు. నూతన జిల్లాలో అధికారులు తక్కువమంది ఉన్నప్పటికీ ఉన్న మానవ వనరులతోనే రిస్క్యూ చేసి విపత్తు నుంచి బయటపడ్డామన్నారు. అయినప్పటికీ కరకట్ట బలహీనంగా ఉన్న ప్రాంతాలలో బలోపేతం చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సైనికులు మాదిరిగా నిరంతరం ఆ ప్రాంతంలో కాపలా కాయాలన్నారు. ముఖ్యంగా జల వనరుల శాఖ, పంట కాలువల ఇంజనీర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం సమర్థంగా పని చేసిందని అభినందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రోజుకి మూడు పర్యాయాలు బాపట్ల జిల్లా పరిస్థితులపై ఫోన్ లో మాట్లాడుతున్నారని చెప్పారు. అధికారుల పనితీరుపై సీఎం ప్రశంసించారని తెలిపారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కూడా ఫోన్లో మాట్లాడి అధికారుల పనితీరును అభినందించారన్నారు. లంక గ్రామాలలోని ప్రజలకు పంపిణీ చేసే భోజనం నాణ్యతలో రాజీ పడరాదని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నీట మునిగిన గృహాలు, జలవిగ్బంధంలో చిక్కుకున్న కుటుంబాలకు నిత్యవసర సరుకులు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఒక కుటుంబానికి 25 కేజీల బియ్యం, నూనె ఒక లెటర్ ప్యాకెట్, కందిపప్పు ఒక కిలో, పంచదార ఒక కిలో, బంగాళదుంపలు ఒక కిలో, ఉల్లిపాయలు ఒక కిలో, చేనేతలు మత్స్యకారులు ఉంటే ఆ కుటుంబాలకు 50 కిలోల బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. లంక గ్రామాలలో 8,600 కుటుంబాలు ఉన్నాయని ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. ప్రస్తుతం 9 వేల కుటుంబాలకు సరిపడా సరుకులు సిద్ధంగా ఉంచామన్నారు. ఈరోజు ఉదయం 10 గంటలకల్లా 56 వేల లీటర్లను లంక గ్రామాలకు అందించామన్నారు. 24 వైద్య శిబిరాలు లంక గ్రామాలలో కొనసాగుతున్నాయన్నారు. లంక గ్రామాలలోని పశువుల కొరకు ఇప్పటికే 95 మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందించామని, అదనంగా 400 మెట్రిక్ టన్నులు పశుగ్రాసం తెప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిరంతరం పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామన్నారు. ఇలాంటి పరిస్థితులలో డయేరియా వంటి అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి లంక గ్రామంలో, గృహంలో పేర్కొన్న బురద తొలగించడానికి పంచాయతీ శాఖ అధికారులు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలన్నారు. దెబ్బతిన్న గృహాలు, ప్రభుత్వ సంక్షేమ భవనాలు, వ్యవసాయ, ఉద్యాన పంటలు, రోడ్లు, బోట్ల నష్టం అంచనాల సర్వే పక్కాగా చేపట్టడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. లంక గ్రామాలలోని ప్రజల సహాయ చర్యల కొరకు అధికారులు ఛాలెంజ్ గా పనిచేయాలని బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తే ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. నిత్యవసర సరుకులు, వైద్యం సకాలంలో అందించేలా చూడాలన్నారు. ఇప్పటివరకు అధికారులు ఎంతో బాగా పనిచేశారని ప్రశంసించారు. సహాయక చర్యలపై పర్యవేక్షణ, చిత్తశుద్ధితో అధికారులు పనిచేస్తే విపత్తు నుంచి పూర్తిగా బయటపడతామని తెలిపారు. వరద తగ్గిన తర్వాత సహాయక చర్యలకు యంత్రాంగం సిద్ధం కావాలని వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు తెలిపారు. అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు. గతంలోకంటే వరద చాలా అధికంగా రావడంతో లంక గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. వరద తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విపత్తులో అధికారులు అవిశ్రాంతంగా పనిచేసే పరిస్థితి ఏర్పడిందని ఆయన వివరించారు. ప్రజలకు సహాయం అందించడంలో అధికారులు వెనుకాడరాదన్నారు. అధికారికంగా ప్రకటించే వరకు లంక గ్రామాలలోని ప్రజలు ఎలాంటి రాకపోకలు సాగించరాదని జిల్లా ఎస్పీ తుషార్ దూడి తెలిపారు. ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం సమర్థంగా పనిచేస్తుందన్నారు. పోలీసులు నిరంతరాయంగా గ్రామాల లో సహాయక చర్యలు చేపట్టారని తెలిపారు. అధికారికంగా ప్రకటన విడుదల చేసే వరకు ప్రజలు అటు ఇటు తిరగటానికి వీలులేదని పోలీసులకు ఆదేశించామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ఆర్ డి ఓ లు, తదితరులు ఉన్నారు.

### విజయవాడ వరద ప్రాంతాల బాధితులకు అండగా

## ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్



**గుంటూరు : సెప్టెంబర్ 03 (ఆంధ్రపత్రిక) :** భారీ వర్షాలతో జలమయమైన ప్రాంతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విజయవాడ 1,5,7 డివిజన్లో గుంటూరు తూర్పు శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్ పర్యటించారు. ఇటీవల ఏడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు బుడమేరు వాగు, ఏలూరు కాలువ పొంగి విజయవాడలోని 1,5,7 వార్డులో ఇళ్లలోకి నీరు వచ్చి వంట చేసుకోలేని పరిస్థితుల్లో నిరాశ్రయులు అయినా 5000మంది ప్రజలకు ఈరోజు గుంటూరు తూర్పు శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్ సారథ్యంలో భోజన ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ అందించడం జరిగింది. ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ సారథ్యంలో క్యాటరర్స్ అసోసియేషన్, ఆర్యవైశ్యులు వివిధ అసోసియేషన్ల సహకారంతో 50000 వాటర్ బాటిల్స్, 11000 భోజన ప్యాకెట్లు మరియు 1 ఆటో బిస్కెట్ ప్యాకెట్లు అందజేయడం జరిగింది. విజయవాడ ఒకటో వార్డులోని కొన్ని కాలనీలకు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పడవలో వెళ్లి అక్కడ పరిస్థితులను గమనించి కనీసం త్రాగునీరు, భోజన సదుపాయాలు లేవని అలాగే దైనందిన కార్యక్రమాలకు వాడుకొనే మీరు కూడా దొరకని ఇబ్బందికర పరిస్థితులలో ప్రజలు ఉన్నారని వారికి ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలని సూచించారు. వృద్ధులు, వికలాంగులు, చిన్నపిల్లలు పడుతున్న అవస్థలను గమనించి వెంటనే విద్యుత్ సరఫరా మరియు రవాణా సౌకర్యాలు పునరుద్ధరించడానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. స్థానిక ప్రజల గుర్తించి వెంటనే కొవ్వొత్తులు, మస్కిటో కాయిల్ ఈ రాత్రికి ఏర్పాటు చేసేలా ఎమ్మెల్యే నసీర్ చర్యలు తీసుకున్నారు. ఈ సహాయ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నసీర్ వెంట సీనియర్ ఐఏఎస్ అధికారి కన్నబాబు అధికారులు, స్థానిక నాయకులు ఉన్నారు.

### చారువాక యువజన సంఘం మరియు బీమ్ సేన సేవాదళ్ ఆధ్వర్యంలో

## దళిత అధికారుల సంతాప సభ



**గుంటూరు : సెప్టెంబర్ 03 (ఆంధ్రపత్రిక) :** దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డితో అంతరంగిక భద్రత ఐపీఎస్. కీర్తిశేషులు జాన్ వెస్లీ అంతరంగి క అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సుబ్ర హ్మణ్యం ఐఏఎస్ దళిత అధికారులు చనిపోయి 15 సంవత్సరాలు గడిచిన సందర్భంగా గుంటూరు లాడ్జి సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద చారువాక యువజన సంఘం, బీమ్ సేన సేవాదళ్ ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేసి వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బీమ్ సేన సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షులు నల్లపు. నీలాంబరం మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తూ కష్టపడి చదివి రిజర్వేషన్ పుణ్యం అంటూ ఆఫీసర్లు దళిత జాతికి ఉపయోగపడే సమయంలో లో చనిపోవడం అత్యంత బాధాకరమైన విషయం అన్నారు. చారువాక యువజన సంఘం అధ్యక్షులు చిన్నం దేవిడ్ విలియమ్స్ మాట్లాడుతూ దళిత అధికారులు జాతికి ఆణిముత్యాలు నీతి నిజాయితీ కలిగిన దళిత అధికారులు కోల్పోవటం బాధాకరం అన్నారు. ముఖ్యంగా నీతి నిజాయితీగా ఉద్యోగ బాధ్యత నిర్వహిస్తూ అందరి చేత మన్నలు పొందుతూ సాగుతున్న దళిత అధికారులు ఈ విధంగా మృతి చెందటం చాలా దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసికే పార్టీ మహిళా అధ్యక్షురాలు. కైలా జయసుధ. మాల మహానాడు, అన్నవరపు రాష్ట్ర కార్యదర్శి. బత్తుల అనిల్ కుమార్. జాతీయ ప్రజా సంఘాల ఐక్యవేదిక. నాయకుడు నామతోటి శంకర్ చుక్క దేవరాజు బండ్ల కాంతారావు. తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లల భద్రతకే తొలి ప్రాధాన్యం

### - ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు : సెప్టెంబర్ 03 (ఆంధ్రపత్రిక) :** ఆంధ్రప్రదేశ్ లో ఆడపిల్లల భద్రతకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తున్నదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం స్టాల్ హై స్కూల్ బిసి వసతి గృహాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పరిశీలించారు. నిన్న ఈ బిసి హాస్టల్ లోని 4మంది విద్యార్థులను వేధిస్తున్నారని నగరపాలెం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యిందని క్షేత్ర స్థాయిలో తాను పరిశీలించటానికి వచ్చానని, విద్యార్థినులతో మాట్లాడి ఇక్కడ జరుగుతున్న తతంగాన్ని మొత్తం అడిగితెలుసుకున్నారు. గత 2 సంవత్సరాల నుండి ఇలాగే జరుగుతున్నదని, గంజాయి బ్యాచ్ నేరుగా వసతి గృహంలోకి నేరుగా వచ్చి తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారని విద్యార్థినుల ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేసారు. వసతి గృహం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలు వస్తున్నాయని, ఆహారం కూడా సరిగ్గా ఉండటం లేదని, మరుగు దొడ్లకు సరయిన డోర్లు లేవని, వార్డెన్ మరియు నిర్వాహకుల మీద కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులను కోరబోతున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

### జిల్లా తెలుగు యువత అధ్యక్షులు సాయి కృష్ణ ఆధ్వర్యంలో

## వరద ముంపు బాధితులకు సహాయ కార్యక్రమాలు



**గుంటూరు, సెప్టెంబర్ 03 (ఆంధ్రపత్రిక) :** విజయవాడ ముంపు బాధితుల సహాయ కార్యక్రమాలకు జాతీయ తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు గుంటూరు నుండి జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ఆధ్వర్యంలో భారీగా బస్సుల్లో తరలిన తెలుగు యువత విద్యార్థులు ఆపన్నులకు ఆపన్న హస్తం పేరుతో గుంటూరు పశ్చిమ శాసనసభ్యురాలు గళ్ళా మాధవి ఆధ్వర్యంలో 10000 భోజన ప్యాకెట్లు మంచి నీళ్ల బాటిళ్లు పంపిణి చేస్తూ జెండా ఊపిన అనంతరం తెలుగుదేశం పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిన వరద సహాయక చర్యలకు గుంటూరు నుండి జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ఆధ్వర్యంలో బస్సులలో విజయవాడ తరలి వెళ్తున్న తెలుగు యువత సభ్యులను అభినందించి జెండా యూపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రావిపాటి సాయి కృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్, పల్లా శ్రీనివాస్ ఆదేశాలతో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయం నిరంతర పర్యవేక్షణలో గుంటూరు జిల్లా తెలుగుయువత సభ్యులకు విజయవాడలోని 45,46,47 డివిజన్లలో మంత్రి కింజారపు అచ్చం నాయుడు ఇంచార్జ్గా సమన్వయంతో మూడు డిజైన్ల సహాయ కార్యక్రమాల కోఆర్డినేటర్ గా తమను నియమించారని 45 లో ప్రత్తిపాటి పుల్లారావు, 46లో మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మారెడ్డి, 47 లో ప్రత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులుతో సహాయక కార్యక్రమాలు ముమ్మరం చేస్తున్నామని పుర్తిగా ముంపు కంట్రోల్ లోకి వచ్చేదాకా ఇక్కడే ఉండి సహక కార్యక్రమంలో ప్రత్యక్షముగా పాల్గొంటామని మూడురోజులపాటు చేయనున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో మందలపు బంగారు బాబు, అర్బన్ టిడిపి ప్రధాన కార్యదర్శి ముత్తినేని రాజేష్, బండారు ప్రసాద్ కోటేశ్వరావు, వేణు తథితరులు పాల్గున్నారు.

## విద్యా బోధనలో జైన్ హైస్కూల్ విద్యాసేవలు ఎనలేనివి



**గుంటూరు : సెప్టెంబర్ 03 (ఆంధ్రపత్రిక) :** జైన్ విద్యా సంస్థలు స్థాపించి 25 సంవత్సరాలు దాటిందని ఇప్పటికీ కూడా విలువలతో కూడిన విద్యను అందిస్తూ అత్యుత్తమ విద్యా విలువలను బోధిస్తుందని మాజీ మంత్రి, సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన్ మందిరంలో అఖిలభారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల రవీంద్ర బాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు,విద్యాదాన పురస్కారాలు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ప్రవేట్ విద్యాసంస్థలు స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఆయా విద్యా సంస్థల డైరెక్టర్లు, కరస్పాండెంట్లకు విద్యదాన పురస్కారాలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జైన్ హై స్కూల్ డైరెక్టర్ ఎం డి మున్ను ను ఘనంగా సత్కరించి, జ్ఞాపికను, మొక్కను అందజేసారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ ఎండి మున్ను అని ప్రశంసించారు. విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దటంలో జైన్ స్కూల్ డైరెక్టర్ గా డాక్టర్ మున్ను వ్యక్తిగత శ్రద్ధ ఎనలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు హనుమాన్ నరేంద్ర, టిడిపి సీనియర్ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, టిడిపి చైర్మన్ దాసరి రాము,పలు విద్యాసంస్థల డైరెక్టర్లు, కరస్పాండెంట్లు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పురస్కారం పురస్కార గ్రహీత డాక్టర్ ఎండీ ముందు మాట్లాడుతూ ఈ పురస్కారం నాలో మరింత బాధ్యత పెంచినట్లు అయిందన్నారు. ఒక క్రమశిక్షణ విద్య బోధన ద్వారా విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే తను విద్యాసంస్థలు నడుపుతున్నట్లు తెలియజేశారు.

## గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



**ఆగిరిపల్లి సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** స్థానికుల కథనం మేరకు వట్టి గుడిపాడు గ్రామానికి చెందిన నాగ వీర రాజు ఆగస్టు 31 శనివారం గేదల గడ్డి కోసం పొలానికి వెళ్లి సాయంత్రం మయినను తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి ఆ ప్రాంతంలో వెతకగా వట్టిగుడిపాడు, పోనసానపల్లి రహదారిలో పెద్ద వాగు సమీపంలో ఆయన సైకిలు గడ్డిమోపును గుర్తించగా వాగులో గల్లంతైనట్టు భావించారు ఆయన కుమారుడు ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్ర దర్యాప్తు చేపట్టి నూజివీడు ఆర్డీవో భవాని శంకరి ఆదేశాలతో తహసిల్దార్ ప్రసాద్ నేతృత్వంలో ఎస్సై బి సురేంద్ర కుమార్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, పడవ ప్రోక్లైన్ల సాయంతో సోమవారం పోనసానపల్లి, గొల్లపల్లి చెరువులు, ఒట్టిగుడిపాడు వాగులో గాలింపు చేపట్టినా ఫలితం లేకపోవడంతో మంగళవారం" ఈరోజు" గాలింపు చేపట్టగా పోనసానపల్లి గ్రామంలోని కురివిడి చెరువులో ఆయన శవం లభ్యమైనదని ఎమ్మార్వో ప్రసాద్ తెలిపారు. ఈ విషయమై ఎస్సై సురేంద్ర ను సంప్రదించగా మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పంచనా మాకు పంపామని తెలిపారు.

## వరద ప్రవాహం తగ్గాక సహాయక చర్యలపై దృష్టి పెట్టాలి



**బాపట్ల సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** వరద ప్రవాహం తగ్గిన తర్వాత లంక గ్రామాలలో సహాయక చర్యలపై అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. వరద మంపు తదుపరి చర్యలపై జిల్లా అధికారులతో మంగళవారం స్థానిక కొల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ముందుగా టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు, వరదతో దెబ్బతిన్న ప్రాంతాలలో అధికారులు పర్యటించాలని కలెక్టర్ చెప్పారు. లంక గ్రామాలలోని ప్రతి వ్యక్తికి ఆహార పదార్థాలు అందేలా చూడాలన్నారు. భోజన పదార్థాల అందించడంలో ఇబ్బందులు ఎదురైతే పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. భోజనం అందలేదనే ఫిర్యాదులు ఏట్టి పరిస్థితుల్లో రాకూడదన్నారు. సహాయక చర్యలపై డ్రోన్ ల ద్వారా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే నలుగురు అధికారులను సస్పెండ్ చేశామన్నారు. వైద్య శిబిరాలలో సిబ్బంది సంఖ్యను పెంచాలనున్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు శరవేగంగా చేపట్టాలన్నారు. రోగాలు ప్రబలకుండా ముఖ్యంగా బ్లీచింగ్ చల్లాలన్నారు. దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణకు చర్యలు చేసుకోవాలన్నారు. విద్యుత్ పునరుద్ధరణపై విద్యుత్ శాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు. దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన వన పంటలు గుర్తించాలన్నారు. పంటల నష్టంపై సర్వే చేపట్టాలని ఆదేశించారు. అనధికారికంగా లంక గ్రామాలలోకి ప్రజలు ప్రవేశించడాన్ని అరికట్టాలన్నారు. ఔషధాలకు కొరత లేకుండా నిల్వలు ఉంచాలని, వైద్యంలో జాప్యం చేయరాదన్నారు. రాత్రి నుంచే తగ్గుముఖం పట్టగా తెల్లవారుజామున మూడు గంటల సమయానికి వరద నీరు మూడు అడుగుల మేర దిగువకు తగ్గిందన్నారు. తదుపరి వరద ప్రవాహం తగ్గుతూ ఉందన్నారు. సహాయక చర్యలలో ఎలాంటి ఆరోపణలు రాకుండా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రపత్రిక
జిల్లాలకు విలేఖరులు కావలెను
స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన
ఏకైక దినపత్రిక - స్థాపితం - 1914
గుంటూరు, బాపట్ల, ఒంగోలు జిల్లాలోని
నియోజకవర్గాలకు
మరియు మండలాల వారిగా
విలేఖర్లు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
9849998069, 8639287624

# ఉద్ధృతంగా కృష్ణమ్మ...












విజయవాడలో ముంపు ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులకు భారత వాయుసేన హెలికాప్టర్ల ద్వారా త్రాగునీరు, బిస్కెట్లు, ఆహార పదార్థాలు,మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం.

















# ఆగని వ్యథా..








# కేజ్రీవాల్‌కు కస్టడీ పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్‌ను రిలీజ్ చేస్తూ ఢిల్లీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. నిన్న (సోమవారం) ఆయనకు కోర్టు బెయిల్‌ను మంజూరు చేసింది.అయితే, ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో మార్చి 21వ తేదీన ఎన్‌ఫోర్స్ మెంట్ (ఈడీ) అరెస్టు చేసింది. మనీలాండరింగ్ కేసులో జూన్ 20న ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేయగా.. ఆ బెయిల్ పై స్టే ఇస్తూ.. ఢిల్లీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. జులై 14వ తేదీన ఈడీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్‌ను ఇవ్వగా.. సుప్రీంకోర్టును ఆశ్రయించే ముందే సీబీఐ ఆయనను అదుపులోకి తీసుకుంది. ప్రస్తుతం సీబీఐ కేసులో అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీపై తిహార్ జైలులో ఉండిపోయారు.

# నేను ఏ తప్పు చేయలేదు..

(మొదటి పేజీ తరువాయి)

ఊహాగానాలపై స్పందించారు. పార్టీ హైకమాండ్, ఎమ్మెల్యేల నిర్ణయానికి కట్టుబడి ఉంటానని సిద్ధరామయ్య చెప్పారు.తన స్వగ్రామం మైసూరులో మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సమాధానమిస్తూ సీఎం సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేశారు.మాజీ మంత్రి, సీనియర్ నేత ఆర్వీ దేశ్‌పాండే ప్రకటనపై సీఎం స్పందించారు. ముఖ్యమంత్రి పదవిని కొత్త వ్యక్తితో భర్తీ చేస్తే తాను ఆ పదవిని చేపట్టడానికి సిద్ధంగా ఉన్నానని ఆర్వీ దేశ్‌పాండే వ్యాఖ్యానించారు. దీనిపై సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ.. 'సీఎంను ఎలా మారుస్తారు? దీనిపై పార్టీ ఎమ్మెల్యేలు, హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుంది. వారు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా నేను దానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.ముడా కేసు నేపథ్యంలో సీఎం నిస్తేజంగా కనిపిస్తున్నారనే బీజేపీ వ్యాఖ్యలపై.. సీఎం సిద్ధరామయ్య నవ్వుతూ.. 'ఈ విషయంలో ప్రతిపక్షాలు అబద్ధాలు చెప్పాయి. వారి అబద్ధం రుజువు కాకపోతే వారికి కష్టమే. నేను అబద్ధాలు చెప్పలేదు, తప్పుడు ప్రకటనలు చేయలేదు.. నేను ఏ తప్పు చేయలేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం కోవిడ్‌పై జ్యుడీషియల్ కమిషన్ ఇచ్చిన నివేదికను బీజేపీకి వ్యతిరేకంగా ఉపయోగిస్తుందనే ప్రశ్నకు సమాధానంగా.. ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను గురువారం మంత్రివర్గం ముందు ఉంచబోతున్నట్లు చెప్పారు. కమీషన్ సిఫార్సు గురించి నాకు తెలియదు. మేము దానిని పరిశీలిస్తామన్నారు.

# భారీగా పెరిగిన పర్సనల్ లోన్స్

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత సర్వీసెస్ వాటా 27.4శాతం, ఇండస్ట్రీస్ 22.2శాతం, వ్యవసాయం, సంబంధిత కార్యకలాపాల వాటా 12.8శాతంగా ఉన్నది. ఇక క్రెడిట్‌కార్డుల బకాయిలు జూలై చివరి నాటికి భారీగా పెరిగాయి. అయితే, బ్యాంకుల మొత్తం రుణాల్లో వీటి వాటా కేవలం ఒకశాతం మాత్రమే. వార్షిక ప్రాతిపదికన 22శాతం వృద్ధితో రూ.2.8లక్షల కోట్ల మార్క్‌ను దాటింది. అలాగే బంగారు ఆభరణాలపై తీసుకున్న రుణాలు ఏకంగా 39శాతం పెరిగాయి. అయితే, మొత్తం వ్యక్తిగత రుణాల వాటాలో 0.8శాతంగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది. అయితే, జనం ఎక్కువగా గంటల వ్యవధిలో లభించే రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నట్లుగా నివేదిక పేర్కొంది.వాస్తవానికి బంగారంపై రుణం వెంటనే అందుబాటులో ఉంటుంది. వడ్డీ దాదాపుగా వ్యక్తిగత రుణానికి సమానంగానే లభిస్తుంది. నివేదిక ప్రకారం, బలహీనమైన వృద్ధి ఉన్నప్పటికీ వ్యవసాయం.. సంబంధిత కార్యకలాపాలకు ఇచ్చిన రుణాలు 18.1 శాతం పెరిగాయి. మొత్తం రుణాలు రూ.21.6 లక్షల కోట్లకు చేరాయి. పరిశ్రమలకు ఇచ్చే రుణాలు 13.7 శాతం పెరిగాయి. హౌసింగ్ లోన్స్ డిమాండ్ అతి తక్కువగా ఉన్నట్లు ఆర్‌బీఐ గణాంకాలు పేర్కొంటున్నాయి. ఈ కాలంలో వృద్ధి 12.8శాతం మాత్రమే పెరిగింది. గృహ రుణాల మొత్తం పరిమాణం ఇప్పుడు రూ.28లక్షల కోట్లు దాటింది. ఇటీవలి కాలంలో టాప్-8 నగరాల్లోని ఇండ్ల ధరలు విపరీతంగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే, అమ్మకాలు బాగానే ఉంటున్నా.. గృహ రుణాలకు డిమాండ్ రేటు తక్కువగానే ఉందని నివేదిక పేర్కొంది.

# ఛత్తీస్‌ఘడ్‌లో మరోమారు కాల్పులు

(మొదటి పేజీ తరువాయి)

భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలతో జరిగిన కాల్పుల్లో 9 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. నిఘా వర్గాల సమాచారం మేరకు ఈ ప్రాంతంలో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతాబలగాలను చూసిన మావోయిస్టులు వారిపై కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులు చేపట్టాయి. ఉదయం 10.30 గంటలకు మొదలైన ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. ఇప్పటివరకు 9 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమైనట్లు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలంలో పెద్ద ఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టు 29న నారాయణపుర్ జిల్లా అబూజ్‌మాడ్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు-మావోయిస్టు దళాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఇందులో ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. తాజా ఘటనతో కలిపి ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన ఎదురుకాల్పుల ఘటనల్లో 154 మంది మావోయిస్టులు మరణించారని పోలీసులు వెల్లడించారు.

# వరద బాధితులకు ఆహారం,నీరు అందాలి

(మొదటి పేజీ తరువాయి)

ధైర్యం చెబుతున్నారు. బాధితులకు మూడు పూటలా భోజనంతో పాటు వాటర్ సదుపాయం కల్పిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపి మరీ సహాయక చర్యలు బాధితులకు అందేలా చూస్తున్నారు. మరోవైపు మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణలో విజయవాడ వరద బాధితులకు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం సహాయక చర్యల్లో ఆరు హెలికాప్టర్ల ద్వారా ఆహారం, తాగు నీటిని సరఫరా చేశారు. బోట్లు చేరుకోలేని ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఆహార సరఫరా చేస్తున్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ విజ్ఞప్తి మేరకు జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి ప్రత్యేక హెలికాప్టర్‌లో 2,500 ఆహార పొట్లాలను చేరవేస్తున్నారు. విజయవాడ పరిధిలో వరద ముంపునకు గురైన 32 వార్డుల్లో సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంత్రి లోకేష్ పిలుపు మేరకు సహాయ చర్యల్లో రాష్ట్రం నలుమూలల నుంచి విజయవాడకు పార్టీ శ్రేణులు చేరుకున్నాయి. విజయవాడ డివిజన్ పరిధిలో 70 పునరావాస కేంద్రాల్లో 14,452 మంది నిరాశ్రయులు ఆశ్రయం పొందుతున్నారు. ప్రకాశం బ్యారేజి వద్ద వేగంగా వరద తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుత వరద ప్రవాహం 8,71,776 క్యూసెక్కులకు చేరుకుంది. మరోవైపు రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద పరిస్థితులు, బాధితులకు అందుతున్న ఆహారం గురించి ఆరా తీశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. తాగు నీరు, ఆహారం ప్రతి ఒక్కరికి చేరాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సహాయక చర్యల్లో కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు. ఇప్పటికే మచిలీపట్నం నుంచి విజయవాడకు టీడీపీ కార్యకర్తలు చేరుకున్నారు. బాధితులకు అండగా నిలవాలని, భరోసా కల్పించాలని కార్యకర్తలందరికీ కొల్లు రవీంద్ర సూచించారు.

# ఇసుక సరఫరాలో స్వల్ప అంతరాయం

(మొదటి పేజీ తరువాయి)

ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. వివిధ రీచ్‌ల నుండి సరఫరా నిలిచిపోయిందని, వర్షాలు తగ్గుముఖం పట్టి, రవాణా పరిస్థితులు మెరుగైన తురువాత పూర్తి స్థాయిలో ఇసుక సరఫరా కొనసాగుతుందన్నారు. బుధవారం నాటికి 28 ఇసుక నిల్వ కేంద్రాలలో 14,76,958 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. మంగళవారం 13,011 మెట్రిక్ టన్నుల ఇసుక కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1027 ధరఖాస్తులు అందాయన్నారు. మంగళవారం ధరఖాస్తు చేసుకున్న 1,027 ధరఖాస్తుదారులతో పాటు, పెండింగ్ లో ఉన్న 202 ధరఖాస్తుదారులకు 3,356 మెట్రిక్ టన్నుల ఇసుక, మొత్తంగా 1,229 ధరఖాస్తుదారులకు 16,367 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేసామన్నారు. పలు చోట్ల రహదారులు దెబ్బతిన్న పరిస్థితిలో వినియోగదారులు తమవంతు సహకారం అందించాలని ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.

# అందుకే నేను పర్యటించలేదు

(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. 'నేనూ పర్యటించాలని అనుకున్నా. నా వల్ల సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుందేమోనని భావించి వెళ్లలేదు. నా పర్యటన సహాయపడేలా ఉండేలా తప్ప అదనపు భారం కాకూడదు. నేను రాలేదని కొందరు నిందలు వేస్తారు. అంతే తప్ప ఇంకేం ఉండదు.విపత్తు సమయంలో నిందల కంటే ప్రజాసేవ చేయడమే ముఖ్యం' అని పవన్ వెల్లడించారు.

# కశ్మీర్ ఎన్నికల ప్రచారంకు మోదీ!

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3 :** జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం వేడెక్కనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే వారం జమ్మూకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. మూడు ఎన్నికల ర్యాలీల్లో ప్రధాని పాల్గొంటారని, జమ్మూ ప్రాంతంలో రెండు చోట్ల, కశ్మీర్‌లో ఒక చోట బీజేపీ అభ్యర్థుల తరపున ప్రధాని ప్రచారం సాగిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. 370వ అధికరణ రద్దు, అనంతరం జరిగిన అభివృద్ధి, జమ్మూకశ్మీర్‌లో తొలిసారి ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సీట్ల కోటా కల్పించడం వంటి అంశాలే ప్రచారాస్త్రాలుగా ప్రధాని పర్యటన ఉంటుందని తెలుస్తోంది. డీలిమిటేషన్ తర్వాత 43 అసెంబ్లీ స్థానాలైన జమ్మూలో కనీసం 35 సీట్లు గెలుచుకుని, కశ్మీర్‌లో తగినన్ని సీట్లు దక్కించుకోవడం ద్వారా ప్రభుత్వ ఏర్పాటులో కీలక భూమిక పోషించాలని బీజేపీ పట్టుదలగా ఉంది. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు మూడు విడతలుగా సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1వ తేదీన పోలింగ్ జరుగనుండగా, అక్టోబర్ 8న ఫలితాలు వెలువడతాయి.

# వరద బాధితులకు అండగా సినీ ప్రముఖులు

- కోటి విరాళం ప్రకటించిన జూనియర్ ఎన్టీఆర్
- 5లక్షలు ప్రకటించిన నటుడు విశ్వక్ సేన్
- 50 లక్షల సాయం ప్రకటించిన నిర్మాత రాధాకృష్ణ



**హైదరాబాద్,సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక):** తెలుగు రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు ఎంతో మంది సామాన్య ప్రజలు నిరాశ్రయులయ్యారు. ప్రభుత్వం తమ తమవంతుగా సాయం చేస్తున్నప్పటికీ.. సాధ్యం కాని పరిస్థితి. ఈ క్రమంలో సినీ, రాజకీయ.. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు విరాళాలు ప్రకటిస్తూ 'మేము సైతం' అంటూ ముందు కొస్తున్నారు. ఇప్పటికే వైజయంతి మూవీస్ అధినేత అశ్వనీదత్ 25 లక్షల రూపాయిలకు ఏపీకి విరాళంగా ప్రకటించారు. ఆ తర్వాత టాలీవుడ్ యంగ్ హీరో జూనియర్ ఎన్టీఆర్.. తెలుగు రాష్ట్రాలకు కోటి రూపాయిలు విరాళం ఇచ్చారు. ఈ విషయాన్ని ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. 'రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల జరుగుతున్న వరద భీభత్సం నన్ను ఎంతగానో కలచి వేసింది. అతి త్వరగా ఈ విపత్తు నుంచి తెలుగు ప్రజలు కోలు కోవాలని నేను ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను. వరద విపత్తు నుంచి ఉపశమనం కోసం రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తీసుకొనే చర్యలకు సహాయపడాలని నా వంతుగా.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల ముఖ్యమంత్రి సహాయ నిధికి చెరొక 50 లక్షల రూపాయిలు విరాళంగా ఇస్తున్నాను' అని ట్విట్టర్‌లో ఎన్టీఆర్ ప్రకటించారు. మరోవైపు.. వరద భాదితుల సహాయార్థం ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు విశ్వక్ సేన్ రూ. 5 లక్షల విరాళంగా ప్రకటించారు. ప్రజలకు ఎప్పుడు ఏ ఆపద వచ్చినా, విపత్తు ముంచెత్తినా... తమ వంతు సాయం చేయడానికి తెలుగు చలన చిత్ర పరిశ్రమ ప్రముఖులు ఎల్లప్పుడూ ఓ అడుగు ముందు ఉంటారు. మాటల మాంత్రికుడు, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్... ఆయనతో వరుసగా సినిమాలు నిర్మిస్తున్న హారిక అండ్ హాసిని క్రియేషన్స్ అధినేత సూర్యదేవర రాధాకృష్ణ (చిన బాబు), సూర్యదేవర నాగవంశీ 50 లక్షల రూపాయల విరాళం ప్రకటించారు. ఏపీ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 25 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 25 లక్షలు ఇస్తున్నట్టు ఓ ప్రకటనలో తెలిపారు.

# హర్యానా ఎన్నికలపై కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ ఎన్నికల్లో 20 స్థానాలు తమకు కేటాయించాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేస్తుంది. దీంతో కాంగ్రెస్ పార్టీ కొంత డైలమాలో పడినట్లు ఓ చర్చ సైతం సాగుతుంది. అదీకాక హరియాణాలో బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతుంది. ఆ క్రమంలో మరికొన్ని పార్టీలతో కలిసి ఈ ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటుంది.ఇందులో భాగంగా సమాజవాదీ పార్టీతో సైతం పొత్తు పెట్టుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేపట్టినట్లు తెలుస్తుంది. దీంతో ఆ పార్టీకి సైతం సీట్లు కేటాయించ వలసి ఉంది. అలాంటి వేళ 20 సీట్లు ఆప్‌కు కేటాయిస్తే.. అనంతరం చోటు చేసుకునే పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ సీనియర్లు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీల పొత్తు అంశం ఒక కొలిక్కి వచ్చే అవకాశముంది. అదీకాక ఇండియా కూటమిలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, సమాజవాదీ తదితర పార్టీలు భాగస్వామ్య పక్షాలుగా ఉన్నాయి. అలాంటి వేళ.. సీట్ల అంశం ఒక కొలిక్కి వచ్చే అవకాశముంది. ఇక 90 అసెంబ్లీ స్థానాలున్న హరియాణా అసెంబ్లీకి అక్టోబర్ 5వ తేదీన... అంటే ఒక దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు అక్టోబర్ 8వ తేదీన వెలువడనున్నాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో హరియాణాలో ఆప్, కాంగ్రెస్ పార్టీలు కలిసి పోటీ చేశాయి. మొత్తం 10 లోక్‌సభ స్థానాల్లో 9:1 నిష్పత్తిలో కాంగ్రెస్, ఆప్‌లు అభ్యర్థులను బరిలో దింపాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అయిదు సీట్లు కైవసం చేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేసిన కురుక్షేత్ర లోక్ సభ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది.

# హత్యాచారాలకు ఇక మరణశిక్ష

**అపరాజిత విమెన్ అండ్ చైల్డ్ బిల్లుకు బెంగాల్ ఆమోదం**

**ఇదో చారిత్రక బిల్లు అని అభివర్ణించిన సిఎం మమత**

కోల్‌కతా,సెప్టెంబర్3(ఆర్ఎన్ఎ): పశ్చిమ బెంగాల్ లో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టిస్తోంది. తీవ్ర విమర్శల నేపథ్యంలో.. అసెంబ్లీలో మంగళవారం బెంగాల్ ప్రభుత్వం హత్యాచార నిరోధక బిల్లును ప్రవేశపెట్టింది. 'అపరాజిత విమెన్ అండ్ చైల్డ్ బిల్లు' పేరిట దానిని తీసుకు వచ్చింది. ఇందుకోసం ప్రత్యేక సెషన్‌ను నిర్వహిస్తోంది. చర్చ అనంతరం దీనికి ఏకగ్రీవంగా ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసెంబ్లీలో మాట్లాడారు. ఈ బిల్లు చరిత్రాత్మకమని వ్యాఖ్యానించారు. సీబీఐ నుంచి న్యాయం కోరుతున్నాం. దోషులకు మరణశిక్ష విధించాలని కోరుతున్నాం. ఈ రోజు మేం ప్రవేశపెట్టిన బిల్లుపై గవర్నర్ సంతకం చేయాలని విపక్షాలు అడగాలి. ఆ తర్వాత దానిని అమలు చేసే బాధ్యత మాది. ఈ బిల్లు ద్వారా కేంద్రచట్టంలోని లోపాలను సరిద్దిద్దే ప్రయత్నం చేస్తున్నాం. సత్వర విచారణ, బాధితులకు న్యాయం లభించడం ఈ బిల్లు లక్ష్యం. ఒకసారి ఈ బిల్లు పాస్ అయితే.. ప్రత్యేక అపరాజిత టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటుచేస్తాం. అత్యాచారం వంటి దారుణాలు మానవాళికి శాపాలు. ఇలాంటి ఘోరాలు జరగకుండా సామాజిక సంస్కరణలు రావాలి. యూపీ, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో మహిళలపై అసాధారణ స్థాయిలో నేరాలు జరుగుతున్నాయి. ఉన్నావ్, హాథ్రస్ కేసుల్లో న్యాయం గురించి ఎవరూ మాట్లాడటం లేదు. కానీ బెంగాల్‌లో మహిళలకు కోర్టుల్లో న్యాయం లభిస్తుంది. మీవలే నేనూ ప్రధాని, హోంమంత్రిపై నినాదాలు చేస్తే ఎలా ఉంటుంది..? మహిళ రక్షణ కోసం సమర్థవంతమైన చట్టాలు తీసుకురాలేని ముఖ్యమంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేయండని పేర్కొన్నారు. మృతురాలికి నివాళి అర్పించారు. హత్యాచార ఘటనపై మమత ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తోన్న విపక్షాలు.. ఈ బిల్లుకు మద్దతు ఇచ్చాయి.

# తక్షణ సాయంగా 2 వేల కోట్లు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. దీనిపై ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశానని, జాతీయ విపత్తుగా గుర్తించాలని కోరానని అన్నారు. మహ బూబాబాద్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. జిల్లాలో పర్యటించిన ఆయన.. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో కలిసి వరదలపై సమీక్ష నిర్వహించారు.మంగళవారం నాడు మహబూబాబాద్ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... అనంతరం మహబూబాబాద్ జిల్లాలో వాటిల్లిన నష్టాలపై కలెక్టరేట్ లో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో నలుగురు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. దాదాపు 30వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వెల్లడించారు. సహాయచర్యల్లో నిరంతరం పనిచేసిన రెవెన్యూ, పోలీసు సిబ్బందిని అభినందించారు.అధికారుల చర్యలతో ప్రాణనష్టం తగ్గించగలిగాం. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం ప్రకటించాం. పంట నష్టం అంచనా వేసి పరిహారం అందజేస్తాం. నష్టపోయిన మూడు తండాలవాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. నష్టంపై కేంద్రానికి నివేదించడానికి నివేదిక తయారు చేయాలి. కేంద్రం దీన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి. ఆస్తి, ప్రాణ నష్ట పరిశీలనకు ప్రధాని మోదీని ఆహ్వానించాం. తక్షణమే రాష్ట్రానికి రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరారు. వర్షం తగ్గినందున బురద తొలగించే పనులు అధికారులు ప్రారంభించాలి. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తే ఇళ్లలోని బురద తొలగించవచ్చు. విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది.. మరింత జాగ్రత్తగా ఉండాలి. ఎంత ఒత్తిడి ఉన్నా హైడ్రా ఏర్పాటు చేసి ఆక్రమణలను కూల్చేస్తున్నాం అన్నారు. ప్రకృతి ప్రకోపిస్తే ఏం జరుగుతుందో మనం ఇతర రాష్ట్రాల్లో చూస్తున్నాం. చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంది. ఆక్రమణలకు సహకరించిన వారిపై కూడా చర్యలు ఉంటాయి. పేదల ప్రాణాలు పోయాక ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ కూర్చోదు. పువ్వాడ ఆక్రమణలు తొలగించాలని హరీశ్‌రావు డిమాండ్ చేయగలరా? ఆక్రమణల తొలగింపునకు హరీశ్‌రావు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తారా? చెరువులను ఆక్రమించిన వారు ఎంతటివారైనా తొలగించాల్సిందే. ఆక్రమణల తొలగింపునకు విధివిధానాలు రూపొందించాలని సీఎం రేవంత్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. హైడ్రా తరహాలో ప్రతి జిల్లాలోనూ ఒక వ్యవస్థను కలెక్టర్లు ఏర్పాటు చేసుకోవాలని నిర్దేశించారు. చెరువులను ఆక్రమించుకోవడం క్షమించరాని నేరం అని.. చెరువుల ఆక్రమణలపైన రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపడతామని రేవంత్ రెడ్డి చెప్పారు. ఆక్రమణలకు పాల్పడినది ఎంతటి వారైనా వదిలి పెట్టబోమని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. చెరువుల ఆక్రమణకు సహకరించిన అధికారులపైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

# కొండెక్కిన కూరగాయల ధరలు..!

(మొదటి పేజీ తరువాయి)

500 రూపాయలకు కిలో అంటున్నారు. అల్లం 200కు చేరుకుంది. ఇకపోతే ఉల్లిపాయలు 60కి అమ్ముతున్నారు. వరద ప్రాంతాల్లో అసలు కూరగాయలు, నిత్యావసర వస్తువులు దొరకడం లేదని ప్రజలు వాపోతున్నారు. రవాణా సదుపాయాలు సరిగా లేకపోవడం వల్లనే కూరగాయల ధరలు పెరుగుతున్నాయని కూరగాయల వ్యాపారులు అంటున్నారు. ఆటోలు, ట్రాలీల్లో ఎక్కువ ధరలు చెల్లించి తీసుకుని రావాల్సి వస్తోందని అన్నారు. వర్షాల కారణంగా దిగుబడులు తగ్గాయని వాపోతున్నారు. పెట్రో ధరల ప్రభావంతో రవాణా సౌకర్యాలు పూర్తిస్థాయిలో మెరుగుపడలేదు. ఇప్పటికీ సాధారణ పరిస్థితులు నెలకొనలేదు. పెట్రోల్, డీజిల్ రేట్లు పెరిగిపోవడంతో వాహనాలకు సైతం అధికంగా వెచ్చించాల్సి వస్తున్నది. అలాగే మార్కెట్లలో కూలీలు సైతం అందుబాటులో ఉండడంలేదు. పక్క రాష్ట్రాల నుంచి వచ్చే కూరగాయల వాహనాలకు గతంతో పోలిస్తే 3వేల నుం చి 4వేల దాకా అదనంగా ఖర్చు చేయాల్సి వస్తున్నదని అమ్మకందారులు చెబుతున్నారు. కూరగాయల ధరలు ఎన్నడూ లేనంతగా పెరిగిపోవడంతో అమ్మకాలపై తీవ్ర ప్రభావం పడింది. ఏది కొందామన్నా వందలు రూపాయలు వెచ్చించాల్సి రావడంతో కొనుగోలు చేసేందుకు వినియోగదారులు భయపడుతున్నారు. 20 రోజుల క్రితం వరకు రోజుకు రెండు క్వింటాల్‌కు పైగానే టమాటలు అమ్మే వ్యాపారులు నేడు క్వింటాల్ కూడా అమ్మడం లేదని చెబుతున్నారు. వరదలు తగ్గి కొత్తగా వేసిన పంటలు చేతికందే వరకు ఇదే పరిస్థితులు ఉండవచ్చునని తెలిపారు. కూరగాయల ధరలు కొండెక్కాయి. రెట్టింపు రేట్లు పలుకు తున్నాయి. కొన్నింటి ధరలు ఏకంగా చికెన్‌ను మించి పోతున్నాయి.. ఇటీవల కురిసిన భారీ వర్షాలు పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఒక్కసారిగా దిగుబడి తగ్గడం, డిమాండ్ పెరగడంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయి. ఏది కొందామన్నా కిలోకు వందకు పైనే పలుకుతున్నాయి.. కొన్నయితే ఏకంగా 150 నుంచి 200కు చేరాయి. వారం రోజుల్లనే రేట్లు అమాంతం పెరిగి వినియోగదారులకు చుక్కలు కనబడుతున్నాయి. ఇప్పటికే వర్షాల ధాటికి చితికిపోయిన పేదలను ఈ ధరలు మరింత భయపెడుతున్నాయి. రాష్ట్రం, ఇతర రాష్ట్రాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు కూరగాయల పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. పెద్ద మొత్తంలో తోటలు దెబ్బతిన్నాయి. దిగుబడి గణనీయంగా తగ్గిపోవడంతో రైతులు సైతం తీవ్రంగా నష్టాలపాలవుతున్నారు. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడులో కుండపోతగా కురిసిన వర్షాలతో దిగుమతులు తగ్గిపోయాయి. ముఖ్యంగా మన మార్కెట్‌కు టమాట, ఉల్లిగడ్డల రాక తగ్గిపోవడంతో వీటి రేట్లు ఆకాశాన్నంటు తున్నాయి. వాహన రవాణా చార్జీలు పెరిగి అంతిమంగా కూంగాయల ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి.

# జత్వానీని వేధించడం తగదు

(మొదటి పేజీ తరువాయి)

వైఎస్ షర్మిల విమర్శిం చారు. ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తిచేయాలని వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. మాజీ సీఎం జగన్ గత ఏడాది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన చేసినా దాని గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. పరిశ్రమ ఏర్పాటుపై కాంగ్రెస్ తరపున పోరాటం చేస్తామని చెప్పారు. ముంబయి నటి కాదంబరి జత్వానీ వ్యవహారంపైనా షర్మిల స్పందించారు. ఈ విషయంలో జగన్‌పై పలు విమర్శలు చేశారు. ఆమెను ఎలా కట్టడి చేయాలో జగన్, సజ్జన్ జిందాల్ ప్లాన్ చేశారని ఆరోపించారు. సజ్జన్ జిందాల్, జగన్ మధ్య సాన్నిహిత్యాన్ని గొప్పగా చెప్పుకొన్నారు. జిందాల్‌కు ఎందుకు ఇన్ని కోట్లరూపాయల ఆస్తి కట్టబెట్టారో జగన్ సమాధానం చెప్పాలని అన్నారు. సజ్జన్ జిందాల్ గతంలో పదేపదే జగన్‌ను కలుస్తూంటే స్టీల్ ఫ్యాక్టరీ కోసం అనుకున్నామని కానీ వెనుక హీరోయిన్ కాదంబరి జెత్వానీని టార్గెట్ చేసి వేధించే కుట్ర ఉందని తెలిసిన తర్వాత ఆశ్చర్య పోవాల్సి వచ్చిందని ఏపీ పీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి వ్యాఖ్యానించారు. కడప జిల్లా కలెక్టర్ ను ఆమె కలిశారు. స్టీల్ ప్లాంట్ పురోగతిపై మాట్లాడారు. ఆ తర్వాత మీడియా తో మాట్లాడిన సందర్భంగా జగన్ పై విమర్శలు గుప్పించారు. జిందాల్ కంపెనీ ప్రాజెక్ట్ నిర్మాణంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు కానీ.. పదే పదే తాడేపల్లి ప్యాలెస్‌లో సజ్జన్ జిందాల్ కలుస్తుంటే కడప స్టీల్ వేగవంతం చేస్తున్నారు అనుకున్నా మన్నారు. కాని ఒక మహిళా కాదంబరి విషయం బయట పడేసరికి ఇందుకా.. అని ఆశ్చర్య పోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఆడదాన్ని ఒక్క దాన్ని చేసి తొక్కాలని చూశారని విమర్శించారు. జె అండ్ జె ఇద్దరు కలిసి బుర్రకు పదనును పెట్టి.. జె స్వేర్ కలిసి కార్యాచరణ చేశారన్నారు. మీ బుర్రలు కడప స్టీల్ మీద పెట్టి ఉంటే ప్రాజెక్ట్ ఎప్పుడో పూర్తి అయ్యేదన్నారు. సజ్జన్ జిందాల్ గతంలోనే జగన్ గురించి చెప్పారని.. ఇద్దరు మంచి దోస్త్ లు అని చెప్పాడని గుర్తు చేశారు. రాష్ట్రానికి జిందాల్ ఏమి చేశాడని వేల ఎకరాలు భూములు కట్ట బెట్టారో చెప్పాలని జగన్‌ని ప్రశ్నించారు. జిందాల్ కి 3500 ఎకరాలు అప్పగిస్తే ఎందుకు పనులు ప్రారంభించలేదని ప్రస్నించారు. జెత్వాని ఒక డాక్టర్. ఆమె ఒక నటి .. ఒక గొప్పకుటుంబం నుంచి వచ్చారన్నారు. ఆమె ఒక కేసు పెడితే .. ఆమెను తొక్కాలని చూశారని.. నిజంగా కాదంబరి మోసం చేయాలని చూస్తే జిందాల్ ఒక 50 లేదా 100 కోట్లు ఇచ్చి సెటిల్మెంట్ చేసుకోనే వాడు కదా అని ప్రశ్నించారు. ఆమె న్యాయం కావాలని నిలబడిందన్నారు.

# బాధితులకు అండగా ఉండాలి



(మొదటి పేజీ తరువాయి)

తెలిసిందే. బాధితులతో మాట్లాడిన ఆయన.. వాళ్లకు అందుతున్న సహాయక చర్యలపై ఆరా తీశారు. ఈ క్రమంలో ఇవాళ అందుబాటులో ఉన్న పార్టీ ముఖ్యనేతలతో సమావేశమైన ఆయన విరాళ ప్రకటన చేశారు. "వరద ముంచెత్తిన ప్రాంతాల్లో ప్రభుత్వం ఎలాంటి సహాయ కార్యక్రమాలు చేపట్టడం లేదు. లక్షలాది మంది కనీసం ఆహారం, మంచినీరు కూడా దొరక్క నానా ఇబ్బంది పడుతున్నారు" అని సమావేశంలో పలువురు నాయకులు జగన్‌కు తెలిపారు. కేవలం ప్రచార ఆర్భాటం తప్ప, వాస్తవంగా ఎలాంటి చర్యలు అక్కడ లేవన్నారు. వరద ప్రాంతాల్లో షో చేస్తూ, ఫోటోలకు ఫోజులు ఇస్తూ.. సీఎం చంద్రబాబు పర్యటిస్తున్నారని, అధికార యంత్రాంగమంతా ఆయనతో ఉంటూ, ప్రజల సమస్యలను గాలికొదిలేసిందని చెప్పారు. ఫలితంగా.. వరద బాధితులు అనారోగ్యం పాలవుతున్నా.. వారికి మందులు కూడా లభించడం లేదన్నారు.జగన్ స్పందిస్తూ.. తన పర్యటనలో వరద బాధితుల పడుతున్న కష్టాలను స్వయంగా చూశానన్న జగన్.. వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని తెలిపారు. కూటమి ప్రభుత్వ ఘోర తప్పిదం వల్లనే వరదలు ముంచెత్తాయని.. అయినా నింద వైఎస్సార్సీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నారని నేతలతో ఆయన అన్నారు. వరద బాధితుల కోసం పార్టీ తరపున కోటి రూపాయల సాయం ప్రకటిస్తున్నామని.. అది ఏ రూపంలో, ఎలా ఇవ్వాలనేది చర్చించి నిర్ణయం తీసుకుందామని నేతలతో జగన్ చెప్పారు. ఈ సమావేశంలో.. పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు మేరుగు నాగార్జున, వెల్లంపల్లి శ్రీనివాస్, కారుమూరి నాగేశ్వరరావు, కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, కైలే అనిల్కుమార్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ అడపా శేషు, పార్టీ నాయకుడు షేక్ ఆసిఫ్, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన పార్టీ నేతలు పాల్గొన్నారు.

# యూపి బహరాయిచ్‌ను వణికిస్తున్న తోడేళ్లు

**కనిపిస్తే కాల్చేయాలని సిఎం ఆదేశం**

**లక్నో,సెప్టెంబర్ 3 :** ఉత్తరప్రదేశ్‌లోని బహరాయిచ్ జిల్లాను తోడేళ్ల గుంపు వణికిస్తోంది. గత కొన్ని నెలలుగా మహసి ప్రాంతంలోని ఈ జీవాల వరుస దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో వీటిని పట్టుకోవడం కోసం అధికారులు 'ఆపరేషన్ భేడియా' చేపట్టినా.. దాడులు మాత్రం ఆగట్లేదు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. తోడేళ్లు కన్పిస్తే కాల్చేయాలని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. మొత్తం ఆరు తోడేళ్లతో కూడిన గుంపు సంచరిస్తోందని గుర్తించిన అటవీశాఖ అధికారులు.. 'ఆపరేషన్ భేడియా'లో భాగంగా ఇప్పటివరకు నాలుగింటిని పట్టుకున్నారు. మిగతా రెండింటిని బంధించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా అవి మాత్రం చిక్కట్లేదు. మరోవైపు.. తోడేళ్ల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం రాత్రి కూడా ఓ ఐదేళ్ల పాపపై దాడి చేసి గాయపర్చింది. ఇప్పటి వరకు తోడేళ్ల దాడుల్లో 10 మంది మరణించగా.. దాదాపు 30 మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో తొమ్మిది మంది చిన్నారులే కావడం గమనార్హం. ఈ క్రమంలోనే తాజాగా సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో 'ఆపరేషన్ భేడియా'పై అధికారులు సీఎంకు వివరణ ఇచ్చారు. తోడేళ్లు (చినీలె!బ) ఎప్పటికప్పుడు తమ స్థావరాలను మార్చుతుండటంతో పట్టుకోవడం సవాల్‌గా మారుతోందని వివరించారు. అనంతరం అటవీశాఖ అధికారులకు ముఖ్య మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. తోడేళ్లను పట్టుకోవడం అసాధ్యమైన తరుణంలో వాటిని కాల్చేయాలని ఆదేశించారు. అయితే, అది చివరి అవకాశంగా మాత్రమే పరిగణించాలని పేర్కొన్నట్లు సదరు కథనాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా బహరాయిచ్ జిల్లా కలెక్టర్ రాణి మాట్లాడుతూ. .ప్రతి నాలుగైదు రోజులకొక సారి తోడేళ్లు కొత్త గ్రామంపై దాడి చేస్తున్నాయి. దీంతో వాటి దాడులను అంచనా వేయడం సవాలుగా మారుతోంది. పరిస్థితిపై ఇప్పటికే ప్రజలకు సమాచారమిచ్చాం. రాత్రివేళల్లో తలుపులన్నీ మూసివేసి ఇంట్లోనే నిద్రపోవాలని సూచించాం. డ్రోన్లతో తోడేళ్ల కదలికలను తెలుసుకుంటున్నాం అని వివరించారు.

# సరసమైన వడ్డీ రేట్లలో రుణాలు

*శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్‌లో"జిత్నే సమయ్ కా లోన్ ఉత్నే కా హై బయాజ్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా తన శాఖల్లో మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేసి గోల్డ్ లోన్ శాఖలుగా మార్చడానికి పెట్టుబడి పెడుతుంది. సరసమైన వడ్డీ రేట్లలో రుణాలు అందించబడతాయి*

**తిరుపతి, సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ రాబోయే పండుగ సీజన్‌కు ముందు కస్టమర్లకు సులభంగా మరియు సౌకర్యవంతంగా నిధులను అందజేసే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌లో 'జిత్నే సమయ్ కా లోన్ ఉత్నే కా హి బయాజ్' కార్యక్రమాన్ని ప్రారంభించింది.శ్రీరామ్ ఫైనాన్స్, ఈ కార్యక్రమానికి మద్దతుగా, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా తన శాఖల్లో మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేసి గోల్డ్ లోన్ శాఖలుగా మార్చడానికి పెట్టుబడి పెడుతుంది. ప్రస్తుతం, ఆంధ్రప్రదేశ్‌లోని 304 శాఖల్లో 184 శాఖలు గోల్డ్ లోన్‌లను అందిస్తున్నాయి.

25 నాటికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొత్తం 22,198.21 కోట్లు అందులో 1,273.26 కోట్లు గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో నుండి వచ్చాయి.ఈ కొత్త ప్రచారాన్ని ఉద్దేశించి, ఎలిజబెత్ వెంకటరామన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ - మార్కెటింగ్, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఇలా వ్యాఖ్యానించారు, "కస్టమర్‌లతో మా పరస్పర చర్యల ద్వారా, కస్టమర్‌లు తమ విభిన్న ఆర్థిక అవసరాల కోసం గోల్డ్ లోన్‌లను సాధారణ క్రెడిట్ రూపంలో ఉపయోగించడాన్ని మేము గమనించాము,

అవసరాన్ని బట్టి బంగారాన్ని తాకట్టు పెట్టడం మరియు రీడీమ్ చేయడం వంటివి జరుగుతున్నాయి. ఈ ఫీచర్ చాలా కీలకమైనది, ముఖ్యంగా హాలిడే సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ఇది చాలా సహాయకారిగా ఉంటుంది."గోల్డ్ లోన్‌ల కోసం దరఖాస్తు చేసుకునే కస్టమర్‌లు 'జిత్నే సమయ్ కా లోన్ ఉత్నే కా హి బయాజ్' కార్యక్రమం కింద ఏడు (07) రోజుల కనీస కాలవ్యవధితో, లోన్ కాల వ్యవధికి మాత్రమే వడ్డీని చెల్లించే సామర్థ్యం నుండి ప్రయోజనం పొందుతారు. ఈ గోల్డ్ లోన్‌లు సరసమైన వడ్డీ రేట్లతో గరిష్టంగా 12 నెలల కాలవ్యవధిని అందిస్తాయి.శ్రీరామ్ ఫైనాన్స్, 'జిత్నే సమయ్ కా లోన్ ఉత్నే కా హి బయాజ్' కార్యక్రమాన్నిప్రోత్సహించడంలో భాగంగా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ మరియు మహారాష్ట్ర అంతటా డిజిటల్ ఛానెల్‌లు మరియు సినిమా హాళ్లను కవర్ చేస్తూ సమగ్ర బహుభాషా ప్రకటనల ప్రచారాన్ని ప్రారంభించింది.

# వరద బాధితులకు ఆపన్నహస్తం అందించిన పశ్చిమగోదావరి జిల్లా

# కలెక్టర్ చదలవాడ నాగరాణి చొరవతో కదిలిన వ్యధాన్యులు

## 1,98,960 ఆహార పొట్లాలు, 70 వేల వాటర్ ప్యాకెట్లు, 1.15 లక్షల బిస్కెట్ ప్యాకెట్లు





**భీమవరం, సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** విజయవాడ ప్రాంతవాసులు అకాల వరదలలో చిక్కుకోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు ఆదేశాల మేరకు పశ్చిమగోదావరి జిల్లా నుండి వారికి పెద్ద ఎత్తున ఆపన్న హస్తం అందింది. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చొరవతో దాతలు తమదైన శైలిలో ముందడుగు వేసారు. కలెక్టర్ కోరిందే తడవుగా పలువురు ముందుకు వచ్చి తమ వ్యధాన్యతను చాటుకున్నారు. వరద సహాయ చర్యల్లో భాగంగా జిల్లా నుండి 1,98,960 ఆహార పొట్లాలు, 70 వేల వాటర్ ప్యాకెట్లు, ఐదు వేల అర లీటర్ నీటి సీసాలు, 1,15,100 బిస్కెట్ ప్యాకెట్స్, 14 వేల రొట్టెలు, 22 వేల రస్కుల ప్యాకెట్స్ విజయవాడ చేరాయి. వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారవేత్తలు, సంఘాలు, విద్యాసంస్థలు, పారిశ్రామిక సంస్థలు, ఆహార ప్రాసెసింగ్ కంపెనీలు సహకారంతో గత రెండు రోజులుగా వీటిని విజయవాడకు ప్రత్యేక వాహనాల ద్వారా పంపామని ఈ సందర్భంగా చదలవాడ నాగరాణి తెలిపారు. పకృతి వైపరీత్యాల సమయంలో ఆపన్న హస్తం అందించడానికి ముందుకు వచ్చిన జిల్లా వాసులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.తొలిరోజు (సోమవారం) 85,500 ఆహార పొట్లాలు, 45 వేలు వాటర్ ప్యాకెట్లు, 5 వేల అర లీటర్ వాటర్ బాటిల్స్, 1,14,500 బిస్కెట్ ప్యాకెట్లను భారతీయ విద్యా భవన్, గోదావరి విద్య వికాస్, చైతన్య సొసైటీ, నరసాపురం స్వర్ణాంధ్ర కాలేజ్, తాడేపల్లిగూడెం రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ఉద్యానవన యూనివర్సిటీ, నిట్ యూనివర్సిటీ, వాసవి ఇంజనీరింగ్ కాలేజ్, శశి ఇంజనీరింగ్ కాలేజ్, భీమవరం విష్ణు కాలేజిల సహాయ సహకారాలతో సమకూర్చామన్నారు. మంగళవారం 1.15 లక్షల ఆహార పొట్లాలు తయారు చేయించి విజయవాడ పంపగా, వీటితోపాటు రస్క్ లు 22 వేలు, బన్స్ 14 వేలు, 600 బిస్కెట్ ప్యాకెట్ లు, 25 వేలు వాటర్ ప్యాకెట్స్ పంపడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో వెస్ట్ గోదావరి రైస్ మిల్లర్స్ అసోసియేషన్, భీమవరం ప్రాన్ ఎక్స్పోర్ట్ అసోసియేషన్, చైతన్య గోదావరి విద్యా వికాసం, తౌడు కొట్టు సుబ్బరాజు, తిరుమల కాలేజీ, సంధ్యా మెరైన్స్, దేవాదాయ శాఖ, ఎఫ్ ఎఫ్ టి ఫుడ్ ఫ్యాక్ట్ కంపెనీ, తాడేపల్లిగూడెం శశి కాలేజ్ గ్రూపు, భీమవరం విష్ణు కాలేజీ, తాడేపల్లిగూడెం ఎన్ కే గ్రూప్ నంద్యాల కృష్ణమూర్తి, ఆకివీడు చాంబర్ ఆఫ్ కామర్స్, హాట్ లైన్స్ బాబు, కాస్మోకల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్, జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం, తాడేపల్లిగూడెం ఎన్ కే మెరైన్స్, తణుకు ఆంధ్ర షుగర్స్, ఇరగవరం వన్ బెర్రీ ఫార్మా, ఫ్లట్స్ ఇండస్ట్రీస్, లయన్ కృష్ణంరాజు, తౌడు కొట్టు సుబ్బారావు తదితరులు ఆహార పొట్లాలను అందజేయడంలో తమ ఉదారత చాటారని నాగరాణి తెలిపారు. ముఖ్యమంత్రి పిలుపుకు స్పందించి వరద బాధితులకు అదుకోవటంలో జిల్లా వాసులు ముందుండటం ఆనందాన్ని కలిగిస్తుందని, సిఎం ఆదేశాల మేరకు తమ వంతు సాయం చేయటానికి ఎప్పుడు సిద్దంగా ఉంటామని జిల్లా ప్రజలు తెలిపారని నాగరాణి వివరించారు.



ఆహారాన్ని తీసుకెళుతున్న బాలు

## వరద బాధితులకు ఆహారాన్ని పంపిణి చేసిన క్రికెట్ కోచ్

**పటమట, సెప్టెంబర్ 3(ఆంధ్రపత్రిక) :** భారీ వర్షాలు వరదల వలన గత మూడు రోజులుగా అనేక ప్రాంతాల్లో ఆహారం లభించక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో తన వంతు సహాయంగా మంగళవారం సింగినగర్ ఏరియాలో వరద బాధితులకు ఆహారాన్ని పంపిణి చేసిన సిద్ధార్ధ పబ్లిక్ స్కూల్ క్రికెట్ కోచ్ భీమారావు (బాలు).

## బొల్లిముంత శివరామకృష్ణ స్మారక ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైన శ్రీనివాస రెడ్డి






**పెదకూరపాడు, సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డికి బొల్లిముంత శివరామకృష్ణ స్మారక ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం ఇస్తున్నట్లు బొల్లిముంత ఫౌండేషన్ నిర్వాహకులు మంగళవారం తెలియజేశారు. గత 28 సంవత్సరాలుగా ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయులగా విద్యారంగంలో చేస్తున్న కృషికి మరియు వ్యాసరచన ద్వారా తెలుగు భాషకు చేస్తున్న సేవలకు గాను ఈ పురస్కారాన్ని శ్రీనివాస రెడ్డికి ఇస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తెనాలిలో జరిగే ఒక కార్యక్రమంలో వివిధ రంగాల్లోని ప్రముఖ వ్యక్తులు పాల్గొని పురస్కారాలాను ప్రదానం చేస్తారు. ఉపాధ్యాయుడిగా,రంగస్థల నటుడిగా, ఉద్యమకారుడిగా, కమ్యూనిస్టు కార్యకర్తగా,రాజకీయ నాయకుడిగా,రచయితగా, సంపాదకుడిగా,సినీ రచయితగా విభిన్న భూమికలు నిర్వహించి అన్నిటా తమదైన ముద్ర వేశిన మహనీయుడు బొల్లిముంత శివరామకృష్ణ పేరిట ఇస్తున్న ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి తాను ఎంపిక కావడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ పురస్కారానికి ఎంపికైన శ్రీనివాస రెడ్డిని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయులు సంఘం గుంటూరు,పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎ.తిరుమలేష్,అర్. శ్రీనివాస రెడ్డి,ఎస్.ఎంసి చైర్మన్ జి.పున్నారావు, పాఠశాల ఉపాధ్యాయులు,ప్రముఖ విద్యావేత్త బి.శివరామయ్య, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

## నూజివీడు పట్టణ ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి




**నూజివీడు, సెప్టెంబర్ 3, (ఆంధ్రపత్రిక) :** ఈనెల ఏడవ తారీకి న శ్రీ వినాయక చవితి సందర్భంగా పట్టణ ప్రజలు అందరూ ఆనందంతో సంతోషంగా పండగ జరుపుకోవాలని అలాగే ఎక్కడైనా వినాయకుడు మండపాలు ఏర్పాటుచేసిన ముందుగా పోలీసువారి యొక్క అనుమతి తీసుకోవాలి మీరు పోలీసు వారి దగ్గరికి వస్తే మీకు ఆన్లైన్లో ఏ విధంగా అప్లై చేయాలి అనేది మేము మీకు చెబుతాము తరువాత ఎలక్ట్రికల్ మరియు ఫైర్ వారి యొక్క పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలి ఆ తరువాత మాత్రమే మీరు మండపాలు ఏర్పాటు చేసుకోవాలి ఎవరు కూడా నిబంధనలను అధిక్రమించవద్దని కోరుచున్నాము.

## రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార 05-09-2024 నిర్వహించ వలసిన కార్యక్రమం తాత్కాలిక వాయిదా

**విజయవాడ, సెప్టెంబర్ 3(ఆంధ్రపత్రిక) :**సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవం05-09-2024 మంగళగిరిలో చేయుటకు ఏర్పాట్లు చేయడం జరిగింది. కానీ వాతావరణం అనుకూలించని కారణంగా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు, మంత్రులు, రాష్ట్ర మరియు జిల్లా స్థాయి అధికారులందరూ వివిధ జిల్లాల్లో వచ్చిన వరద బాధితుల సహాయ కార్యక్రమాలలో పాల్గొనడం మరియు పురస్కార గ్రహీతల రవాణా ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర స్థాయిలో నిర్వహిం చాల్సిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం వాయిదా వేయడం జరిగిందని డైరెక్టర్ వి.విజయరామరాజు, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలియజేశారు. మళ్ళీ ఎప్పుడు నిర్వహించేది పత్రికాముఖంగా తెలియజేస్తామని తెలపడం జరిగింది

## ముంపు భాదితల కోసం అహర్నిశ సేవలు

**విజయవాడ, సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** విజయవాడ ముంపు భాదితల కోసం అహర్నిశ సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి. వార్డుల వారీగా మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారులు నిమగ్నం. విపత్తుల సంస్థలోని కంట్రోల్ రూమ్ నుంచి 24 గంటలు 8 మంది ఐఏఎస్ అధికారులు నిరంతర పర్యవేక్షణ. వరద ముంపు ప్రాంతాల్లో శరవేగంగా ప్రభుత్వ సహాయక చర్యలు . 6 హెలికాప్టర్లు, డ్రోన్స్ ద్వారా ఆహారం,నీరు, పాలు, పండ్లు, బిస్కెట్స్, మెడిసిన్ పంపిణీ. ప్రాధమిక అవసరాలు అందించడానికి అగ్ర ప్రాధాన్యత. సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం నిమగ్నం. 43417 మందిని పునరావాస కేంద్రాలకు తరలింపు. 197 వైద్యశిబిరాలను ఏర్పాటు. చర్యల్లో 48 బృందాలు నిర్విరామ సేవలు

## వరద బాధితుల సహాయంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు



**విజయవాడ, సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సుమారు 500 మంది వివిధ ప్రాంతాలలో అజిత్ సింగ్ నగర్, రాజరాజేశ్వరి కాలనీ, కృష్ణలంక ప్రాంతాలలో ఆహారం, నీరు, పాలు మొదలగు సేవలను గత రెండు రోజుల నుంచి అందిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధార్థ కళాశాల, నలంద కళాశాల, కేబీఎన్ కళాశాల, ఫార్మసీ కళాశాల మేరీ స్టెల్లా కళాశాల కు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవలు అందిస్తున్నారని తెలిపారు.

# రెవరెండ్ ఫాదర్ ఐ ఎం స్వామినాథం ఇక లేరు...





**బంటుమిల్లి సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** విజయవాడ మే త్రాసనం మచిలీపట్నం విచారణలో ఫాదర్గా సేవలందిస్తున్న ఈ మంది, మరియ స్వామి నాదం సోమ వారం ఉదయం గుండె పోటుతో మరణించారు. మే త్రాసనంలోని బంటు మిల్లి, గుడివాడ, మైలవ రం, జగ్గయ్యపేట, విజ యవాడ తదితర విచారణ లతో పాటు మచిలీపట్నం విచారణలో ఆయన దేవుని సేవ చేశారు. గురుత్వ జీవితంలో ఆయనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నరు అనడంలో అతిశయోక్తి లేదు. బంటుమిల్లి విచారణలోనే( ఆర్.సి.యం) తొమ్మిది సంవత్సరాల పాటు ఆయన దేవుని సేవ చేసి సంఘాల బలోపేతానికి కృషి చేయడంతో పాటు విశ్వాసుల భక్తిశ్రద్ధలను అలవర్చుకోవడంలోనూ ఆయన చేసిన దేవుని సేవ మరువలేనిది.అలాంటి మహోన్నత వ్యక్తి అయిన ఫాదర్ ఇమ్మంది మరియా స్వామినాథం మరణించారన్న వార్త విశ్వాసులు జీర్ణించుకోలేకపోతున్నారు యావత్ కతోలిక శ్రీ సభ తరపున ఆర్.సి.యం ఫాదర్స్ సిస్టర్స్ విశ్వాసులు తరఫున శ్రద్ధాంజలి ఘటిస్తు ప్రత్యేకమైన దివ్యబలి పూజల ద్వారా నివాళులర్పించారు.

## ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ వెయ్యి శాఖ ప్రారంభం




**తిరుపతి, సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** భ్రారతదేశపు బ్యాంకేతర ఆర్థిక రంగం (ఎన్‌బిఎఫ్‌సి)లోప్రముఖసంస్థ అయినఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ వాషి, నవీ ముంబైలో తమ 1000 వ శాఖను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. ల్యాండ్‌మార్క్ వంటి ఈ సంఘటనవలన దేశంలో తమ ప్రాభవాన్ని విస్తరించడం, వ్యాప్తి తక్కువగా ఉన్న మార్కెట్లకు కూడా ఆర్థిక సేవలను అందించాలన్న దృఢనిశ్చయాన్ని కి గుర్తుగా ఒక ప్రత్యేక కవర్ ని, మై స్టాంప్ ని విడుదల చేయడానికి ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ ఇండియా పోస్ట్ తో చేతులు కలిపిందనీ ఆ సంస్థ ఏపీ ప్రతినిధి చెప్పారు. ఈ అధికారిక విడుదల ఉత్సవ సభను, ముంబై లోని జపాన్ కాన్సలేట్ జనరల్ నుండి కాన్సుల్ జనరల్ యాగి కోజి, మహారాష్ట సర్కిల్ తపాలా సేవల (హెచ్‌క్యూ) నిర్దేశకులు అభిజిత్ బన్సోడేలతోబాటు, ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ ఎమ్ డి శాంతను మిత్రా పాల్గొన్నారు. 1000 వ శాఖను ప్రారంభించడం, అతి పెద్దదైన, వైవిధ్యభరితమైన భారతీయ మార్కెట్లో లోతుగా విస్తరించడం పట్లఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ యొక్క వ్యూహాత్మక దృష్టికోణానికి చిహ్నంగా నిలిచిందన్నారు. 2007 లో ప్రారంభమైనప్పటినుండి, అభివృద్ధిపథంలో ఏకరీతిన ముందడుగు వేస్తున్న ఈ కంపెనీ, ప్రస్తుతం 670 పట్టణాలలోనూ, 70,000 గ్రామాల్లోనూ 23,000 మంది ఉద్యోగుల కార్మికశక్తి తోడ్పాటుతో పని చేస్తోందన్నారు. గడచిన రెండేళ్లలో, ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ దాదాపు 300 శాఖలను ప్రారంభించిందని, వీటిలో గణనీయంగా 95 శాతం శాఖలు రెండో శ్రేణి పట్టణాలు, అర్ధ-గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు అయ్యాయన్నారు. ఇలా వ్యాపించడం, భారతదేశపు వైవిధ్యభరితమైన ప్రజానీకానికి క్రెడిట్ ప్రాప్తిని అందుబాటులోకి తేవాలని, వారు ఆర్థికంగాస్వతంత్రులయ్యేలా సశక్తీకరించాలన్న లక్ష్యం అని చెప్పారు.

## వరదబాధితులకు లారీ ఓనర్స్ 10వేల ఆహార పొట్లాలు






**విజయవాడ, సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** విజయ వాడకి చెందిన ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసి యేషన్, ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో ఆపరేటివ్ స్టో ర్స్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ లోని వరదబా ధితులకు 10 వేల బిర్యానీ ఆహారపొ ట్లాలను రెడ్ క్రాస్ ఆఫీసుకు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ నాగుమోతు రాజా, కార్యదర్శి రావి శరత్ బాబు, స్టోర్స్ చైర్మన్ శ్రీ కోనేరు వెంకట రమేష్, కార్యదర్శి కె. జగదీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై వి ఈశ్వరరావు మంగళవారం ఉదయం అందచేశారు. ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రతిసారి తమ సంఘాలు మానవతా దృక్పథంతో ప్రజలకు సాయం చేస్తూ వచ్చాయని, గతంలో హుద్ హుద్ తుపాను సమయంలో విశాఖకు పెద్ద ఎత్తున కూరగాయలు పంపించామని వారు తెలియజేశారు. మరోవైపు రోగులకు, వృద్ధులకు, విద్యార్థులకు కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ ఫౌండేషన్ ద్వారా అవసరమైన సా యం అందిస్తున్నామని అధ్యక్షులు రావి గోపాలరావు, కార్యదర్శి వత్సవాయి కృష్ణంరాజు తెలిపారు.

# విజయవాడ వరద బాధితులకు ఎక్సైజ్ శాఖ అండ..!



**విజయవాడ, సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు మరియు ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీ ముఖేష్ కుమార్ మీనా, ఐఏఎస్ గారి సూచనల మేరకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మధ్య నిషేధ మరియు అబ్కారీ శాఖ కమిషనర్ శ్రీ నిశాంత్ కుమార్, ఐఏఎస్ గారు గత రెండు రోజులుగా విజయవాడ 40 మరియు 42 డివిజన్లలోని భవానిపురం, స్వాతి థియేటర్ రోడ్డు మరియు పున్నమి ఘాట్ పరిసర ప్రాంతాలలోని వరద బాధితులను ఆదుకోవడానికి ప్రత్యేక సహాయ బృందాలను ఏర్పాటు చేసి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారి క్షేమ సమాచారంను ఎప్పటికప్పుడు సచివాలయ సిబ్బందితొ సమన్వయం చేసుకొని వారికి కావాల్సినటువంటి అన్ని సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటివరకు పదివేల ఆహార పొట్లాలను, పదివేల మంచినీటి బాటిల్లను మరియు పాలు, మజ్జిగను బాధితులకు ఎక్సైజ్ శాఖ సిబ్బంది సహాయంతో అందజేయడం జరిగింది. నిశాంత్ కుమార్ ఐఏఎస్ గారు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి కావలసిన వాహనాలను, ఎక్సైజ్ సిబ్బందిని సమకూర్చి తగు సూచనలను, సలహాలను ఇచ్చి, ప్రత్యేక బృందాల పనితీరును దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.



### మానవత్వం చాటుకున్న గోరంట్ల రవికుమార్

## 2000 మంద వరద బాధితులకు ఆహార పొట్లాలు అందజేత



**దర్శి సెప్టెంబర్ 3 (ఆంధ్ర పత్రిక):**తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, శ్రీ హర్షిణి కళాశాలల అధినేత గోరంట్ల రవికుమార్ మానవత్వం చాటుకున్నారు. విజయవాడ లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు కారణంగా నిరాశ్రయులైన వరద బాధితులకు భోజన సదుపాయం కల్పించారు. ఒంగోలులోని శ్రీ హర్షిణి విధ్యా సంస్థల నుండి 2000 మంది వరద బాధితులకు సరిపడా ఆహార పొట్లాలును, మంచినీటి బాటిల్లను విజయవాడ పంపించారు. వరద బాధితులకు మా అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అవిరళ కృషి చూసి మా వంతుగా వరద బాధితులకు సహకారం అందిస్తున్నామని ఈ సందర్భంగా గోరంట్ల రవికుమార్ తెలిపారు.

### ఘనంగా వీరభద్ర స్వామి

## జయంతి వేడుకలు



**చౌడేపల్లి,సెప్టెంబర్ 3(ఆంధ్రపత్రిక):** స్థానిక మృత్యుంజయశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని వీరభద్ర స్వామి ఆలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమారస్వామి, మహేష్ ల ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామివారికి విశేష అభిషేకము, అలంకరణ గావించారు. వీరభద్ర స్వామి, జయంతిని పురస్కరించుకొని ఆలయంలో పలు కార్యక్రమాలు జరిగాయి. జమీందారు వంశీయుడు రాజా రమేష్ రాయల్, డాక్టర్ శివకుమార్, టానాధార్ నాగరాజు, మఠం శివయ్య, తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు.

### ప్రభుత్వ వైద్యులపై అవినీతి ఆరోపణలు

## విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు




**దర్శి సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక)** దర్శి ప్రభుత్వ వైద్యశాలలో అవినీతి జరుగుతుందని ఉన్నతాధికారులకు ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదుతో ఇద్దరు డాక్టర్లపై ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయం నుండి ఎంక్వయిరీ మొదలైంది. ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయం నుండి జిల్లా అధికారులకు సమాచారం రాగా ఎంక్వైరీ నిమిత్తం మార్కాపురం కు చెందిన డాక్టర్ సుబ్బారెడ్డిని ఎంక్వైరీ అధికారిగా నియమించారు. దర్శి ప్రభుత్వ వైద్యశాలకు డాక్టర్ సుబ్బారెడ్డి ఎంక్వయిరీ నిమిత్తం సోమవారం వచ్చారు. వైద్యశాలలో గల కొందరు రోగులను అడిగి విషయం తెలుసుకున్నట్లు డాక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. హాస్పిటల్ రోగుల వద్ద తీసుకున్న రిపోర్టును ఉన్నతాధికారులకు పంపిస్తామని, ఆరోపణలు రుజువైతే వైద్యులపై ప్రభుత్వ చర్యలు తప్పవన్నారు. పోస్టుమార్టం, ఎమ్మెల్సీ సర్టిఫికేట్, సదరం సర్టిఫికెట్ లలో అవినీతి జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు విచారణ చేపట్టినట్లు విచారణ అధికారి డాక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు.

### ఆర్.ఎం.పి పి.ఎం.పి క్లినిక్లను

## ఆకస్మిక తనిఖీ చేసిన వైద్యాధికారులు



**చౌడేపల్లి,సెప్టెంబర్ 3(ఆంధ్రపత్రిక):** పట్టణంలోని ఆర్.ఎం.పి పి.ఎం.పి క్లినిక్లను వైద్యాధికారులు డాక్టర్ పూజ, డాక్టర్ నవీన్, లు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లినిక్ లలో ప్రైవేటు వైద్యం చేయరాదన్నారు. కేవలం ప్రధమ చికిత్సలయంగా మాత్రమే క్లినిక్లను నడుపుకోవాలని. జ్వరాలు వంటి జబ్బులతో వచ్చిన రోగులను ప్రభుత్వ ఆసుపత్రికి సిఫారస్సు చేయాలన్నారు. కనీసం సూది మందు వేసే అధికారం ప్రైవేటు ఆర్.ఎం.పి పి.ఎం.పి క్లినిక్ లలో లేదని అన్నారు. చట్టాన్ని ఎవరైనా అధికమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా వైద్యాధికారులు చేసిన తనిఖీల్లో పలువురు పలు ధ్రువీకరణ పత్రాలు లేని విషయాన్ని గుర్తించారు. ఈ కార్యక్రమంలో చౌడేపల్లి ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి సాకరించండి : ఎమ్మెల్యే బివి



**ఎమ్మిగనూరు. సెప్టెంబర్ 3 (ఆంధ్ర పత్రిక)** మీరు తెచ్చిన ప్రాజెక్టును మేము చెప్పుకోలేదు మేము పుట్టించిన పిల్లలకు పేర్లు పెట్టుకొనే పరిస్థితి తప్పుడు వార్తలను వైసిపి కే చెల్లుబాటుని ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఛాంబర్ లో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బివి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో చేనేతలకు అండగా ఉంటామని అరకొరగా 100 యూనిట్లు జీఓను అమలు కాకా నట్టేట ముంచారు. కూటమి ప్రభుత్వం చేనేతలకు చెప్పిన ప్రకారం సబ్సిడీ కింద 100 యూనిట్లు జీఓను అమలు అయింది. చేనేత వినియోగదారులు 10400 మంది వున్నారు. లబ్దిదారులు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంకా ఎక్కువ మంది వున్నట్లుతై వారందరికీ సబ్సిడీ అవకాశం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వం బిసిల పక్షపాతి నాయ బ్రాహ్మణ. దోబీ. రజకులు. ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ బ్లాక్ వర్డ్ మొత్తం కూడ సబ్సిడీ లభిస్తుంది. కూటమి ప్రభుత్వం ద్వారా 100 యూనిట్లు ఇచ్చేందుకు ముందుకు తీసుకుపోతామన్నారు. నా తండ్రి కల సాకారం తాగడానికి మంచినీరు ఇంటింటికీ కొళాయి కాకుండా 24 గంటలు నీళ్లు ఇచ్చేందుకు ప్రారంభం కానున్నదన్నారు. 2024 - 18 సంవత్సరంలో ఎమ్మెల్యేగా వున్న సమయంలో మంజూరైన సంగతి తెలిసిందే. ఏఐబి 146 కోట్ల ప్రాజెక్టు ను మంజూరు చేస్తే ప్రజలు వైసిపి అధికారంలోకి వస్తే టిడిపి హయాంలో తెచ్చిన ప్రాజెక్టుని సిగ్గులేకుండా మేము తెచ్చామని చెప్పు కొనే పరిస్థితి దిగజారారు. వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్న సాక్షి దినపత్రిక. సాక్షి చానెల్ అడ్డుపెట్టుకొని వున్నది లేనట్లు. లేనిదివున్నట్లు తప్పుడు రాతలు వ్రాస్తున్నారన్నారు. ఇప్పటికే ప్రజలు చీకొట్టి 151 ఎమ్మెల్యే ల నుంచి 11 ఎమ్మెల్యే లకు ఇచ్చిన బుద్ధి రాలేదన్నారు. వైసీపీ అధికారం వున్నా ప్రాజెక్టు ను సర్వ నాశనం చేశారు. రివర్స్ టెండర్లు పేరుతో పనులు నిలిపివేయడం జరిగింది.

కేవలం ట్యాంకులు పట్టణంలో దిష్టిబొమ్మలాగా పట్టణంలో మంచినీటి ఇబ్బంది పడుతున్నా అవసరతకు ప్రాజెక్టు లో అవినీతి దందా చేసుకొనేందుకు గాజుల దిన్నే ప్రాజెక్టు దగ్గర ఒక అడుగు ఎత్తు పెంచి పట్టణ మంచినీటి అవసరాలకు వాడుకొన్నారు తప్పా తెచ్చిన ప్రాజెక్టును నిర్వీర్యం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. మంత్రి నారాయణ. కేంద్ర ప్రభుత్వం సాకారం తో ఎమ్మెల్యే గా మళ్లీ ఆ ప్రాజెక్టును సంజీవంగా ఏఐబి ద్వారా ప్రాణం పోసి పనులు ప్రారంభిస్తున్నామన్నారు.

# మంత్రి పార్ధసారధి పిలుపుతో విజయవాడకు 3 వేల మందికి ఆహార పొట్లాలు

**నూజివీడు, సెప్టెంబర్, 3(ఆంధ్రపత్రిక )**రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పిలుపుతో స్థానిక నాయకులు నూజివీడు నుండి 3 వేల ఆహార పొట్లాలను విజయవాడ నగరంలో వరద బాధితులకు పంపిణీ నిమిత్తం పంపించారు. విజయవాడలో ప్రకృతి సృష్టించిన విలయంనకు స్పందించిన మంత్రి పార్థసారథి తన స్వంత నగదుతో 3 వేల మందికి అల్పాహారాన్ని సోమవారం పంపించారు. మంత్రి అందించిన స్ఫూర్తితో నూజివీడు పట్టణానికి చెందిన నాయకులు పి, శ్రీకాంత్. పి, చిన్నారి. వై, బాబి. వై, చిన్ని. ఎమ్, రమేష్.తదితరులు కలసి సొంత ఖర్చుతో 2 వేల మంది వరద బాధితులకు సరిపడ భోజన పేకెట్స్ ను నూజివీడు నుండి విజయవాడ సింగ్ నగర్, సత్యన్నారాయణ పురం వరద బాధితులకు పంపిణీ చేసేందుకు పంపించారు. అదేవిధంగా నూజివీడు మండలం చనుబండ గ్రామానికి చెందిన కొందరు ప్రముఖులు వెయ్యి ఆహార పొట్లాలను బాధితులకు పంపిణీ చేసేందుకు విజయవాడకు వాహనంలో పంపించారు. ఆపద సమయంలో తోటివారిని ఆదుకోవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని,



ప్రజలు, నాయకులు వచ్చి వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్చందంగా ముందుకు రావాలని మంత్రి పార్థసారథి విజ్ఞప్తి చేశారు

# వరద బాధితులకు అండగా నిలిచిన మాజీ ఏఎంసీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి (నాని )



**కలిదిండి, సెప్టెంబర్ 3( ఆంధ్ర పత్రిక )** కలిదిండి మండలం పడమటి పాలెం పంచాయితీ పరిధిలోని బంక్ కాలనీ కురుస్తున్న వర్షాలకు ముంపు గురైంది. దీంతో కలిదిండి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వల్లభనేనిశ్రీనివాస్ చౌదరి (నాని )స్పందించి ఇళ్లల్లోకి చేరిన వర్షపానీటిని బయటకు తరలించడానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అనంతరం పునరావాసంగా 35 కుటుంబాలకు నాలుగు క్వింటాల బియ్యం, నిత్యవసర వస్తువులు వల్లభనేని శ్రీనివాస్ చౌదరి(నాని )ఆర్థిక సాయంతో మంగళవారం బాధితులకు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు సుధాబత్తుల నరసింహారావుగారు చిట్టూరి అర్జున్ రావు , పరస రాజేష్ ,బాదిన రజనీ, పాము చిన్న ముసలయ్య , గోపాలపురం మాజీ సర్పంచ్ వాకాని కోటేశ్వరావు . ఎస్సీ సెల్ అధ్యక్షులు కూరెళ్ల ఏడుకొండలు , జనసేన నాయకులు కోలా శ్రీకాంత్, కరేటి కృష్ణారావు పాల్గొన్నారు.

# సమస్యాత్మక ప్రాంతాల్లో ఆరోగ్య వైద్య శిబిరాలు ఏర్పాటు

**చౌడేపల్లి,సెప్టెంబర్03(ఆంధ్రపత్రిక):** పట్టణంలోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చౌడేపల్లి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని పూజ, ఆధ్వర్యంలో నేతాజీ నగర్, బజారు వీధి, శివాలయం వీధి, పుల్లూరుపాలెం, తదితర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం ప్రబలుతున్న విష జ్వరాలు కాలానుగున వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడే అంటువ్యాధులు చేరమన్నారు. దోమల వల్ల వచ్చే వ్యాధులు దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పలుచోట్ల దోమల నిర్మూలన మందులు పిచికారి చేయించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే పాటించాలని ప్రజలకు తెలియజేశారు. ఇళ్ల వద్ద నీరు నిలవ లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎస్ బాబుదిన్, ఏఎన్ఎంలు, రుక్మిణి, లత, ఎంఎల్ హెచ్పి మమత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# తగ్గువారిపల్లి తక్కన్నకుంట సుందరీకరిస్తాం

## విలేకరుల సమావేశంలో తహశీల్దార్ స్పష్టం



**బంగారుపాళ్యం- సెప్టెంబర్ 3(ఆంధ్రపత్రిక)..**చిత్తూరు జిల్లా,బంగారు పాల్యం మండలం తగ్గువారిపల్లి చెందిన తక్కన్నగుంటను త్వరలోనే సుందరీకరణ పనులు చేపట్టనున్నామని మంగళవారం తాసిల్దార్ కార్యాలయంలో పత్రికా సమావేశంలో మండల తాసిల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే చొరవతో మండల కేంద్రంలోని తక్కన్నకుంటకు మోక్షం లభించిందని అన్నారు. మంగళవారం తాసిల్దార్ కుంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఎమ్మెల్యే, నాయకులు,దాతల సహకారంతో కుంటను సుందరీకరణలో భాగంగా వాకింగ్ ట్రాక్, బెంచీలు, బోటింగ్ , చెట్లు నాటే కార్యక్రమం, టైల్స్ ఏర్పాటు మొదలగు పనులు చేస్తామన్నారు.కుంటను ఎవరు కూడా ఆక్రమించరాదని ఆయన విజ్ఞప్తి చేశారు. మండల అభివృద్ధికి ప్రజలు నాయకులు అందరూ సహకరించి అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.మన బంగారుపాల్యం మన అభివృద్ధి అనే నినాదంతో ముందుకు వెళ్లాలని దీనికి ప్రతి ఒక్కరూ సహకరించవలసిందిగా కోరారు. అభివృద్ధి పనులకు దాతలు ముందుకు వస్తే నాయకులు సహకారంతో ఈకార్యక్రమాలన్నీ పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.ఇప్పటికే కుంట చుట్టూ సర్వే పూర్తి స్థాయిలో చేయించి ట్రెంచ్ వేయడం జరిగింది.

# డెంగ్యూ కేసులు పెరగకుండా చర్యలు తీసుకోండి

**బంగారుపాళ్యం- సెప్టెంబర్ 3(ఆంధ్రపత్రిక)...**చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లోహిత్ చంగల్ రాయల్ ఆధ్వర్యంలో మంగళవారం డెంగ్యూ పై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరిని డెంగ్యూ కేసులు పెరగకుండా తగినటువంటి చర్యలు దోమల నివారణ కార్యక్రమం చేపట్టాలని అందులో భాగంగా దోమను ఎలా అరికట్టాలి అనే విధానాలపై చర్చించారు.యాంటీ లార్వా ఆపరేషన్ ద్వారా లార్వాలను నిషేధించుట ఫాగింగ్ పైరిత్రం అను క్రిమి సంహారిక మందులను ఇంటి లోపల కొట్టడం ద్వారా దోమలు చనిపోయి డెంగ్యూ రావడానికి ఆస్కారం ఉండదని చెప్పారు.కార్యక్రమాలను ప్రతి సచివాలయం పరిధిలో ప్రతి సచివాలయం ఏఎన్ఎం ఆశాలకు సూపర్వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ యొక్క నెలలో ప్రతి సెంటర్ లో జీరో కేసు రావాలని దానికి మెడికల్ ఆఫీసర్ చెప్పిన విధంగా ఫాలో అయితే కచ్చితంగా జీరో కేసు వస్తుందని చెప్పడం జరిగింది.అంతేకాకుండా ఎంఆర్ కేసుల టార్గెట్లు విషయంలో వాక్సినేషన్ పై సక్రమంగా వ్యాక్సినేషన్ జరపాలని గర్భవతులకు ఇచ్చేటువంటి సేవలను కచ్చితంగా అందించాలని ప్రతి ఒక్కరిని మోనిటర్ చేయాలని క్లోరినేషన్ ప్రతి ట్యాంకును ప్రతి పంచాయతీలో సెక్రటరీ ద్వారా ఏఎన్ఎం చేయించాలని చెప్పారు. వైద్య సిబ్బందికి సూచనలు సలహాలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్వో రమేష్ సూపర్వైజర్ అమ్ముదా సూపర్వైజర్ రమాదేవి



సూపర్వైజర్ హరికృష్ణ సూపర్వైజర్ డిపిఎమ్ఓ మనీ లెప్రసీ క్షయ వ్యాధులపై ఏఎన్ఎం లకు అవగాహన కల్పించారు.

# నాటు సారా విక్రేత అరెస్టు...

**యాదమరి, సెప్టెంబర్, 03 : (ఆంధ్రపత్రిక):**మండల పరిధిలోని అక్రమంగా నాటు సారా తయారు చేస్తూ విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు యాదమరి పోలీసులు తెలిపారు. యాదమరి ఎస్ఐ ఈశ్వర్ యాదవ్ కథనం మేరకు... మండల పరిధిలోని తెలరాళ్లపల్లి పంచాయితీ పావడదాసురు గ్రామానికి చెందిన పాత నేరస్థుడు విజయ్ కుమార్ (35) అక్రమంగా మద్యం సారా తయారు చేస్తూ విక్రయిస్తున్నాడన్న సమాచారం అందుకున్న ఎస్సై ఈశ్వర్ యాదవ్ సిబ్బంది మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేసి అతని వద్ద నుండి 20 లీటర్ల నాటు సారా, సుమారు 6,000 రూపాయల విలువగల అక్రమాన్ని మద్యం చేసుకుని స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఈశ్వర యాదవ్ మీడియాతో మాట్లాడుతూ మండల పరిధిలో అక్రమ మద్యం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వరద బాధితులకు 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించిన కాపు నాయకుడు కట్టెకోట హరీష్



**దర్శి సెప్టెంబర్ 3 (ఆంధ్ర పత్రిక)** విజయవాడ వరద బాధితులకు సహకారం అందించేందుకు దర్శి రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా దర్శి లో చేపట్టిన "ప్రజల సహాయార్థం మన వంతు సాయం చేద్దాం" కార్యక్రమానికి దర్శి ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుంది. వరద బాధితులకు సహకారం అందించేందుకు దర్శి ప్రజలు ముందుకు వస్తున్నారు. అందులో భాగంగా దర్శి నియోజకవర్గ కాపు నాయకుడు కట్టెకోట హరీష్ వరద బాధితులకు 50వేల రూపాయల ఆర్థిక సహకారం అందించారు. కట్టెకోట హరీష్ బాటలో దర్శి ప్రముఖులు కొందరు ముందుకు వచ్చి వారి వంతు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. అధిక మొత్తంలో ఆర్థిక సహకార అందించిన కట్టెకోట హరీష్ ను ప్రభుత్వ అధికారులతో పాటు దర్శి ప్రజలు అభినందిస్తున్నారు

### పేకాట రాయళ్లు అరెస్టు

## కేసు నమోదు

**సోమల. సెప్టెంబర్ 3 (ఆంధ్ర పత్రిక)** .సోమల మండలం కందూరు గ్రామ పరిధి లోని అటవీ ప్రాంతంలో రాబడిన సమాచారం మేరకు సోమల ఎస్.ఐ.శివ శంకర్ మరియు సిబ్బంది అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 10 మంది పేకాట ఆడుతూ పట్టుబడ్డారు.వారి వద్ద నుండి నగదు రూ.2400/-లను స్వాధీనం చేసుకొన్నారు. పట్టుబడిన పేకాట రాయళ్లు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ముంపునకు గురైన పోలాలకు

## సస్యరక్షణ సూచనలు



**నూజివీడు సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక)**నూజివీడు మండలంలోని మీర్జాపురం, మర్రిబంధం, గొల్లపల్లి, నూజివీడు, బోరవంచ రామన్న గూడెం గ్రామాలలో సాగు చేయుచున్న వరి, మినము, ప్రత్తి పంటలను మండల వ్యవసాయి అధికారిణి ఎ చాముండీశ్వరి సంబంధిత గ్రామాల విస్తరణ సిబ్బంది మరియు రైతులతో పరిశీలించారు. ముంపుకు గురైన పొలాలను పరిశీలించి పంట యొక్క పెరుగుదల దశ ఆధారంగా ఈ క్రింది విధంగ రైతులకు సూచనలు తెలిపారు. 1 వరి :- పిలకల దశ - ఎక్కువగా వున్న నారునుపాలం నుండి బయటకు వెడలుగొట్టి ఒక ఎకరాకు 20 kg యూరియ మరియు 20 kg పొటాష్ వేయివలను . ముంపునకు గురైన పొలాలకు బాక్టీరియ ఆకు ఎండు తెసలు మరియు పాడతెగులు వచ్చి అవకాశమున్నందున బావిస్టిన్ ం m-45 మందున 29/14 కలిపి పిచికారి చేయిలి. 2 మినుము : 15-25 రోజుల దగ్గలో ఉన్నందున చీలల్లో నరును కలువల ద్వార బయటకు పోద్రోలి 10g/14 మల్టీకె (ప్లాటాషియం నైట్రేట్) పిచికారి చేయాలి ఎకరాకు .

3. ప్రప్తి : 25-40 రోజుల దశ, శాఖీయిదశ నుండిపూత దెశ వరకు పైరు ఉన్నది కావున ఎకరాకు 20 %నెస్త్ర% యురియ మరియు ప్లాటాక్షి 10 కేజీ వేసుకోవాలి. మొక్క బాగా తడి చేటట్లుగా కాపర్ జాన్సీక్లోరైడ్ (బ్లైటాక్స్) 38/14 మరియు గ్నేషియం సల్ఫేట్ 10g/ఎల్ టి కలిపి (స్ప్రే చేసుకొని పంటలను కాపాడుకోవచ్చని సూచించారు.

### వరద బాధితులకు

## కొండంగి గ్రామం అపన్న హస్తం

**-మానవత్వం పరిమళించిన కొండంగి గ్రామం**

**-విజయవాడ వరద బాధితుల కోసం ఆహారం**

**-కొండంగి గ్రామ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో పులిహార, వాటర్ బాటిల్స్, పెరుగు, బిస్కెట్ ప్యాకెట్లు**



**కలిదిండి, సెప్టెంబర్ 3( ఆంధ్ర పత్రిక ):** పొరుగు ప్రాంతాలలో.... ప్రకృతి వైపరీత్యాల వల్ల వరదలు సంభవించినప్పుడు అక్కడ పరిస్థితులను చూసి ఆహార పదార్థాలు అందించడంలో ముందుగా స్పందించే గ్రామం కొండంగి గ్రామ ప్రజలు, కొండంగి గ్రామ సంక్షేమ సమితి. విజయవాడ వరద బాధితుల కోసం కలిదిండి మండలం, కొండంగి గ్రామ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో రెండు వ్యానులలో 2000 వేల మంది బాధితులకు పులిహోర ప్యాకెట్లు, పెరుగు, మంచినీరు బాటిల్స్, బిస్కెట్స్ ప్యాకెట్లు కిట్లును రెండు వ్యానులలో కలిదిండి తాసిల్దార్ కార్యాలయం వద్ద నుంచి విజయవాడకు తరలించారు. కలిదిండి తాసిల్దార్ రామకృష్ణ ఆధ్వర్యంలో వరద బాధితులకు మంగళవారం వ్యానులలో విజయవాడకు తరలించారు.

ఈ సందర్భంగా తాసిల్దార్ రామకృష్ణమాట్లాడుతూ వరద బాధితులకు ఆహార పదార్థాలు అందించేందుకుముందుగారావడంఅభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో కొండంగి గ్రామ సంక్షేమ సమితి సభ్యులు, కొండంగి గ్రామ ప్రజలు, రెవిన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వినాయక చవితి పందిళ్లకు సింగిల్ విండో పాలసీని అమలు చేయని అధికారులు

**గుంటూరు : సెప్టెంబర్ 03 (ఆంధ్రపత్రిక)** వినాయక చవితి హిందువులకు అతి ముఖ్యమైన మరియు పవిత్రమైన పండగ అలాంటి పండక్కి ఎప్పుడు లేని విధంగా ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం హిందువుల మనోభావాలను గుర్తించి పరిగణంలోకి తీసుకొని వినాయక చవితి పందిర్ల నిర్వాహకులు ఇబ్బంది పడకుండా సింగిల్ విండో పాలసీని ప్రవేశపెట్టింది. ఈ పాలసీ అధికారుల యొక్క నిర్లక్ష్యం వల్ల మంచి జరగకపోంగా అనేక ఇబ్బందులకు మరియు గందరగోళానికి గురిచేస్తుంది దీనివల్ల హిందువులకు మంచి చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా ఉంది. ఇంకా నాలుగు రోజుల్లో వినాయక చవితి పండుగ మొదలవుబోతుండగా ఇంతవరకు 90 శాతం మంది నిర్వాహకులకు పర్మిషన్ లెటర్ లు అందకపోవడం విచారకరం అలాగే పోలీస్ స్టేషన్ కి వెళ్లిన పందిరి నిర్వాహకులపై పోలీసులు వారి యొక్క చేతివాటాన్ని చూపించడం బాధాకరమైన విషయం మరియు ఒకప్పుడు ఒక రోజుకి 100 రూపాయలు మైక్ చలానా కట్టి అట్లాగే ఎన్ని వాట్స్ వోల్టేజ్ అవసరము దానికి చలానా అట్టి



పోలీసు వారికి ఇస్తే వారు ఒక ప్రొఫార్మా ఇచ్చి పర్మిషన్లు ఇచ్చేవారు కానీ ఇప్పుడు అధికారులు అఫిడవిట్ కూడా తయారు చేయించుకుని రమ్మని చెప్పడం రోడ్లు మీద వేయకూడదు అని చెప్పడం చివరికి పర్మిషన్ కోసం వెళ్లిన నిర్వాహకుల చేత టిఫిన్ తెప్పించుకొని తినడం చూస్తుంటే చాలా బాధ వేస్తుంది అని అన్యమతస్తుల పండగలకి రోడ్లు ఆపి టెంట్లు వేసి పరదాలు పరిచి అన్ని సౌకర్యాలు పోలీసులే కల్పిస్తున్నారు అలాగే మరొక అన్ని మతస్తుల పండక్కి కరెంటు పోల్ మీద నుంచి వైర్లు లాగి స్టార్ గుర్తులకి కరెంటు ఇచ్చినప్పుడు వారిని వీరు ఏ అనుమతులు ఉన్నాయని ప్రశ్నించరు అని హిందువుల పండుగ వచ్చేటప్పటికి అధికారులకి ఎందుకని ఇంత చిన్న చూపు అని ఈ విషయం మీద ప్రభుత్వం స్పందించి ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని హిందూ ఐక్య పోరాట వేదిక అధ్యక్షులు మరియు విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు చిరుమామిళ్ల గోపికృష్ణ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో హిందూ ఐక్య పోరాట వేదిక కార్యదర్శి మరియు ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు అనిల్ బెహరా విశ్వహిందూ పరిషత్ అర్చక పురోహిత గుంటూరు జిల్లా అధ్యక్షులు ప్రత్తిపాటి మాధవ శర్మ బీజేవైఎం జిల్లా కార్యదర్శి నాని మాదిగ తాడికొండ పవన్ కుమార్ శర్మ సత్య చందు తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ అధ్యాపకుడికి పీహెచ్‌డీ



**గుంటూరు : సెప్టెంబర్ 03 (ఆంధ్రపత్రిక) :** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలోని ఈఈఈ డిపార్ట్మెంట్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పమిడి లక్ష్మినారాయణకు తమ యూనివర్సిటీ ఈఈఈ విభాగంలో పీహెచ్డీ పట్టా అందజేసిందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఈయన "ఫేసర్ మెజర్‌మెంట్ యూనిట్ ప్లేస్‌మెంట్ విత్ కంప్లీట్ అబ్జర్వబిలిటీ ఫర్ డైనమిక్ స్టేట్ ఎస్టిమేషన్ ఇన్ పవర్ సిస్టమ్" అనే అంశంపై పరిశోధన చేశారని తెలియజేసారు. ఈయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఈఈఈ డిపార్ట్‌మెంట్‌లోని ప్రొఫెసర్ మెర్సి రోసలీనా గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈయన తన పరిశోధనలో భాగంగా మొత్తం ఎస్సీఐ-1, స్కోపస్ జర్నల్స్-3, ఇంటర్నేషనల్ కాన్ఫరెన్సులు 2 ప్రచురించారని వెల్లడించారు. పీహెచ్‌డీ పట్టాపొందిన పమిడి లక్ష్మినారాయణను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషన్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

# విజయవాడ వరద బాధితులకు బాసటగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి

## శ్రీ భ్రమర ట్రస్ట్ అధినేత గళ్ళా రామ చంద్రరావు సహకారంతో అన్నార్తులకు భారీగా భోజనాలు పంపిణీ



**గుంటూరు : సెప్టెంబర్ 03 (ఆంధ్రపత్రిక) :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ పిలుపు మేరకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజయవాడ వరద బాధితులకు భ్రమర ట్రస్ట్ అధినేత గళ్ళా రామ చంద్రరావు సహకారంతో అన్నార్తులకు 10,000 భోజన ప్యాకెట్లు 20000 వాటర్ బాటిళ్ల వాహనాలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి పచ్చ జెండా ఊపి పంపారు. ఈ సందర్భముగా గళ్ళా మాధవి మాట్లాడుతూ అకాల వరద భీభత్సానికి విజయవాడ పూర్తిగా మునిగిపోవటం, సుమారుగా 1, 2 లక్షల మంది వరదల్లో ఉండటం బాధాకరమని, రాష్ట్ర ప్రభుత్వం నుండి సహాయ కార్యక్రమాలు జరుగుతున్నాయని, విపత్తుల సమయంలో ప్రజలకి అండగా నిలబడేది తెలుగుదేశం పార్టీయేనని, సమర్ధుడయిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు గత 2రోజుల నుండి విజయవాడలోనే ఉంటూ సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారన్నారని ప్రజలు కంగారుపడవద్దని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ పిలుపుతో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు వరద సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని,గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుండి తెలుగు యువత రావిపాటి సాయి కృష్ణ నేతృత్వంలో 50మంది యువకులు వాలంటీర్లుగా సేవలనందించారున్నారని, తానూ కూడా ఈ సహాయ కార్యక్రమాల్లో పాల్గొనబోతున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అడిగిన వెంటనే శ్రీ భ్రమర ట్రస్ట్ ద్వారా 10,000 భోజనాలు అందజేసిన గళ్ళ రామ చంద్రరావుకు , 20,000 వాటర్ బాటిళ్లను అందజేసిన ఆంధ్రప్రదేశ్ హోటల్ అసోసియేషన్ వారికి ఎమ్మెల్యే మాధవి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ముత్తినేని రాజేష్, మందలపు బంగారు బాబు,వై. సాంబశివరావు, పి.సుబ్రమణ్యం, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు ఆకుల శ్రీనివాస్ కుటుంబం ఆపన్న హస్తం



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 3, (ఆంధ్రపత్రిక) :** యెడతెరిపిలేని వానలు, ముంచుకొచ్చిన వరద ముప్పుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆదుకునేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్ ,ఆయన కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు.నగరం జలదిగ్బంధమై నిలువనీడ



లేక, తినడానికి తిండి లేక, గొంతు తడుపు కోవడానికి గుక్కెడు నీళ్లు కోసం అల్లాడుతున్న ప్రజలకు తమ చేతనైనంత సాయం వారు అందజేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోఆకుల శ్రీనివాస్ కుమార్ సాయం అందించడం కోసం ఎప్పుడూ ముందుంటారనీ తన సహాయ సహకార ద్వారా మరోసారి నిరూపితం చేసుకోవడం విశేషం. ఇప్పుడు కూడా వరద బాధితుల కు అండగా నిల వడానికి రంగంలోకి దిగారు ఆకుల శ్రీనివాస్. అయనే కాదు ఆయన తనయులు డాక్టర్ రాజకుమార్, ఇంజనీర్ విజయకుమార్ లు వరద బాధితులకు ఆపన్న హస్తం అందించి అండగా నిలిచారు. భవాని పురం, సీతారాసెంటర్,హెచ్ బి కాలనీ, వెలం పల్లి కాలనీ, పోలీస్ స్టేషన్ రోడ్ ఎంబీర్ పార్క్, గద్దే రామ్ మోహనరావు పార్క్ ఇంద్రకీలాద్రి అపార్ట్మెంట్, నాలుగు స్థంబాల సెంటర్, కబేలా సెంటర్,,ఊర్మిళ నగర్, దేశి సుబ్బారావు కల్యాణ మండపం తదితర ప్రాంతాలలోని వరద బాధితులనుఆదుకోవడానికి ఆయన తన కుమారులు డాక్టర్ రాజ్ కుమార్, ఇంజినీరు విజయకుమార్ లతో కలసి సహాయ కార్యక్రమాలలో పాల్గొన్నారు. నాల్గు ట్రాక్టర్ల ద్వారా మంచినీళ్లు, పాలు, బిస్కట్ పాకెట్స్,ఫుడ్ పాకెట్స్ అందించారు.ఇళ్లలో వున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ సహాయ కార్యక్రమాలలో వారితో పాటు సూర్య, రవీంద్ర,బాషా, వినయ్, ఫనీంద్ర తదితరులు వరద బాధితులను ఆదుకోవడం లో నిమగ్నమయ్యారు. ఆకుల శ్రీనివాస్ తనయుడు రాజకుమార్ ఎమ్ ఎస్ జనరల్ సర్జరీ నిమ్రా కాలేజీ విద్యార్థి. కాగా విజయకుమార్ బి టెక్ చదివి ఇంజనీర్గా సేవలందిస్తున్నారు.ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన ప్రతి సారి ఆకుల కుటుంబం బాధితులకు అండ గా నిలుస్తోంది. ఆపద్ సమయంలో అండగా నిలిచిన ఆకుల శ్రీనివాస్ కు ఆయన కుటుంబ సభ్యులకు ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు.

# వరద బాధితులకు ఆహార పట్లాలు అందజేత



**అగిరిపల్లి సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** ఆగిరిపల్లి మండల తహసిల్దార్ ప్రసాద్, గ్రామ ప్రముఖులైన పొన్నం లక్ష్మణరావు సారధ్యంలో 8 000 ఆహార పొట్లాలు సిద్ధం చేసి విజయవాడ పంపించారు. ఈ కార్యక్రమంలో సర్వేర్ గంగరాజు, ఇన్చార్జ్ ఎంపీడీవో సలాం,గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, ఆర్యవైశ్య మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. నూజివీడు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మురళి సారధ్యంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆగిరిపల్లి మండలం నుండి 30 ట్రాక్టర్లు, పంపారని తహసిల్దార్ ప్రసాద్ తెలిపారు. మండల తహసిల్దార్ ప్రసాద్ మరియు ఇన్చార్జి ఎంపీడీవో సలాం మాట్లాడుతూ ఏలూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రానున్న రెండు రోజులలో భారీ నుంచి అతి భారీ వర్షములు పడే సూచనలు ఉన్నాయని అందువల్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని వాగులు, చెరువులు, నీటి ప్రవాహాలకు దూరంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప తమ ఇంటిలో నుండి బయటకు రావద్దని గ్రామస్తులకు తెలియజేశారు.

# పార్టీ అండగా ఉంటుంది

## భరోసా కల్పించిన ముద్రబోయిన



**ఆగిరిపల్లి సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** భారీ వర్షాల కారణంగా వాగులో అనుకోని దుర్ఘటనలో గలంతై ప్రాణాలు కోల్పోయిన కుటుంబానికి తెలుగు దేశం పార్టీ అండగా నిలుస్తుందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు వాగులో గల్లంతయి మంగళవారం ఆగిరిపల్లి మండలం వట్టగూడిపాడు గ్రామానికి చెందిన నాగ వీర రాజు అనే వ్యక్తి, నిర్జీవిగా అతని మృతదేహం దొరికిన నేపథ్యంలో మృత దేహం వద్ద కు వెళ్లి కుటుంబ సభ్యులను ముద్దరబోయిన పరామర్శించారు ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆదుకునేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలుగుదేశం పార్టీ సైతం బాధిత కుటుంబానికి అండగా నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ తాళం వెంకటేశ్వరరావు, అడ్వకేట్ జొన్నలగడ్డ శివశంకర్, పోలసానపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ సర్పంచ్ నాగ మసలయ్య మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కంభంపాడు గ్రామం నుండి భోజన ప్యాకెట్లు వాటర్ బాటిల్స్ విజయవాడలోని

# వరద బాధితులకు అందజేత



**ఎ.కొండూరు సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎ. కొండూరు మండలం కంభంపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు ఆర్యవైశ్య సంఘం తరపున మంగళవారం 2500 మందికి ఆహార ప్యాకెట్లు మరియు వాటర్ బాటిల్స్ ప్రత్యేక వాహనం ద్వారా విజయవాడ లోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అందజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వరద బాధితులకు రేయింబవుళ్ళు కష్టపడుతూ బాధితులకు పునరావాస కేంద్రాలకు తరలించి వారికి కావలసిన ఆహార ప్యాకెట్లను పాల ప్యాకెట్లను వాటర్ బాటిల్స్ పంపిణీ కార్యక్రమాన్ని స్వయంగా దగ్గరుండి పరిశీలిస్తూ పంపిణీ కార్యక్రమంలో సహా క చర్యలు చేపట్టడంలో వారి సేవలు మరువరానివని కొనియాడారు. ఆపదలో ఉన్న వర్ధముంపు ప్రాంత ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి అపన్న హస్తాలు అందిస్తూఅధైర్య పడవద్దు ధైర్యంగా ఉండండి అంటూ బాధిత ప్రజలకు భరోసా కనిపిస్తున్నారు. ఎన్డీయే కూటమి నాయకులందరూ విజయవాడలో బసజేస్తూ ప్రజలకు సేవలు అందిస్తూ వరద బాధితులకు పునరావాస కేంద్రాలకు తరలిస్తూ వైద్య సౌకర్యం మౌలిక సదుపాయాలు భోజన ప్యాకెట్లు వాటర్ ప్యాకెట్లు పాల ప్యాకెట్లు అందిస్తూ ప్రజా మన్ననలు పొందుతున్నారని వీరు కొనియాడారు.

# ట్రిపుల్ ఐటీ మెస్ నిర్వాహకులపై కేసు నమోదు



**నూజివీడు, సెప్టెంబర్ 3, (ఆంధ్రపత్రిక) :** నూజివీడు ట్రిపుల్ ఐటీ ఏ ఓ ఈ నెల 2 వ తేదీన ఇచ్చిన పిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా ట్రిపుల్ ఐటీ లో ఉన్న విధ్యార్ధులను, స్టాఫ్ ను మరియు ట్రిపుల్ ఐటీ మెస్ లో పని చేస్తున్న వారిని మెడికల్ ఆఫీసర్ లను విచారించి విధార్దులకు మంచి ఆహారం పెట్టకుండా, డైనింగ్ హాల్ ను పరిశుభ్రంగా ఉంచకుండా ఉండుట వలన విద్యార్దులు సుమారు వెయ్యి మందికి పైగా అనారోగ్యముకు గత పది రోజుల నుండి గురి అయినట్లు మా విచారణలో వారు చెప్పినారు. యజమాన్యము వారు మెస్ కాంట్రాక్టర్ లకు ఇప్పటికి మూడు సార్లు ఆహారం బాగోలేదని నోటిస్ లు ఇచ్చినప్పటికి వారి ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాలేదని పిర్యాదుని పురస్కరించుకొని ఫైన్ కేటరర్స్ అండ్ సప్లయర్స్ మధు బాబు, అనూష హాస్పిటలిటీ సర్వీసెస్ మేనేజర్ అయిన పెండ్యాల నవీన్ కుమార్ అను వారిపై కేసు నమోదు చేసి వారిని కోర్ట్ లో ప్రవేశ పెడుతున్నట్లు నూజివీడు పట్టణ సిఐ ఎమ్ వి ఎస్ ఎస్ మూర్తి విలేకర్ల సమావేశంలో పేర్కొన్నారు.

# నీట మునిగిన పంట పరిశీలించిన అధికారులు



**పొన్నూరు సెప్టెంబర్ 03 (ఆంధ్రపత్రిక) :** ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి పంట పొలాలను డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. నగేష్ లాం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్ ప్రతిభ శ్రీ,, డాక్టర్ కిషోర్ వర్మ బృందం పరిశీలించారు. మంగళవారం మండల పరిధిలోని గ్రామాల్లో వారు సందర్శించారు. ఈ సందర్భంగా నీట మునిగిన పంట నష్ట నివారణ చర్యలు రైతులకు తెలియజేశారు. వరి పొలంలో ఉన్న నీటిని వెంటనే బయటికి పంపి వేయాలి.ప్రతి ఎకరానికి బూస్టర్ డోస్ గా 30 కిలోల యూరియా, 10 నుండి 15 కిలోల మ్యూ రేట్ ఆఫ్ పొటాషియం వేసుకోవాలి.ముందస్తు జాగ్రత్తగా ప్రతి ఎకరానికి క్లోరో పరిపాస్ 20 ఈసీ 400 మిల్లీలీటర్లు , కార్బన్డిజం , మ్యాంగో ప్రతిదీ కలిపిన మందు 600 గ్రాములు చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పైరు మీద పిచికారీ చేయాలి. పొటాషియం నైట్రేట్ ( మల్టీకే లేదా 13 0 45 ) ఒక కేజీ ఒక ఎకరం చొప్పున పిచికారి చేయాలి.స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ వి.రామకోటేశ్వరి స్థానిక మండల వ్యవసాయ అధికారి దేగల వెంకట్రామయ్య, వెల్లలూరు గొల్లమూడిపాడువిఏఏలు అశ్విని, అరుణ వెల్లలూరు గొల్లముడిపాడు రైతులు పాల్గొన్నారు.

## అగ్రకులస్తులకు అండగా నిలిచి తనను అవమాన పరచిన అధికారులపై

# చర్యలు తీసుకుని రక్షణ కల్పించండి

## గుంటూరు జిల్లా ఎస్పీకి ఏసుపోగుల మాధురి ఫిర్యాదు



**గుంటూరు : సెప్టెంబర్ 03 (ఆంధ్రపత్రిక) :** గుంటూరు జిల్లా వట్టి చెరుకూరు మండలం గారపాడు మాదిగ పల్లి గ్రామంలో గతంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కొంతమంది వ్యక్తులు తాను చెప్పిన పార్టీకి ఓటు వేయమని బెదిరించారని తాను నిరాకరించి తన ఇష్టం వచ్చిన పార్టీకి ఓటు వేస్తానని చెప్పటంతో తనపై కక్ష పెట్టుకొని జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు తర్వాత మాదిగపల్లి కు చెందిన కొంతమందితో కలిసి తమపై దాడి చేసి జరిగిందని ఏసుపోగుల మాధురి తెలిపారు. ఈ దాడికి సంబంధించి జూలై 29వ తేదీన గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో తన చెల్లి సింధుతో కలిసి ఫిర్యాదు చేయడం జరిగినది దీనిని మనసులో పెట్టుకొని సెప్టెంబర్ 2 వ తేది సోమవారం ఉదయం సమయంలో పల్లపాటి కోటయ్య అనే వ్యక్తి తనను జుట్టు పట్టుకుని దౌర్జన్యం చేసి కత్తితో దాడి చేసి నన్ను చంపేందుకు ప్రయత్నించి విపరీతంగా దుర్భాషలాడుతూ కొట్టడం జరిగిందని ఇంతలోనే పోలీస్ పికెటింగ్ లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ వచ్చి ఇరువురిని సర్ది చెప్పినట్లు తెలిపారు. దీనికి సంబంధించి వెంటనే వట్టిచెరుకురు పోలీస్ స్టేషన్లో రాత్రి 10 గంటల సమయంలో వట్టిచెరుకూరు సిఐ ని కలిసి ఫిర్యాదు చేయటానికి వెళ్ళగా తాను ఇచ్చిన కంప్లైంట్ తీసుకోనక తనను దూషిస్తూ అగౌరవంగా సీఐ దుర్భాషలాడటం జరిగిందని ఆవేదన వ్యక్తం చేసింది. కనీసం ఒక దళిత మహిళ అని కూడా చూడకుండా నన్ను కొన్ని గంటలసేపు అగౌరవపరుస్తూ అవమానానికి గురిచేసి అన్యాయంగా తనను కొట్టిన వారికి గౌరవ మర్యాదలు చేస్తూ తనను ఇబ్బంది పెట్టడం జరిగిందని యేసుపోగుల మాధురి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా ఒక దళిత మహిళనైన నన్ను అవమానపరిచి అసహ్యంగా మాట్లాడి భయభ్రాంతులకు గురిచేసిన అగ్రవర్ణాలకు అండగా నిలిచిన అధికారులపై మరియు తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకొని తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఏసు పోగుల మాధురి మంగళవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

## వరద బాధితుల సహాయార్థం

# దాతలు ముందుకు రావాలి

## గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్



**గుంటూరు : సెప్టెంబర్ 03 (ఆంధ్రపత్రిక) :** భారీ వర్షాలు, వరదల వలన తీవ్రంగా నష్ట పోయిన ప్రజలకు అండగా నిలవడానికి దాతలు ముందుకు రావాలని, దాతల నుండి నగదు లేదా వస్తువుల సేకరణకు గుంటూరు నగరపాలక సంస్థ ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసిందని కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని ప్రాంతాల్లో వరదలు వచ్చి ఇళ్లు కూడా ఖాళీ చేసి ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు ప్రజలు చేరుకున్నారన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అండగా నిలవడానికి అవసరమైన నగదు లేదా వస్తువులు ఇచ్చేందుకు గుంటూరు నగరంలోని దాతలు ముందుకు రావాలని కోరారు. గుంటూరు నగరంలో దాతలు అందించడానికి వీలుగా హిందూ కాలేజి సెంటర్ లోని నగరపాలక సంస్థ ట్రావెలర్స్ బంగ్లాలో లోని 5 వ నెంబర్ గదిలో సీనియర్ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సెల్ ల్లో దాతలకు వారు అందించిన నగదు లేదా వస్తువులకు తగిన రశీదు అందించి, అందుకు నిర్దేశిత రిజిస్టర్ లో వివరాలు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. వరద ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న వారికి అండగా నిలిచేందుకు గుంటూరు నగర ప్రజలు సత్వరంగా ముందుకు వస్తారాని ఆకాంక్షిస్తున్నామన్నారు. వివరాలకు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ 98499 08396 ని సంప్రదించవచ్చని తెలిపారు.

# నీట తడిసిన పొలాలు సందర్శన



**బాపట్ల సెప్టెంబర్ 03 (ఆంధ్రపత్రిక) :** బాపట్ల మండలంలోని అప్పికట్ల, పూండ్ల, గోపాపురం గుడిపూడి గ్రామాలకు సంబంధించిన వరి పంట పొలాల్లో జిల్లా వనరుల కేంద్రం, బాపట్ల ఎ.డి.ఎ అక్తర్ హుస్సేన్ మండల వ్యవసాయ అధికారి ఆర్.చంద్ర శేఖర్‌తో కలిసి సందర్శించారు.వర్షంలో తడిసిన పొలాలకు నష్టం వాటిల్లకుండా పలు సలహాలు అందించారు. గ్రామ రైతులందరితో సమావేశం నిర్వహించి ముంపుకు గురైన పొలాల్లో తీసుకోవాల్సిన చర్యలు గురించి రైతులకు వివరించటం జరిగింది. ఎ.డి.ఎ అక్తర్ హుస్సేన్ మాట్లాడుతూ పెరుగుదల దశలో వరి పైరు నీటి ముంపునకు గురైతే పొలంలో ముంపు నీటిని వీలయినంత త్వరగా బయటికి పంపించాలి. ఎకరానికి 20 కిలోలు యూరియా మరియు 20 కిలోలు మ్యూరెట్ ఆఫ్ పొటాష్ లను వేయాలి కోరారు. మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ వరిలో పాము పొడ తెగులు ఉధృతి ఎక్కువ కావటానికి అవకాశం ఉంటుంది. కాబట్టి ఈ తెగులు దుబ్బు చేసే దశ నుండి ఆకులపై మచ్చలు ఏర్పడుతాయి ఉధ్ధృతి ఎక్కువైనచో మొక్కలు ఎండిపోతాయి నివారణకు ప్రోపికొనజోల్ 100 మి. లీ ఎకరాకు కలిపి దుబ్బు బాగా తడిచేలా 15 రోజులు వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి ముంపు పరిస్థితి నెల కొన్నప్పుడు అగ్గి తెగులు ఉధృతికి వాతావరణ అనుకూలంగా ఉంటుంది కాబట్టి ముదురు ఆకులపై నూలుకండె ఆకారంలో గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు ఎర్రబడతాయి క్రమేపి మచ్చలు కలిసిపోయి పంట ఎండిపోయినట్లు కనిపిస్తుంది. దీని యొక్క నివారణకు ట్రైసైక్లోజోల్ 60 గ్రా ఎకరాకు పిచికారి చేయాలి. అలానే వరిలో జింక్ లోపం ఉంటే వరి నాటిన రెండు నుంచి ఆరువారాల్లో ముదురాకు చివర్లో ఈనెకు ఇరుపక్కల తుప్పు లేక ఇటుక రంగు మచ్చలు కనబడతాయి ఆకులు చిన్నవిగా పెళుసు గా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి మొక్కలు గిడస బారి దుబ్బు చేయవు. దీనికి ఎకరానికి 200 గ్రాములు జింకు సల్ఫేట్ ఐదు రోజులు వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలని తెలిపారు.

## కారుపర్తి శ్రీనివాస్ తండ్రి సుబ్బారావు

# పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు



**పెడన సెప్టెంబర్ 03 (ఆంధ్రపత్రిక) :** గూడూరు మండలం పోలవరం మాజీ సర్పంచ్ కారుపర్తి శ్రీనివాస్ తండ్రి సుబ్బారావు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించిన పెడన నియోజకవర్గ శాసన సభ్యులు కా గిత కృష్ణప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయ కులు. ఆయనతోపా టు తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు ప్రజలు సుబ్బారావు పార్థివ దేహానికి నివాళులర్పించారు.

## ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎన్డీఏ కూటమి నాయకులు :

### పెద్ద ఎడ్ల గాడి దగ్గర గుర్రపు డెక్క తొలగింపు



**కైకలూరు సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక ):** ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం లో విజయవాడ లో వరదల వల్ల అనేక డ్రైన్ లు పొంగి సముద్రంలో కలిసే ప్రధాన మార్గం అయిన కైకలూరు నియోజకవర్గం మండవల్లి మండలం లో సర్కార్ కాలువ పై వున్న పెద్ద ఎడ్లగాడి వద్ద గుర్రపుడెక్క, కిక్కిసు మరియు తూడు భారీగా చేరటం వలన నీటి పారుదల ఆగి కొల్లేరు లంక గ్రామాలు ముంపునకు గురయ్యి ప్రజలు అనేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ గారు అమెరికా నుంచి స్థానిక అధికారులను అప్రమత్తం చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులను ఆదేశించారు. శాసనసభ్యులు కామినేని గారి ఆదేశాల ప్రకారం ఎన్డీఏ కూటమి నాయకులు సంబంధిత అధికారులతో కలిసి పెద్ద ఎడ్ల గాడి వద్ద గుర్రపుడెక్క, కిక్కిసు మరియు తూడు ను ప్రోక్లిలెన్ సహాయం తో తొలగించి నీటిని నిలువ లేకుండా నీటి పారుదల సక్రమంగా అయ్యేల చేసారు. ఈ సందర్భంగా స్థానిక కొల్లేరు గ్రామాల వాసులు శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ గారికి కృతజ్ఞతలు తెలిపారు.

### ఎకరానికి 50 వేల రూపాయలు

## పరిహారం ఇవ్వాలి



**పెదకూరపాడు సెప్టెంబర్ 3 (ఆంధ్ర పత్రిక):** పూర్తిగా దెబ్బతిన్న ప్రత్తి పంటకు ఎకరానికి 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు అన్నారు. మంగళవారం ప్రత్తి, అపరాల పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ పెదకూరపాడు తహసిల్దార్ డేనియల్ కు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. పాక్షికంగా దెబ్బతిన్న ప్రత్తి కి 25 వేల రూపాయలు, పూర్తిగా దెబ్బ తిన్న అపరాలకు ఎకరానికి 25000, పాక్షికంగా దెబ్బ తిన్నవాటికి 15 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. పంట వేయని రైతులకు ఇన్పుట్ సబ్సిడీ పేరుతో పదివేల రూపాయలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రతినిధులు భాష్యం శివ కోటేశ్వరరావు, కంచర్ల అచ్యుతరావు, హబీబు, రామారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### వరద మృతులకు

## ప్రభుత్వం అండ



నూజివీడు సెప్టెంబర్ 3(ఆంధ్రపత్రిక )భారీ వర్షాల కారణంగా వాగులో అనుకోని దుర్ఘటనలో గలంతై ప్రాణాలు కోల్పోయిన. కుటుంబానికి తెలుగు దేశం పార్టీ అండగా నిలుస్తుందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు మంగళవారం వాగులో గల్లంతయి ఆగిరిపల్లి మండలం వట్టగూడిపాడు గ్రామానికి చెందిన నాగ వీర రాజు అనే వ్యక్తి, నిర్జీవిగా అతని మృతదేహం దొరికిన నేపథ్యంలో మృత దేహం వద్ద కు వెళ్లి కుటుంబ సభ్యులను ముద్దరబోయిన పరామర్శించారు ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆదుకునేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలుగుదేశం పార్టీ సైతం బాధిత కుటుంబానికి అండగా నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ తాళం వెంకటేశ్వరరావు, అడ్వకేట్ జొన్నలగడ్డ శివశంకర్, పోలసానపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ సర్పంచ్ నాగ ముసలయ్య మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

### ఆంగ్ల విద్యాభ్యాసానికి

## అంగన్వాడి సెంటర్లు తొలి మెట్టు:సిడిపిఓ

**హిందూపురం, సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక) :** ప్రస్తుత పరిస్థితులలో తెలుగుతో పాటు ఆంగ్ల విద్యాభ్యాసానికి ఎంతో ప్రాధాన్యత ఉందని అలాంటి విద్యాభ్యాసం అంగన్వాడి సెంటర్లలో కూడా ఆట బొమ్మలతో పిల్లలకు విద్యాభ్యాసం గావిస్తున్నామని సిడిపిఓ రెడ్డి రమణమ్మ పేర్కొన్నారు. ఈమంగళవారం హిందూపురం డివిజన్ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని హస్నాబాద్ అంగన్వాడి సెంటర్లో పోషణ్ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిడిపిఓ రెడ్డి రమణమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అంగన్వాడి సెంటర్లకు వచ్చే పిల్లలకు ఆట పాటలతో పాటు మంచి విద్యాబుద్ధులు, తెలుగు ఆంగ్ల విద్యా బోధన బోధిస్తూ పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. మంచి విలువైన బొమ్మలతో పిల్లలకు అర్థమయ్యే విధంగా తెలుగు, ఆంగ్ల విద్యాభ్యాసం గావిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్య భ్యాసం గావించి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారంటే అందుకు పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడి సెంటర్ల విద్యాభ్యాసమే ప్రధాన కారణమని సిడిపిఓ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు శాంతి, అనిత, రాధా, అంగన్వాడి వర్కర్లు శైలజ, లక్ష్మి, సునీత, సుజాత, రాజేశ్వరి, మస్తాన్ బి, షాహిదా, అంగన్వాడి పిల్లల తల్లులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలి :ఎమ్మెల్యే బివి

## వినాయక చవితి పండుగ పై అధికారుల సమీక్షా సమావేశం



**ఎమ్మిగనూరు. సెప్టెంబర్ 3 (ఆంధ్ర పత్రిక)** పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి వినాయక చవితి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ సమావేశ భవనం నందు ఏర్పాటు చేసిన విగ్రహాల భద్రత విషయంపై వివిధ శాఖల అధికారుల సమీక్షా సమావేశం మున్సిపల్ డీఈఈ నిరజా ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే బివి మాట్లాడుతూ ప్రశాంతంగా వినాయక చవితి పండుగను జరుపుకోవాలన్నారు. నిబంధనలు తూచి తప్పకుండా పండుగ జరుపుకోవాలి. డీజ సౌండ్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత వినాయక మండలి కమిటీ సభ్యులు చూసుకోవాలన్నారు. ప్రతి సంవత్సరం ఏ విధంగా జరుపుకొంటాం అదేవిధంగా జరుపుకొనేందుకు అధికారులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు. ప్రజలందుకు పోలీసులకు సారించాలని సూచించారు. వినాయక మండలి కమిటీ సభ్యులు తోగటి నర్సింహులు. శివకుమార్ మాట్లాడుతూ పట్టణంలో అంత్యంత వైభవంగా జరుపుకునే వినాయక చవితి ఉత్సవాలకు సుమారుగా 300 విగ్రహాలను వివిధ చోట్ల మండపాలలో వినాయక విగ్రహాలను ప్రతిష్టించడం జరుగుతుందన్నారు. నిమజ్జనం రోజున విగ్రహాలను తరలించే రోడ్డు మార్గంలో అడ్డంగా ఉన్న చెట్లు కొమ్ము లనుతొలగించాలన్నారు. రోడ్డు గుంతలను పూడ్చాలన్నారు. అన్న దానం కార్యక్రమం రోజు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనం పురస్కరించుకొని సోమప్ప సర్కిల్ నందు మండపాల సూచన మేరకు మైక్. స్టేజ్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సోమప్ప సర్కిల్. ఘాటు దగ్గర రెండు అంబులెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. వెంకటాపురం నుంచి ఘాటు వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. బారుగేట్లు. ఘాటు దగ్గర విద్యుత్ దీపాలు. మైక్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ప్రతి ఒక్క మండపాల నిర్వహాకులు సమయ పాలన పాటించి త్వరగ 2 గంటల నుంచి విగ్రహాలను నిమజ్జనం కార్యక్రమానికి తరలించాలని. అన్నదాన కార్యక్రమం మూడవ రోజు కాకుండా మొదట రోజు లేదు రెండవ రోజు రోజు ఏర్పాటు చేసుకుని నిమజ్జనం కార్యక్రమాన్ని తక్కువ సమయంలో ముగించాలని సూచించారు. పట్టణ ప్రశాంతతకు నిలయంగా పట్టణ ప్రజలు ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగని ప్రాంతం అని ఉత్సవాలు తర్వాత పోలీసు అధికారులకు తెలుస్తోందని అన్నారు. అనంతరం పట్టణ సిఐ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ సంతోషంగా జరుపుకునే పండుగ మండపాల దగ్గర విద్యుత్ దీపాలు వల్ల ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలి. అలాగే మండపాల దగ్గర 24 గంటలు ఎవరైనా ఒక వ్యక్తి భాద్యత వహించాలని మండపాల నిర్వాహకులకు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ గ్రామీణ పోలీస్ స్టేషన్ సీఐలు సుదర్శన్ రెడ్డి. విక్రమ్ సింహా. ఏస్ఐ లు.. రూరల్ శ్రీనివాసులు. అగ్నిమాపక కేంద్రం సీఐ.. ఆర్టీసీ డీఎం అమర్నాత్. ఎల్ ఎల్సీ అధికారులు. ఎలక్ట్రికల్ ఏడి రాఘవేంద్ర. వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

## నేటి నుంచే 80 శాతం రాయితీతో ఉలవలు పంపిణీ

### రైతులు సద్వినియోగం చేసుకోవాలి మండల వ్యవసాయ అధికారి ఢిల్లీ ప్రసాద్



**పాలసముద్రం సెప్టెంబర్ 3(ఆంధ్ర-పత్రిక):** మండల కేంద్రంలో ప్రభుత్వం 80% రాయితీతో రైతులకు ఉలవలును పంపిణీ చేయనుందని పాలసముద్రం మండల వ్యవసాయ అధికారి ఢిల్లీ ప్రసాద్ మంగళవారం తెలిపారు. అవసరమైన రైతులు నేటి నుంచి రైతు సేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని డబ్బులు చెల్లించి విత్తనాలు పొందాలన్నారు. ఉలవలు క్వింటాల్ ధర రూ. 8, 700 కాగా 80 శాతం రాయితీ పోను రైతులు కేవలం రూ. 1, 740 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు పంట పండించడానికి వాడాలని పశువులకు పెట్టరాదని. ఈ విత్తనాలలో రసాయన ఎరువులు కలిసాయని తెలిపారు. రైతులు ఈ విత్తనాలు కావాలంటే భూమికి సంబంధించిన పట్టా పాస్ బుక్ , ఆధార్ కార్డు, ఆధార్ లింక్ అయినా మొబైల్ నెంబరు ఇవ్వాలని, ఈ విత్తనాలు బయోమెట్రిక్ ద్వారా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

## ఆశా కార్యకర్తల సమీక్ష!




**పాలసముద్రం మండలం సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక):** మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక వైద్యశాలలో చిత్తూరు జిల్లా లెప్రసీ ఎయిడ్స్,టిబి ఇమ్యునిజేషన్ ఆఫీసర్ జి. వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశాల పరిధిలోని ఆశా కార్యకర్తల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాకార్యకర్తలు వారివారి ఏరియా పరిధిలో ప్రభుత్వ ఆరోగ్య పథకాలు ఆరోగ్య సేవలు గురించి ఆరోగ్యశ్రీ, తదితర వాటి గురించి గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని అదేవిధంగా ఆశా కార్యకర్తల పరిధిలో క్షయ రోగులు, కుష్టురోగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులున్నవారిని గుర్తించి వైద్యశాలకు తీసుకొనిరావాలని గర్భిణీలు నెలవారి టీకాలు వేయించుకుంటున్నారా లేదా మందులు తీసుకుంటున్నారా అని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని తెలిపారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్లు , మోహన్ కృష్ణ, లోకేష్, సిహెచ్ఓ జ్ఞాన శేఖర్,సూపర్వైజరు మురళి, ఏఎన్ఎంలు, వైద్యశాల ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు అండగా తెలుగుదేశం ప్రభుత్వం: మద్దిరాల గంగాధర్



**పెదకూరపాడు సెప్టెంబర్ 3 (ఆంధ్ర పత్రిక):** ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పనికిమాలిన వైసిపి నాయకులు కొంతమంది ఇంకా ప్రజలను మోసం చెయ్యాలని ప్రయత్నించడం బాధాకరం. చంద్రబాబు నాయుడు ఇల్లు మునిగిపోయింది.. రాజధాని మునిగిపోయిన ఇంకా సిగ్గు లేకుండా ప్రచారం చేస్తున్నారు. కేవలం రాజధాని అమరావతి మీద విషం వెళ్లగక్కుతునా వైసీపీ నాయకులు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ చంద్రబాబు మరియు ప్రభుత్వ అధికారులు ప్రజలను అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రయత్నిస్తూ ఉంటే సాక్ష్యం లేని సాక్షి ఛానల్ లేనిపోని అపోహలు ప్రజల్లోకలిగిస్తుంది అని గంగాధర్ వాపోయారు.

ఏ తుఫాను వచ్చినా, ఏ వరద వచ్చినా, ఏ రోజు ప్రజలను పట్టించుకోని గత వైకాపా ప్రభుత్వం మరియు గత ముఖ్యమంత్రి చెరువుల, కాల్వల పూడికలు తీయకుండా డ్రైనేజీ వ్యవస్థను భ్రష్టు పట్టించిన విధానం కళ్ళకు కనబడుతున్న అవేమి పట్టదన్నట్టు ఇంకా సిగ్గు లేకుండా మాట్లాడుతూ వరదలను కూడా రాజకీయం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు అని ఆయన అన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం వరద సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటుంటే ప్రతిపక్ష హోదా కావాలని నానా యాగి చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రం ప్రజల వద్దకు రాకుండా వరదలను రాజకీయం చేస్తూ... నిత్యం ప్రజల మధ్యే ఉంటూ ప్రజా అవసరాలని స్వయంగా చూసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబుని చూసి ఓర్వలేకపోతున్నారు ఆయన అన్నారు. వైకాపా అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నంతకాలం తాడేపల్లి ప్యాలెస్ లో రాజభోగాలు అనుభవించాడే తప్ప ఏనాడూ ప్రజల్లో పర్యటించిన దాఖలాలు లేవని అన్నారు.

## ఇసుక డంపులు స్వాధీనం చేసుకున్న కార్వేటినగరం సిఐ హనుమంతప్ప !

**పాలసముద్రం మండలం సెప్టెంబర్ 3(ఆంధ్రపత్రిక):** మండలంలోని పాలసముద్రం గ్రామంలో వాసు మందడి రెవెన్యూ భూమిలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 5 ట్రాక్టర్ల ఇసుక డంపులను మంగళవారం కార్వేటినగరం సిఐ హనుమంతప్ప, పాలసముద్రం ఎస్సై భారతి సీజ్ చేసినట్లు తెలిపారు. ఇసుకను రెవెన్యూ అధికారులకు అప్పగించి వాసు మందడి మీద కేసు నమోదు చేసినట్లు సీఐ హనుమంతప్ప,ఎస్ఐ భారతి తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మండలంలో ఇసుకతో సులభంగా డబ్బుసంపాదించడం అలవాటు చేసుకున్న కొంతమంది ఇసుకాసురులు రింగ్గా ఏర్పడ్డారని. పోలీసుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ చాకచక్యంగా రాత్రికిరాత్రే ఇసుక లోడింగ్ చేసి తమిళనాడుకు తరలిస్తున్నారు. గత వారం రోజులుగా పాలసముద్రం పోలీసులు తాను వరుస దాడులు చేసి ఇప్పటికీ మండల వ్యాప్తంగా 15 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్టుగా తెలిపారు. ఇసుక అక్రమ రవాణా మూలంగా భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో నీటిమట్టం పడిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల నుంచి నిత్యం పగలు, రాత్రి తేడా లేకుండా తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా సాగుతుందని స్థానికులు పేర్కొంటున్నారని. అప్పుడప్పుడు పోలీసు, రెవెన్యూ అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేసినా ఇసుక వ్యాపారుల తీరు మారడం లేదని. నిత్యం ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తమిళనాడుకు రవాణా చేస్తూ ఇసుక మాఫియా రూ. లక్షలు గడిస్తోంది. తమ ఆగడాలను అడ్డుకుంటున్న వారిపై దాడులకు సైతం తెగబడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక తరలిస్తే సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేరు గోప్యంగా ఉంచబడుతుందని ఆయన మీడియాకి పేర్కొన్నారు.

## పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం: సీడీపీవో శాంతిదుర్గ



**తొట్టంబేడు, సెప్టెంబర్ 3 (ఆంధ్ర పత్రిక):** పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం లభిస్తుందని శ్రీకాళహస్తి సీడీపీవో శాంతిదుర్గ చెప్పారు. తొట్టంబేడు మండలం రామచంద్రాపురంలోని అంగన్ వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాంతిదుర్గ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రతి యేటా పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్ వాడీ కేంద్రాల పంపిణీ చేసే పౌష్టికహారాన్ని గర్భవతులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తారన్నారు. గర్భవతులు, బాలింతలకు రక్తహీనత రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లల బరువు తగ్గకుండా చూడాలన్నారు. గర్భవతులుగా ఉన్న సమయంలో వైద్యుల సూచనలు పాటిస్తూ సరైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్భవతులు, బాలింతలు విటమినులు బాగా ఉండే ఆహారం తీసుకోవాలని సీడీపీవో శాంతిదుర్గ సూచించారు. పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటే మంచి సమాజం నిర్మాణం అవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

గర్భవతులు, బాలింతలు తమ ఆరోగ్య సలహాల కోసం వైద్య సిబ్బందితో పాటు అంగన్ వాడీ సిబ్బందిని కూడా సంప్రదించవచ్చన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ఐసీడీఎస్ పని చేస్తోందని శాంతిదుర్గ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజరు రాజేశ్వరి, అంగన్ వాడీ కార్యకర్తలు సురేఖ, మునిలక్ష్మి, కౌసల్య, అర్చన, అంగన్ వాడీ సహాయకురాలు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

### సీఐ తిమ్మయ్య, ఎస్సై ఈశ్వరయ్యను

## కలిసిన సర్పంచ్ సుబ్బయ్య





**తొట్టంబేడు, సెప్టెంబర్ 3 ( ఆంధ్ర పత్రిక):** తొట్టంబేడు మండలంలోని తొట్టంబేడు పంచాయతీ సర్పంచ్ సుబ్బయ్య తొట్టం బేడు పోలీస్ స్టేషన్ లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ తిమ్మయ్య, ఎస్సై ఈశ్వరయ్యను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్యాలవుతో సన్మానించారు. మండలంలో శాంతి, భద్రతలు కాపాడే విధంగా చూడాలని అధికారులకు తెలియజేశారు.

### కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

## వైఎస్ షర్మిల రెడ్డి

**కడప సెప్టెంబర్ 3 (ఆంధ్ర పత్రిక) :** జాతీయ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం కడప పర్యటన లో బాగంగా కడప కు వచ్చారు ఇందులో భాగంగా కడప కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైయస్ షర్మిలా రెడ్డి కి ఘనంగా స్వాగతం పలికారు ఈ సందర్భంగా కడప కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అఫ్జల్ ఖాన్ కుమారుడు హైదర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆమెకు బుకే అందించి శుభాకాంక్షలు తెలిపారు షర్మిల అందరినీ పలకరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు

### శ్రీకాళహస్తి నూతన డిఎస్పిని సన్మానించిన

## తొట్టంబేడు మండల తెలుగు యువత



**శ్రీకాళహస్తి ,సెప్టెంబర్ 3 (ఆంధ్ర పత్రిక):** శ్రీకాళహస్తి పట్టణ డిఎస్పీగా నరసింహమూర్తి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తొట్టంబేడు మండల తెలుగు యువత అధ్యక్షులు పవన్, ఉపాధ్యక్షులు చందు,ప్రధాన కార్యదర్శి గణేష్ నాయుడు మంగళవారం స్థానిక డిఎస్పి కార్యాలయంలో ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపి దుశ్యాలవుతో సన్మానించారు.

# వరద రాజకీయాలు మానుకో జగన్

### -తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం నాయకులు



**శ్రీకాళహస్తి ,సెప్టెంబర్ 3 (ఆంధ్ర పత్రిక):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఐదేళ్ల పాలనాకాలంలో విపత్కర పరిస్థితులలో బాధితుల సహాయార్థం తాడేపల్లి ప్యాలెస్ దాటి ఏనాడూ బయటకు రాని జగన్ రెడ్డి, ఈనాడు విజయవాడ వరదల విషయంలో చేస్తున్న వరద రాజకీయాలు మానుకోవాలని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం నాయకులు విమర్శించారు. అధికారంలో ఉన్నన్నాళ్ళు ప్యాలెస్‌లో కూర్చొని బాతాఖానీ పెట్టుకోవడం, బయటకు వెళ్ళాలంటే పచ్చని చెట్లు నరకడం, కొద్దిపాటి దూరానికి కూడా పరదాల మాటున ప్రయాణించడం, విపత్తులు సంభవించినప్పుడు విహంగ వీక్షణ చేసి ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ ఐదేళ్ల పాలనను ముగించిన జగన్ రెడ్డికి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధిని శంకించే అర్హత లేదని విమర్శించారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న అతి భారీ వర్షాలకు మున్నేరు, బుడమేరు వంటి వాటికి చరిత్రలో ఎన్నడూ లేనంతగా వచ్చిన వరద ప్రవాహంతో అతలాకుతలమైనప్రజలకు అండగా నిలబడి రేయింబవళ్ళు సహాయక చర్య లలో అవిశ్రాంతంగా పనిచేస్తున్న చంద్రబాబు ప్రభుత్వంపై వైసిపి నాయకులు చేస్తున్న చౌకబారు విమర్శలు వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని విమర్శించారు. విజయవాడ నగరంలో నీట మునిగిన లోతట్టు ప్రాంతాలలోని బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్న వారి ఆత్మస్థైర్యం దెబ్బతినేలా మాట్లాడుతున్న సినీనటి రోజా వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వన్నెకుల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. యం. ఉమేష్ రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, బిసి విభాగం తిరుపతి పార్లమెంటు నాయకులు చింతగింజల సునీల్, శివ, మైనారిటీ విభాగం తిరుపతి పార్లమెంటు నాయకులు సయ్యద్ చాంద్ బాషా, సులేమాన్, షేక్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.





# బాధితులు అందరినీ ఆదుకుంటాం




(మొదటిపేజీ తరువాయి)

ముంపులో ఉన్న బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లారు. వరద బాధితులకు అందుతున్న సాయాన్ని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వారి ఆవేదన, బాధను విని ధైర్యం చెప్పారు. ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రజలకు భరోసా ఇచ్చారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో రెండు రోజులుగా బసచేస్తున్న సిఎం... మూడవ రోజు మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి భవానీ పురం వెళ్లారు. ముందుగా అక్కడ బాధితులతో మాట్లాడారు. తమకు సాయం చేరిందని...ఇప్పుడు కాస్త వరద తగ్గడంతో సాంత్వన చేకూరిందని ఆ ప్రాంత ప్రజలు చెప్పారు. సితార సెంటర్ నుంచి కార్లు వెళ్లలేని పరిస్థితుల్లో కాన్వాయ్ పక్కన పెట్టి జెసిబి ఎక్కి ముందుకు కదిలారు. దారి పొడవునా బాధితులతో మాట్లాడారు. అదే జేసీబీపై జక్కంపూడి వెళ్లి అక్కడ బాధితులను కలిసి ప్రజలకు అందుతున్న వరద సాయంపై తెలుసుకున్నారు. అక్కడి నుండి వాంబే కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, నున్న, కండ్రిక ఇన్నర్ రింగ్ రోడ్ కు వచ్చారు. అక్కడికి తన కాన్వాయ్ రావడంతో అక్కడి నుంచి కారు ఎక్కి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ విధంగా దాదాపు నాలుగున్నర గంటల పాటు సిఎం అన్ని ప్రాంతాల్లో జేసీబీపైనే ప్రయాణం చేశారు. పలు ప్రాంతాల్లో బాధితుల సమస్యలు విన్న సిఎం అధికారులను పిలిచి వార్నింగ్ ఇచ్చారు. సమన్వయం లోపం కారణంగా వేగంగా సాయం అందకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల్లో బాధ్యత, భయం తీసుకురావాలనే కారణంతోనే తాను స్వయంగా మూడు రోజులుగా అన్ని ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు సీఎం తెలిపారు. అధికారులు బాధ్యత, మానవీయ కోణంలో పనిచేయాలని సిఎం అన్నారు. సరిపడా ఆహార ప్యాకెట్లు పంపుతున్నా ఎందుకు చేరవేయడం లేదని అధికారులను ప్రశ్నించారు. నీరు తగ్గని ప్రాంతాల్లో ప్రజలు పునరావాస కేంద్రాలకు రావాలని సూచించారు. సితార సెంటర్‌లో బయలు దేరిన ముఖ్యమంత్రి మళ్లీ వెనక్కి వస్తారని అధికారులు కాన్వాయ్ ను అక్కడే ఉంచారు. అయితే సిఎం అక్కడి రాకపోగా ఏ ప్రాంతానికి వస్తారో తెలియకపోవడంతో కాన్వాయ్‌ను పలు చోట్లకు తిప్పారు. ప్రతి ప్రాంతాన్ని చూడాలని, సాధ్యమైనంత ఎక్కువ మందిని కలవాలని సిఎం భావించారు.

దీంతో అనేక ప్రాంతాల్లో నాలుగున్నర గంటల పాటు ఆయన పర్యటన జేసీబీపైనే సాగింది. మధ్యాహ్నం భోజనం కూడా చేయకుండా సిఎం వరద బాధిత ప్రాంతాల్లో నే పర్యటించారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు వరద ప్రాంతం నుంచి బయటకు వచ్చారు. సితార సెంటర్ వద్ద వరద ప్రాంతంలో అడుగు పెట్టిన ముఖ్యమంత్రి పలు చోట్ల పర్యటించి రామవరప్పాడు వంతెన సమీపంలో సాధారణ ప్రాంతానికి చేరుకున్నారు. సిఎం అక్కడికి వచ్చే సరికి ఆయన కాన్వాయ్ కూడా ఆ ప్రాంతానికి రాలేదు. దీంతో మరికొంత దూరం ఆయన జేసీబీపైనే ముందుకు సాగారు.

సిఎం రూట్ పై సమాచారం అందుకున్న కాన్వాయ్ అక్కడికి చేరుకోవ డంతో అక్కడ నుంచి తన వాహనంలో విజయవాడ కలెక్టర్ కార్యాలయానికి చంద్రబాబు చేరుకున్నారు. ఈ నాలుగున్నర గంటల పర్యటనలో ఎక్కడికక్కడ అధికారులకు ఆదేశాలు, సూచనలు ఇస్తూ ముందుకు సాగారు. సిఎంతో పాటు విజయ వాడ పోలీస్ కమిషనర్ కూడా పర్యటిచారు. వరద కారణంగా ఇతర వాహనాలు వెళ్లే అవకాశం లేకపోవడంతో సిఎం సెక్యూరిటీలోని కొంత మంది సిబ్బంది మాత్రమే ముఖ్యమంత్రితో వెళ్లగలిగారు.



# అధికారుల నిర్లక్ష్యాన్ని సహించను

- మంత్రులైనా సహాయక చర్యల్లో పాల్గొనాల్సిందే
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు
- చిట్టచివరి బాధితుడికి కూడా సాయం అందాలి
- హెచ్చరించిన సీఎం చంద్రబాబు



**విజయవాడ, సెప్టెంబర్ 3 (ఆంధ్రపత్రిక):**వరద బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపట్టామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. కొన్ని చోట్ల ఆహారం అందలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విజయ వాడ కలెక్టరేట్ వద్ద మీడియాతో సీఎం మాట్లాడారు. నగరంలో డివిజన్‌కు ఒక సీనియర్ ఐఏఎస్‌ను నియమించామని చెప్పారు. 32 మంది ఐఏఎస్ అధికారులు సహాయక చర్యల్లో ఉన్నారన్నారు. పది జిల్లాల నుంచి ఆహారం సమకూర్చామని.. బాధితులకు మూడు పూటలా అందించాలని ఆదేశించినట్లు చెప్పారు. చిట్టచివరి బాధితుడికి కూడా సాయం అందాలని స్పష్టం చేశారు. వరదలతో పేదల బాధలు వర్ణనాతీతం. కొన్ని ఇళ్లల్లోకి పాములు, తేళ్లు వచ్చాయి. దీంతో వారందరికీ బాధ, భయం ఉంటుంది. అధికారులంతా మానవతా దృక్పథంతో పనిచేయాలి. అందుతున్న సహాయంపై ఐవీఆర్ఎస్ నిర్వహిస్తున్నాం. కొన్ని ప్రాంతాలకు ఇంకా ఆహారం అందలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఆహారం అందని బాధితుల నంబర్లు అధికారులకు పంపిస్తున్నాం. ఇబ్బందులపై ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలి. నేను కూడా ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నా. అధికారులకు రెండు రోజులుగా చెప్పాం.. ఇప్పుడు సరిగా పనిచేయలేదని ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవు. మీనమేషాలు లెక్కించడం సరికాదు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు సర్వశక్తులూ ఒడ్డి సేవ చేయాలి. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నా. ఈ కష్ట సమయంలో బాధితులకు అండగా నిలవాలి. ఏ విధంగా సహకారం అందించగలిగితే అలా చేయూత అందించాలి. ఆర్థికంగా, నిత్యావసరాలు, సహాయ కార్యక్రమాల్లో పాల్గొనడం.. ఇలా ఏది వీలైతే అది మీ శక్తిమేర చేయాలి. ప్రభుత్వం తరపున చేయాల్సిందంతా చేస్తామని సీఎం అన్నారు.

# ప్రకాశం బ్యారేజీ సేఫ్



**విజయవాడ,ఆగస్టు 3 (ఆంధ్రపత్రిక):** భారీ వరదల కారణంగా ప్రకాశం బ్యారేజీ గేట్లకు ముప్పు ఏర్పడింది. సోమవారంనాడు ఎగువ నుంచి కొట్టుకువచ్చిన ఐదు పడవలు.. బ్యారేజీ గేట్లకు అడ్డుపడ్డాయి. వాటిలో ఒకటి వరద ధాటికి దిగువ ప్రాంతానికి కొట్టుకుపోగా..ఇంకా మూడు పడవలు అక్కడే ఉన్నాయి. వాటిలో ఒకటి గేట్ల కిందిభాగంలో చిక్కుకుంది. బ్యారేజ్‌ను పడవ బలంగా ఢీకొట్టడంతో గేటు కౌంటర్ వెయిట్ ధ్వంసమైంది. దీంతో మరమ్మతుపై దృష్టిపెట్టిన ప్రభుత్వం..ఇటీవల తుంగభద్ర జలాశయానికి స్టాప్‌లాక్ ఏర్పాటు చేసిన సీనియర్ ఇంజినీరు కన్నయ్యనాయుడిని విజయవాడ పిలిపించింది. పడవలు అడ్డుపడటంతో ప్రకాశం బ్యారేజీ గేట్లకు ఏర్పడిన నష్టంపై ఆయన నేరుగా పరిశీలించారు. కన్నయ్య నాయుడు సూచనలతో పిల్లర్, గేట్స్ రిపేర్ చేపట్టింది ప్రభుత్వం. బోటు ప్రమాదంతో బ్యారేజ్‌కు ఎలాంటి డ్యామేజ్ జరగలేదని..కౌంటర్ వెయిట్ మాత్రమే ధ్వంసమయిందని కన్నయ్య నాయుడు తెలిపారు. ఒక గేటుకు మాత్రమే బోటు తగిలిందని తెలిపారు. ఒక్క గేటుకే సమస్య ఏర్పడినందున మిగిలిన గేట్లు ఎత్తేందుకు ఎలాంటి సమస్యా లేదన్నారు.




విపత్తుల నిర్వహణ కార్యాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు భారీ వర్షాలు, వరద ప్రభావిత పరిస్థితిని వివరిస్తున్న రెవిన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా

# వరద బాధితులకు పవన్ కళ్యాణ్ విరాళం



**విజయవాడ,సెప్టెంబరు 3 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ వరద బాధితులకు కోటి రూపాయల విరాళం ప్రకటించారు. వ్యక్తిగతంగా ఈ విరాళాన్ని ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి ఈ విరాళాన్ని ఇస్తున్నట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు. అంతకు ముందు ఏపీలోని వరద ప్రాంతాల్లో సహాయక చర్యలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీక్ష నిర్వహించారు. విజయవాడలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో.. వరద విలయానికి సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్ వీక్షించారు పవన్. ఈ సందర్భంగా వరద ప్రాంతాల్లో పరిస్థితులను అధికారులు పవన్‌కు వివరించారు. కాగా బుధవారం సీఎంకు తన విరాళం అందజేస్తానని పవన కల్యా ణ్ వెల్లడించారు. ప్రజలు సహాయం కోసం 112, 1070, 18004250101 ఫోన్ చేయాలని సూచించారు. 'నేను వరద ప్రాంతాల్లో పర్యటించాలను కున్నాను. కానీ, సహాయ కార్యక్రమాలకు ఆటంకం ఉండకూడదని భావిస్తున్నా' అని పవన్ కళ్యాణ్ తెలిపారు.

# వరద నీటిలోనే మహిళ ప్రసవం

## సురక్షిత ప్రాంతానికి తీసుకొచ్చిన అధికారులు



**విజయవాడ,ఆగస్టు 3 (ఆంధ్రపత్రిక):**ఆంధ్రప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో వరదలు ముంచెత్తుతున్నాయి. వరదలో చిక్కుకున్న వారిని పడవల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలోనే గర్భిణీలు, చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు ఉన్న వారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వారు ఇళ్లల్లో ఉండలేక.. బయటికి వెళ్లలేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా వరద నీటిలోనే ఓ మహిళ ప్రసవించిన ఘటన విజయవాడలో చోటు చేసుకుంది. విజయవాడ నగరం మొత్తం వరద గుప్పిట్లో చిక్కుకుంది. చాలా ప్రాంతాల్లో వరద నీటిలోనే మునిగిపోయాయి. ఈ క్రమంలోనే అజిత్ సింగ్ నగర్ కూడా పూర్తిగా వరదలో మునిగిపోయింది. అజిత్ సింగ్ నగర్‌లోని డాబాకొట్టు సెంటర్ ప్రాంతంలో నివసిస్తున్న ఓ నిండు గర్భిణీకి పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో ఏం చేయాలో అర్థం కాని కుటుంబ సభ్యులు.. దిక్కు తోచని స్థితిలో విజయవాడ పోలీసులకు సమాచారం అందించారు. అయితే విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆలోపే ఆ మహిళ ప్రసవించింది. అయితే వరద ప్రాంతంలోనే గర్భిణీ ప్రసవించిన విషయం తెలుసుకున్న విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు.. స్వయంగా ఆ ప్రాంతానికి వెళ్లారు. తల్లీ, బిడ్డ ఇద్దరినీ బోటులో అజిత్ సింగ్ నగర్ నుంచి బయటికి తీసుకువచ్చారు. అనంతరం అక్కడి నుంచి అంబులెన్స్ ద్వారా దగ్గర్లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com